ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Tadepalligudem, Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
28-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 357 పేజీలు: 8+4 వెల: 6.50

ఫుట్‌బాల్ మైదానంలో కాల్పులు, 11 మంది మృతి

ఇరాన్‌పై దాడికి అమెరికా యుద్ధనౌక సిద్ధం 5లో


ఇయు-భారత్ వాణిజ్య ఒప్పందం సందర్భంగా మంగళవారం న్యూఢిల్లీలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియోతో ప్రధాని మోడీ

## ఇయు-భారత్ మధ్య
# స్వేచ్ఛా వాణిజ్యం

- ఇండియా వాణిజ్య చరిత్రలోనే అతిపెద్ద డీల్
- 180 బిలియన్ యూరోల స్థాయికి వాణిజ్యం
- ఇయు దేశాల్లో 8 లక్షల భారతీయులు
- ఒప్పందం అనంతరం మీడియాతో ప్రధాని మోడీ, ఇయు నేతలు

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్ - యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎఫ్‌టీఏ భారత వాణిజ్య చరిత్రలోనే అతి పెద్దదిగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాకుండా, ఇరుదేశాల సంక్షేమానికి బ్లూప్రింట్‌గా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో భారత వాణిజ్యంలో సరికొత్త శకం ప్రారంభమవుతుందని ఆశాభావంవ్యక్తంచేశారు. మంగళవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో >>2

రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ 2లో

## 10 జిల్లాల్లో 20 పైగా
# సాగునీటి ప్రాజెక్టులు

- పూర్వోదయ నిధులతో సమగ్రాభివృద్ధి
- పెండింగ్ ప్రాజెక్టులు తొలుత పూర్తి చేద్దాం
- డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యానవన అభివృద్ధిపై సమీక్షించిన సిఎం చంద్రబాబు


మంగళవారం అమరావతిలో ఉద్యానరంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** గ్లోబల్ మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. దానికి అనుగుణంగా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పతులను పండించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సిఎం సూచించారు. 10 జిల్లాలను ఉద్యాన రంగానికి కేంద్ర బిందువుగా చేపట్టే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్య మంత్రి చంద్రబాబు సమీక్షించారు. పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమయంలో సీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిరక్ష్యం చేసిందని... చాలా వరకు ప్రాజెక్టులను పెండింగులో పెట్టేసిందని మంత్రులు నిమ్మల, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని... అలాగే తక్కువ నిధులను కేటాయిస్తే త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులను తొలుత చేపట్టాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే గత ప్రభుత్వం నిరక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు నగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ దిశగా సుమారు 20కు పైగా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు.

మొత్తంగా ఈ ప్రాజెక్టుల ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు, అలాగే 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీళ్లు అందించవచ్చని అధికారులు సిఎంకు తెలిపారు. సీమ ప్రాజెక్టులతో పాటు... ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలవరం ఎడమ కాల్వ పనులు పూర్తి అయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్ల వచ్చన్నారు. అప్పుడు పోలవరంవంశధార నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టవచ్చని సూచించారు. ఈలోగాఉత్తరాంధ్ర ప్రాంతం >>2

# అమరావతికి చట్టబద్ధ బిల్లుపై కేంద్రాన్ని కోరాం



## అఖిలపక్ష సమావేశం వివరాలు తెలిపిన టిడిపి పార్లమెంటరీ నేత కృష్ణదేవరాయలు
నేటినుంచి పార్లమెంటు

**విజయవాడ.జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతికి చట్టబద్దత కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రాన్ని కోరినట్లు టిడిపి పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టిడిపి పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి ప్రయోజనాలతో పాటు దేశవ్యాప్త సమస్యలను లేవనెత్తినట్లు ఎంపీ తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భేటీలో ప్రధానంగా 16 యేళ్లలోపు యువతకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా నిషేధించాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చజరగాలని కోరినట్లు తెలిపారు. పొగాకుపై సెస్‌స్థానంలో జీఎస్టీ ప్రవేశపెట్టడంవల్ల చాలా గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ అంశంపై చర్చ జరిగి సమస్య పరిష్కారం జరగాలని కోరానన్నారు. ఛార్జ్‌షీట్ నమోదైనా చాలా మంది క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఈ అంశంపైనా పార్లమెంటులో చర్చ అవసరమని లేవనెత్తినట్టు ఎంపీ చెప్పారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరామన్నారు ఎంపీ. పూర్వోదయ పథకం కింద ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను చేర్చినట్లే ఆంధ్ర ప్రదేశ్‌కూ ఈ పథకం వర్తింపజేయాలని.. దీనిపై చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద ఎపికి 26 వేల కోట్లు మంజూరైనా.. రాష్ట్ర వాటా కింద నిధులు సమకూర్చాల్సి వస్తుందని, కేవలం రూ.2 వేల కోట్ల కేంద్ర నిధులు మాత్రమే వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చగలిగితే రాష్ట్రం వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందని, ఈ అంశంపై చర్చ జరగాలని ప్రతిపాదించామని లావు శ్రీకృష్ణదేరాయలు పేర్కొన్నారు.

## వ్యక్తిత్వ హక్కులపై ఢిల్లీ హైకోర్టుకు అకీరా నందన్

ఎఐ సినిమా లవ్‌స్టోరీపై నిషేధం విధించిన కోర్టు

యూట్యూబ్, ఫేస్‌బుక్‌కు నోటీసులు



**విజయవాడ.జనవరి 27.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఎఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్‌లో పేర్కొన్నాడు అకీరా. ఎఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో >>2

## ఇంజినీరింగ్ విద్యార్థి హాస్టల్ గదిలో ఆత్మహత్య

నారాయణవనంలో విషాదం

**నారాయణవనం(తిరుపతి జిల్లా), జనవరి 27 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుత్తూరు సమీపం నారాయణవనం మండలం పరిధి సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం (ఇఇఇ) బిటెక్ చదువుతున్న ప్రదీప్‌కుమార్(19) ఓ ప్రవేటు హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. విద్యార్థి ఆత్మహత్యకు సంబందించి వివరాలుఇలా వున్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్ >>2

నరసరావుపేటలో మరో విద్యార్థి ఆత్మహత్య 2లో

## కార్మిక హక్కుల భద్రతకే
# కొత్త లేబర్ కోడ్

కేంద్ర కార్మిక శాఖమంత్రి శోభాకరండ్లజే

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల పెంపుతోపాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే కొత్త లేబర్ కోడ్‌ల ప్రధాన లక్ష్యమని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే తెలిపారు. స్థానిక నోవాటెల్ హోటల్‌లో మంగళవారం కొత్త కార్మిక సంస్కరణలపై ప్రాంతీయ సదస్సు జరిగింది.ఈ సదస్సేలో కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే మాట్లాడుతూ.. దేశంలో నవంబర్ 21న కొత్త లేబర్ కోడ్ (కార్మిక చట్టం) అమలులోకి వచ్చిందన్నారు. ఈ కొత్త చట్టం రాబోయే రోజుల్లో ఉద్యోగులు, యజమానుల జీవితాల్లో గొప్ప మార్పును తీసుకువస్తుందన్నారు. మన దేశంలో బ్రిటిష్ కాలం నాటి 29 పాత చట్టాలు అమలులో ఉండేవన్నారు. ఆ చట్టాలు మన కార్మికులకు అనుకూలంగా తీసుకురాలేదన్నారు. నవభారతంలో, కొత్తతరం కోసం కొత్త చట్టాలఅవసరం ఉందన్నారు. దీన్ని గుర్తించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కార్మిక మరియు ఉపాధి శాఖ ఈ కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మిక రంగం అనేది రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశమని, దీని అమలు బాధ్యత >>2


మంగళవారం విజయవాడలో జరిగిన సదస్సులో కేంద్ర మంత్రి శోభా కరండ్లజే, రాష్ట్ర మంత్రి వాసంసెట్టి సుభాష్

## ఇది 'డబులింజన్'
# బుల్లెట్ రైలు

## టిడిపి బలం, బలగం కార్యకర్తలే

- మంత్రులు వారానికోసారి పార్టీ కార్యాలయానికి రావాలి
- అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు
- పార్లమెంటరీ కమిటీ వర్క్‌షాప్‌లో మంత్రి లోకేష్
- శిక్షణ తరగతులను ప్రారంభించిన మంత్రి


మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** "మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలి. తెలుగుదేశం పార్టీ బలం, బలగం కార్యకర్తలు. పార్టీ అంటే కమిట్‌మెంట్ ఉంది కాబట్టే పార్టీ కమిటీల్లో బాధ్యత కల్పించాం. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్. అనేక పరిశ్రమలు ఎపికి వస్తున్నాయంటే కారణం చంద్రబాబు" అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులకు ఇటీవల నియమించిన 25 పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులందరూ హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "పార్లమెంట్ కమిటీల్లో మొదటిసారి ఎన్నికైన వారు 83శాతం మంది ఉన్నారు. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తాను. దానికి మీరో ఉదాహరణ" అని పేర్కొన్నారు.

దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తలు ఒక్క తెలుగు దేశానికే సొంతం. మన బలం, బలగం మన కార్యకర్తలు అని అన్నారు. "దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్, ఆయన ఎప్పుడూ ఓ ట్రెండ్ సెట్టర్. 75 యేళ్ల వయసులో కూడా యువకుడిలా పనిచేస్తున్నారు. ఆయనలో ముగ్గురు 25 ఏళ్ల యువకులు ఉన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు సేవ చేయాలని నిత్యం ఆలోచించే వ్యక్తి >>2

## పార్టీకి పనిచేయకపోతే
# బాధ్యత నుంచి తప్పిస్తా

**విజయవాడ.జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో కూడా ఓటమి చవి చూడని పార్టీగా రాష్ట్రంలో టిడిపికి గట్టిపునాదులు వేయాలని ఆ పార్టీ జాతీయ నేత, సిఎం చంద్రబాబు అన్నారు.43 యేళ్ల మన పార్టీకి 48 యేళ్ల యువ నాయకత్వానికి బాధ్యత అవసరమన్నారు.ఇప్పుడు సగటున ఆ వయస్సు వారే మన పార్టీ కీలక నాయకులు ఉన్న విషయం గమనించాలన్నారు.పార్లమెంటరీ కమిటీలతో చంద్రబాబు సమావేశం ముగిసింది. పార్టీ కోసం పనిచేయని వారిని తప్పించేందుకు వెనుకాడనని తెలుగుదేశం పార్టీ అధినేత,ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎవరికైనా పార్టీనే కీలకమని ఈ సందర్భంగా సిఎం గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో 10 ఓట్లు పెరగాలే కానీ తగ్గకూడదని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి చెప్పే బాధ్యత పార్లమెంట్ అధ్యక్షులు తీసుకోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

- పార్లమెంటరీ కమిటీల సమావేశంలో సిఎం చంద్రబాబు
- యువ నాయకత్వంపైనే పార్టీ భవిష్యత్తు

**హంద్రీనీవా నీరు తెస్తామని డ్రామాలు:** పవిత్రమైన తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పాలు లేకుండానే నెయ్యి తెచ్చారనీ, దాన్ని కూడా సమర్థించుకుంటున్నారంటే ఏం చేయాలని ఆక్షేపించారు. కుప్పంలో హంద్రీనీవా నీరు తెస్తున్నామని డ్రామా ఆడారని దుయ్యబట్టారు. మరుసటి రోజు గేటు ఎత్తుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండను కూడా పూర్తి చేయకుండా జాతికి అంకితం చేశారని మండిపడ్డారు. మనం చేసే పనులు ఎంత ముఖ్యమో తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పి కొట్టడం అంతే ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా, మీడియాలోనే కాదు. మౌత్ టు మౌత్ కూడా చెప్పాలనీ, అప్పుడే అందరిలో అర్థమవుతుందని సిఎం చంద్రబాబు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. 4వ సారి ముఖ్యమంత్రి అయినా సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ >>2


మంగళవారం మన్యం జిల్లా శంబర గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన సిరిమాను సంబరం

## అంబరాన్నంటిన
# సిరిమాను సంబరం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సంధ్యారాణి

**మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 27 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం మంక్కువ మండలం శంబర గ్రామంలో వైభవంగా జరిగింది. సిరిమాను సంబరాన్ని తిలకించేం దుకు రాష్ట్రం నలుమూలల నుండి పక్క రాష్ట్రాల నుండి సుమారు రెండున్నర లక్షల పైగా భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి >>2


మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

# రాహుల్‌తో షర్మిల భేటీ

**విజయవాడ,జనవరి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై ఆమె రాహుల్‌గాంధీతో చర్చించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్రంలో చేసే పోరాటంలో పాల్గొనాలని రాహుల్‌ని కోరారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి ఫిబ్రవరి 2న 20 ఏళ్ల పూర్తవుతున్నాయి. బీజేపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందనే అంశంపై షర్మిల్ రాహుల్‌తో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరణకు ఎపిలో భారీ ఎత్తున ఉద్యమం చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని తొలుత ప్రారంభించింది ఎపిలోనే అని రాహుల్‌కు ఆమె వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచి రాష్ట్రంలో ఉద్యమం ప్రారంభిస్తామని రాహుల్‌కు తెలిపారు. రాహుల్‌తో భేటీ అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఉపాధి హామీ పోరాటానికి రాష్ట్రానికి రావాలని రాహుల్‌ని ఆహ్వానించినట్లు వివరించారు.రాహుల్ గాంధీ వచ్చేందుకు అంగీకరించారన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.

## ఎపి సచివాలయ సిఎస్ఓ మల్లికార్జునరావుకు

# ఇండియన్ పోలీస్ మెడల్



**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం ముఖ్య భద్రతాధికారి(సిఎస్ఓ)గా పని చేస్తున్న పోలవరపు వెంకట శేష నాగ మల్లికార్జునరావుకు భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక మెడల్ అయిన మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఇండియన్ పోలీస్ మెడల్)ను జనవరి 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం సిఎస్ఓగా పనిచేస్తున్న మల్లికార్జునరావు కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు వాస్తవ్యులు వీరి బాల్యం మరియు విద్యాభ్యాసం గుడివాడలోను, ఉన్నత విద్యాభ్యాసం విజయవాడలోను సాగింది.1989వ సంవత్సరంలో బిటిబిపి (పారా మిలటరీ)లో కులు,హిమాచల్ ప్రదేశ్‌లో ట్రైనింగ్ చేసి అక్కడ నుంచి వివిధ యూనిట్లో ఢిల్లీ,హర్యానా,చండీగఢ్ నందు విధులు నిర్వర్తించారు.అనంతరం 1993 సెప్టెంబర్‌లో బిటిబిపి నుంచి పర్మినెంట్ అబ్జార్షన్ మీద ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎపి ఎస్పిఎఫ్)లో చేరారు. మల్లికార్జునరావు ఎపి ఎస్పిఎఫ్‌లో 1993 నుంచి వివిధ యూనిట్లలో అనగా డిజి ఎస్పిఎఫ్ హెడ్ క్వార్టర్స్ హైదరాబాద్,ఐడిపిఎల్,ఏపీ హైకోర్టు, కెటిపిఎస్ పాల్వంచ,ఆర్టీపిపి కలమల,టిటిడి తిరుమల,ఒఎన్జిసి రాజమండ్రి,కడప, రామగుండ్రి, విజయవాడ విమానాశ్రయంలోను, జీపిపి విజయవాడలో పని చేశారు. అదే విధంగా విజయవాడ జోన్ కమాండెంట్ కార్యాలయంలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారిగా,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గాను విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎపి సచివాలయంలో ముఖ్య భద్రతాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.అంతేకాక బిటిబిపి మరియు ఎపిఎస్పిఎఫ్‌లో 1989 నుంచి చేసిన సేవల గుర్తింపు క్యాష్ రివార్డ్స్ 27,గుడ్ సర్వీస్ ఎంట్రీస్17 కమెండేషన్08 ఎప్రిసియేషన్04 మరియు ఏపీ పోలీస్ మెడల్స్ అనగా 2006 ఏపీ పోలీస్ సేవా పథకం,2013లో ఏపీ ఉత్తమ సేవా పథకం వంటి అవార్డులు పొందారు. బిటిబిపి మరియు ఏపీఎస్పిఎఫ్ లో చేసిన 36 సంవత్సరాల సేవల్లో మరియు ఎన్నో రివార్డ్స్,అవార్డ్స్ మరియు పథకాలు పొందిన ప్రస్తుత సచివాలయం ముఖ్య భద్రతాధికారైన అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జున రావు సేవలను గుర్తించి భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక మెడల్ అయిన మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఇండియన్ పోలీస్ మెడల్)ను జనవరి 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించింది.మల్లికార్జున రావుకు ఇండియన్ పోలీస్ మెడల్ రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు డిజి,ఐజి, కమాండెంట్లు,ఏపీఎస్పీఎఫ్ సెక్రటేరియట్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఢిల్లీ హైకోర్టుకు అకీరా నందన్

>> నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించారు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఏఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరీ సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్ ఫేక్ సాంకేతిక పరికరాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యక్తీకరించిన కంటెంట్‌ను రూపొందించడం ద్వారా అతని గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనని పేర్కొంది.
ఈ వీడియోకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు తొలగించాలని, ఎపి వివరాలను బహిర్గతం చేయాలని మెటా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, ఎక్స్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు జరిగింది. అకీరా నందన్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. గూగుల్‌తరఫున ఆదిత్యాగుప్తా, మెటాతరఫున వరుణ్‌పాఠక్ న్యాయవాదులు కోర్టులో హాజరయ్యారు.

# నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**నరసరావుపేట క్రైమ్, జనవరి 27, ప్రభాతవార్త:** నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ విట్ ఇంటర్ కళాశాల విద్యార్థి కొరకుల బాల కోటిరెడ్డి(17) అనే సీనియర్ ఇంటర్ విద్యార్థి హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన బాల కోటిరెడ్డి ఆక్స్‌ఫర్డ్ విట్ ఇంటర్మీడియట్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్నాడు. రాత్రి హాస్టల్ గదిలో ఒంటరిగా ఉండగా, ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని తెలుస్తోంది. హాస్టల్ వార్డెన్ మరియు రూమ్‌మేట్లు గది తలుపు తెరిచి చూడగా అతడు ప్రాణాలు కోల్పోయి ఉన్నాడని గుర్తించారు. వెంటనే స్థానికులు మరియు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యే అని నిర్ధారించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు ఏమిటనే విషయంలో స్పష్టత లేదు. చదువు ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# కార్మిక హక్కుల భద్రతకే కొత్త లేబర్ కోడ్

>> రాష్ట్రాలదే అన్నారు. అందుకే వివిధ ప్రాంతాల్లోని అధికారులు, మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త లేబర్ కోడ్ ద్వారా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలి, ఇ.పి.ఎఫ్.ఓ ఇ.ఎస్.ఐ సౌకర్యాలను అసంఘటిత రంగంలోని 90 శాతం కార్మికులకు ఎలా అందించాలి అనే అంశాలపై చర్చిస్తున్నామన్నారు. కొత్త చట్టాల ప్రకారం మహిళలకు సమాన పనికి సమాన వేతనం లభిస్తుందన్నారు. పని పూర్తి చేసిన ఒక వారంలోపే వేతనాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి ఎన్నో మార్పులను రాష్ట్రస్థాయిలో, తాలూకా, జిల్లా స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.. ఇదివరకే గోవా, జైపూర్‌లలో సమావేశాలు జరిగాయని ఇప్పుడు విజయవాడలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో లక్నో, గౌహతి ల్లో కూడా నిర్వహిస్తామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె తెలియజేశారు.
రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ మాట్లాడుతూ.. గోవా, జైపూర్ తర్వాత ఈ మూడవ ప్రాంతీయ సదస్సు మన రాష్ట్రం విజయవాడలో జరగడం గర్వకారణమన్నారు. కొత్త కార్మిక చట్టాల పట్ల కార్మికుల్లో ఉన్న అపోహలను తొలగించడానికి, వారిలో అవగాహన కల్పించడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. మహిళల భాగస్వామ్యం పెంచి, వారి భద్రత కోసం పని ప్రదేశాల నుండి ఇంటి ముంగిట వరకు రక్షణ కల్పించడం జరుగుతుందున్నారు. లింగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా వేతనాలు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో 50 సీట్ల ఈఎస్ఐ మెడికల్ కాలేజీ, అమరావతిలో కొత్త మెడికల్ కాలేజీతో పాటు 150 పడకల సెకండరీ కేర్ హాస్పిటల్, 500 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నెల్లూరు, శ్రీసిటీ, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆసుపత్రుల కోసం భూముల కేటాయింపు, విజయనగరంలో ఈఎస్ఐ ఆసుపత్రి పనుల ప్రారంభం జరుగుతుందన్నారు. పని ప్రదేశాల్లోనే వైద్య శిబిరాల ద్వారా షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, ఐటీ ఆధారిత డిజిటల్ సిస్టమ్స్, ఆన్‌లైన్ సేవల ద్వారా పారదర్శకతను పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను సవరించి, కార్మికుల ఆరోగ్యం, భద్రత, న్యాయం కోసం నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకువచ్చామని, వీటిపై మీడియా మిత్రులు కూడా అవగాహన కల్పించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు.

# బాధ్యత నుంచి తప్పిస్తా

>> తరగతుల్లో పాల్గొన్నారు. టిడిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత చివరి సీట్లో కూర్చుని శిక్షణ తరగతులను ఫాలో అయ్యారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ తరగతికి చంద్రబాబు హాజరయ్యారు. నాయకులు చెప్పేది శ్రద్ధగా విని వర్క్ షాప్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేష్ ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వర్క్ షాప్‌లో సిఎంతో పాటు నారా లోకేశ్ పాల్గొన్నారు.


ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే జయకృష్ణ

# అంబరాన్నంటిన సిరిమాను సంబరం

>> సంధ్యారాణి, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, తోయక జగదీశ్వరిలు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిఘటాలను మోస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 2:30కు ప్రారంభం అవ్వాల్సిన సిరిమానోత్సవం ఎన్నడూ లేని విధంగా సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ప్రారంభం అయ్యింది. అమ్మవారి ఘటాలను సిరిమాను నుంచి మేళతాళాల నడుమ చదురు గుడి నుండి స్థానిక కార్యనిర్వాహక అధికారి బి.శ్రీనివాసరావు,ఆలయ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు మరియు గ్రామ పెద్దలు సమక్షంలో కమిటీ సభ్యులు పూజారి జన్ని పేకాపు జగదీశ్వరరావును భుజాలపై మోసుకుని వచ్చి సిరిమాను అధిరోహింప చేశారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న తదుపరి అమ్మవారు నాయుడుగా పేరొందిన పూడి వారి ఇంటికి వెళ్లి పూజలు అందుకున్నారు. అనంతరం నడిమి వీధి మీదుగా ఎస్సీ వీధి పనుకు వీధినుండి తిరుగు ముఖం పట్టిన అమ్మవారు మరల గొల్ల వీధి మీదుగా సావిడి వీధికి చేరుకున్నారు. సిరిమాను నుండి పూజారిని కిందికి దింపే కార్యక్రమం సాయంత్రం 6:30 గంటలకు ముగిసింది. పూజారి చదురు గుడికి వెళ్లిన వెంటనే సిరిమాను రథాన్ని మూడు రోడ్ల కూడలి సమీపంలో బోల్తా పడవేశారు. దీంతో సిరిమానోత్సవం ముగిసింది. సిరిమాను ముగిసే సమయానికే పారిశుద్ధ్య కార్మికులు ఎన్నడూ లేని విధంగా అప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఎక్కడ అపారిశుద్ధ్యానికి తోవ లేకుండా పారిశుద్ధ్య పనులను చేపట్టామని ఎంపిడిఓ అర్జునరావు తెలిపారు. జాతర ముగిసిన అనంతరం వెనుదిరిగిన భక్తులు, మక్కువ రహదారిలో ఎస్ఆర్ పురం ప్రాంతంలో రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

# ఇయు-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

>> జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరో పియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి ప్రధాని మోడీ మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు తొలిసారి ఇయు నేతలు ముఖ్య అతిథులుగా హాజరైన మరుసటి రోజే కీలక ఒప్పందం కుదరడం చరిత్రాత్మక ఘట్టమని ఆయన అన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్ ఈయూ సంబంధాలు వేగంగా బలోపేతమయ్యాయని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక అనుబంధం, ప్రజల మధ్య బంధాలే దీనికి పునాదిగా నిలిచాయని తెలిపారు. ప్రస్తుతం భారత్ ఇయు మధ్య వాణిజ్యం 180 బిలియన్ యూరోల స్థాయికి చేరిందని వెల్లడించారు. ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయులు ఈయూ దేశాల్లో నివసిస్తూ అక్కడి సమాజాలకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ పాలన, అభివృద్ధి భాగస్వామ్యం వంటి రంగాల్లో విస్తృత సహకారం కొనసాగుతోందని మోడీ తెలిపారు. ఈ ఒప్పందంతో రైతులు, చిన్న వ్యాపారులు, సేవల రంగానికి చెందినవారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. యూరోపియన్ మార్కెట్లకు భారత ఉత్పత్తులకు మరింత విలువ లభిస్తుందని, పెట్టుబడులు పెరుగుతాయని, సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు. 16వ భారత్ - ఇయు సదస్సు సందర్భంగా ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం కీలక ఒప్పందం ఖరారైంది. ఇదే సమయంలో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరింది. జపాన్, దక్షిణ కొరియా తర్వాత ఆతరహా ఒప్పందం చేసుకున్న మూడో ఆసియా దేశంగా భారత్ నిలిచింది. ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో మోడీ, భారత్ ఈయూ ఒప్పందాన్ని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణించారు. ప్రపంచ జిడిపిలో నాలుగో వంతు వాటా కలిగిన రెండు ప్రధాన ఆర్థిక శక్తులను కలుపుతున్న కీలక ఒప్పందమిదని అన్నారు. భారత్ ఇయు మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి 2007లోనే చర్చలు మొదలయ్యాయి. ఆటోమొబైల్స్, వైన్‌పై దిగుమతి సుంకాలు, ఫార్మాస్యూటికల్స్ వంటి అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మధ్యలో నిలిచిపోయిన చర్చలు 2022లో తిరిగి ప్రారంభమయ్యాయి. గతేడాది ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ ఎఫ్‌టిఎ కోసం వేగంగా అడుగులు పడ్డాయి.

# రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ

## భారత్ ఐరోపా కూటములమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత విస్తృతం: ఉర్సులా వాండర్‌లేయన్

**న్యూఢిల్లీ,జనవరి 27:** రెండుదశాబ్దాలుగా విస్తృతస్థాయిలో ఇరువైపులా కృషి, కసరత్తులుచేసిన భారత్ ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు ఖరారయింది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఐరోపా కూటమి నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశం అనంతరం రెండు దేశాలమధ్య ఒప్పందంపై సంతకాలుచేసారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్‌లేయన్, యూరోపియన్ మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలు,ప్రధాని నరేంద్రమోడీల సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత వాణిజ్య చరిత్రలోనే ఇది అత్యంత భారీ డీల్ అని ప్రధానిమోడీ పేర్కొనగా భారత్, ఐరోపా మండలి మధ్య వాణిజ్యసంబంధాలను మరింతగా బలోపేతం చేస్తుందని ఐరోపా ప్రతినిధులు హర్షం ప్రకటించారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందంగానే భావించలేమని పరస్పర అభ్యున్నతికి ఒక బ్లూప్రింట్ వంటిదని అన్నారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని భారత్, యూరోపియన్ యూనియన్‌లమధ్య పరస్పర మైత్రీ బంధం మరింత పటిష్టం అయిందన్నారు. హైదరాబాద్‌హౌస్‌లోనే 16వ ఇయు భారత్ సదస్సు వివరాలను కోస్టా వెల్లడించారు. భౌగోళిక స్థిరత్వానికి రెండుదేశాలకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అత్యంత కీలకమని ఇరువురునేతలు వెల్లడించారు. కొత్తగా భద్రత, రక్షణరంగ భాగస్వామ్యంవల్ల భవిష్యత్తు భద్రతా ముప్పును ముందుగానే సంరక్షించుకోగలమని చెప్పారు. ఇండోపసిఫిక్, ప్రపంచ వ్యాప్తంగాను, ఐరోపా కూటమి దేశాల్లోను మరింత స్థిరత్వాన్ని తెచ్చిపెడుతుందని చెప్పారు. 2030 వైపు ఉన్న వ్యూహాత్మక సమగ్ర అజెండా ఇరువైపులా ఉన్న ప్రాధాన్యతను స్పష్టంచేస్తుందన్నారు. ఇంధనం, కనెక్టివిటీ, మొబిలిటీని మరింత పటిష్టంచేస్తుందని కోస్టా అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ఒప్పందం కీలకం అవుతుందని వుర్సులా వాండర్‌లేయన్ అన్నారు. అన్ని డీల్స్‌కు తల్లిలాంటి ఎఫ్‌ఎటి ఖరారయిందని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్ అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 93శాతం భారత ఎగుమతులు 27 యూరోప్ దేశాల్లో ఎలాంటి సుంకాలు ఉండవు. అలాగే లగ్జరీ కార్లు, వైన్ భారత్‌కు దిగుమతులపై కూడా తక్కువ సుంకాలు ఉంటాయి. కొన్నింటిపై అసలు సుంకాలనే తొలగిస్తారు. ఇరువైపులా 200 కోట్లమందికి ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అంచనా. ప్రపంచ జిడిపిలో భారత్; ఐరోపా రెండూకలిపితే 25శాతం వాటాతో ఉన్నాయి. ప్రపంచ వాణిజ్యంలోమూడో వంతు ఉంటుంది. మొత్తం 33 లక్షలకోట్లడాలర్ల ప్రపంచ వాణిజ్యంలో భారత్ ఐరోపా వాణిజ్యం 11 లక్షలకోట్ల డాలర్లమేర ఉంటుందని అంచనా. 20 ఏళ్లనాడే బీజం పడిన ఈ ఒప్పందం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు విశిష్ట అతిథులుగా వచ్చిన మరుసటిరోజే ఖరారు కావడం విశేషం. ఇయు భారత్ డీల్‌తో వస్త్ర పరిశ్రమ ఎగుమతులు 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనావేస్తున్నారు. యూరోప్ మారెనకట్‌లో భారత్‌నుంచి 5.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఉన్నాయి.

# రాష్ట్రంలో ప్రశాంతంగా బ్యాంకుల బంద్

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మంగళవారం బ్యాంకుల బంద్ ప్రశాంతంగా జరిగింది.వరుస శెలవుల అనంతరం బ్యాంకులు ఉంటాయని వచ్చిన ఖాతాదారులకు మంగళవారం కుడా మూసి, సిబ్బంది సమ్మె చేస్తుండటంతో నిరాశకు గురయ్యారు. వేతన సవరణ ఒప్పందంలో అంగీకరించిన అంశాలు సహా తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని కోరుతూ బ్యాంక్ ఉద్యోగులు ఆఫీసర్ యూనియన్లు దేశవ్యాప్తంగా మంగళవారం సమ్మె పిలుపు నిచ్చారు.దాంతో ఏపీలోను బ్యాంకు సిబ్బంది సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఒక రోజు పాటు ఈ సమ్మె కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా గల పలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలు నిలిచిపోయాయి,యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. తొమ్మిది ప్రధాన బ్యాంక్ యూనియన్లకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తుంది.

# సాగునీటి ప్రాజెక్టులు

>> లోని ప్రాధాన్యతల వారీగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రపంచంలో అతిపెద్ద ఉద్యాన క్లస్టర్ గా రాయలసీమ..**

ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరిగే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించినట్టు మంత్రి అచ్చెన్నాయుడు సిఎంకు తెలిపారు. అలాగే ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని మూడేళ్లల్లో 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించేలా ప్రణాళికలు చేపట్టినట్టు వివరించారు. రాయలసీమ ప్రాంతం ఉద్యాన ఉత్పత్తుల విషయంలో దేశంలోనే అగ్ర స్థానంలో ఉందని... ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాలను అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. దుబాయికి చెందిన డిపి వరల్డ్ సంస్థ ఎపిలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి సమావేశంలో వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాయలసీమ ప్రాంతం ఉద్యాన రంగంలో అభివృద్ధి చెందడానికి ఆస్కారం మెండుగా కన్పిస్తోందని.. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం డెవలప్ అభివృద్ధి చేయాలని సిఎం స్పష్టం చేశారు. దీంట్లో భాగంగా అంతర్జాతీయ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అలాగే స్థానికంగా ఉద్యాన రంగ అభివృద్ధికి అవసరమైన రూరల్ రోడ్ నెట్ వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్ కనెక్టివిటీ, గ్లోబల్ కనెక్టివిటీ వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పూర్వోదయ ద్వారా వచ్చే నిధులతో పాటు ఉద్యాన రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సాధించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ తదితర లాజిస్టిక్స్ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్ సహా ఆర్థిక, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, పోర్టులు, ఆర్ అండ్ బి శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, పాలేరు రిజర్వాయర్, మల్లెమడుగు లిఫ్ట్ రిజర్వాయర్, శ్రీ బాలాజీ రిజర్వాయర్, కుప్పం బ్రాంచ్ కెనాల్, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, మూలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, హంద్రీనీవా ప్రధాన కాల్వ పనులు, అట్లూరు-పాడుమెర్లపాక ఎస్ఎస్ఎల్సీ, నీవా బ్రాంచ్ కెనాల్ పనులు, జీడిపల్లిభైరవానితిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, జీడిపల్లి- అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు, అనంతలో కమ్యూనిటీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులు, పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, కడప, కోడూరు వరకు గాలేరు- నగరి సుజల స్రవంతి, అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు, పశ్చిమ కర్నూలుకు నీళ్లిచ్చేలా వేదవతి అలగనూరు, గాజులదిన్నె ప్రాజెక్టులు ఉన్నాయి. ఏడు జిల్లాల్లో 1011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి పనులున్నాయి.

# ఇది ‘డబులింజన్’ బుల్లెట్ రైలు

>> చంద్రబాబు” అని లోకేష్ పేర్కొన్నారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయితే.. టీం 11 కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు అని ఎద్దేవా చేశారు.

**ఒక్క పెన్షన్‌లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం**

“ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటున్నాం. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా రూ.4వేల వృద్ధాప్య పెన్షన్ చెల్లిస్తున్నాం. వికలాంగులకు రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చెల్లిస్తున్నాం. ఒక్క పెన్షన్‌లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలుచేస్తున్నాం” అని మంత్రి లోకేష్ వివరించారు. “చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. 2019 ఎన్నికల ముందు హామీ ఇవ్వకపోయినా రూ.వెయ్యి పెన్షన్‌ను రూ.2వేలకి పెంచాం. గత ప్రభుత్వం పెన్షన్ వెయ్యి పెంచడానికి ఐదేళ్లు తీసుకుంది. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి పెన్షన్ పెంచి రూ.4వేలు చేశాం. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. మనం పనులు చేయడం ఎంత ముఖ్యమో.. చేసిన పనులు చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం“ అని లోకేష్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలని తాను కోరుకుంటున్నానని అన్నారు.

**రాజకీయాల్లో యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది**

“యువత రాజకీయాల్లోకి రావాలి. అన్ని కమిటీల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. యువతను కూడా ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది. అన్ని పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. పార్టీ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలి. మహిళలను కించపరిచే పదాలను విడనాడాలి. పార్టీలో మహిళలను గౌరవించాలి. తెలుగుజాతి కోసం పుట్టిన పార్టీ టిడిపి. ప్రపంచంలో ఏ రంగం చూసినా తెలుగువారు నెం.1గా ఉండే విధంగా మనం కృషిచేయాలి. అదే మన లక్ష్యం“ అని లోకేష్ పేర్కొన్నారు.

**పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది**

“పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. పార్టీ కార్యాలయానికి సమయం కేటాయించాలి. చంద్రబాబు ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికోసారి పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. కార్యకర్తలను కలుస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్నా.. ఎపిలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవనన్న కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. పోలవరం పనులు పరిగెడుతున్నాయి. విశాఖకు పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. రైల్వేజోన్ ఏర్పాటుచేసుకున్నాం. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకువస్తాం. కేంద్ర సహకారం లేకపోతే మనం అనుకున్న కార్యక్రమాలు చేయలేం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి” అని పార్టీ శ్రేణులకు లోకేష్ సూచించారు. అనంతరం మంత్రి లోకేష్ నిత్య విద్యార్థిలా మారి శిక్షణ తరగతులకు హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో వెనుక కూర్చొని పాఠాలు విన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. అంతకుముందు వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన పార్లమెంటరీ పార్టీ కమిటీ సభ్యులకు మంత్రి లోకేష్ స్వయంగా ఆహ్వానం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగారు.

## వారం - వర్జ్యం

28-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
దశమి సా.4.34, కృత్తిక ఉ.9.26
వర్జ్యం : రా.12.09-1.38
దు.ఉ.11.58-12.43
శుభసమయం : ఉ.9.00-9.45
సా.5.30-6.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. రాజకీయరంగాల వారికి విదేశీ పర్యటనలు.

**మిథునం:** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ధనలాభం పొందుతారు.

**కర్కాటకం:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదే పై చేయిగా నిలుస్తుంది.

**సింహం:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ఒత్తిడుల నుండి బయటపడతారు.

**కన్య:** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి. ఆరోగ్య సమస్యలు కొంత వరకు మెరుగుపడతాయి.

**తుల:** భూ వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృశ్చికం:** రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకం. తద్వారా లాభపడతారు. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు.

**ధనుస్సు:** కొన్ని వాయిదా పద్ధతులలో వస్తువులను కొనుగోలు చేస్తారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

**మకరం:** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తి చేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**కుంభం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. ప్రయాణాలు.

**మీనం:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హాస్టల్ గదిలో ఆత్మహత్య

>> కుమార్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రదీప్‌కుమార్ కళాశాలకు సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్ మొదటి అంతస్తులోని ఓ గదిలోని సహ విద్యార్థులతో కలిసి వుంటూ చదువుకుంటున్నాడు. అయితే మంగళవారం ఉదయం సుమారు 11గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలోనే ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ప్రదీప్‌కుమార్ కళాశాలకు రాకపోవడంతో అతని స్నేహితుడు ఫోన్ చేశాడు. ఫోన్ తీయకపోవడంతో మధ్యాహ్నం 3గంటలకు హాస్టల్ గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని వుండడంతో హాస్టల్ నిర్వాహకులు మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం స్థానిక ఎస్ఐ శ్రీనివాసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లితండ్రులకు సమాచారం అందించి, విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న కోణంలో పుత్తూరు రూరల్ సిఐ రవీంద్ర, ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

### రేపు అమరావతి రైతులకు

# మలివిడత ప్లాట్ల కేటాయింపు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఈ నెల 29న మలివిడత ప్లాట్ల కేటాయింపు జరుగనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఈలాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించనున్నారు. నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ఈలాటరీ పద్ధతిలో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే ముందుగా ఈ నెల 28న లాటరీ నిర్వహించాలని ప్రణాళిక ఉండగా దానిని సీఆర్డీఏ అధికారులు 29వ తేదీకి వాయిదా వేశారు.సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి నగరానికి ముఖ్యమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్. ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇటీవల జనవరి 23న రైతులకు లాటరీ ద్వారా భూములు కేటాయించిన విషయం తెలిసిందే. గతంలో భూ సమీకరణ ఉన్న ప్రాంతాల్లో భూములు వచ్చిన రైతుల్లో కొందరు తమకు వేరే చోట భూములివ్వాలని కోరారు. దీంతో ఈలాటరీ ప్రక్రియను అనుసరించడంతో పలువురు రైతులు అభ్యంతరాలు తెలిపారు. అయితే వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్న సీఆర్డీఏ అధికారులు ఈనెల 29న మరోసారి పూర్తిస్థాయిలో ఈలాటరీ ద్వారా తుది విడతలో ప్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

### పాదయాత్రకు మూడేళ్లు

## మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షల వెల్లువ

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:**యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నేతలు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర మూడేళ్ల సందర్భాన్ని గుర్తుచేస్తూ లోకేశ్‌తో కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఏపీ రాజకీయాల్లో యువగళం పాదయాత్ర గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆ పార్టీ నేతలు కొనియాడారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుల్లు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, సోమిరెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, ఉగ్ర నరసింహారెడ్డి, గణబాబు, ఆదిరెడ్డి వాసు, ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, వేపాడ, గ్రీష్మ, కార్పొరేషన్ ఛైర్మన్లు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

**మహిళా మంత్రుల శుభాకాంక్షలు:** పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు మహిళా మంత్రులు అనిత, సవిత. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభం నాటి స్మృతులను నేతలు గుర్తుచేసుకున్నారు. నేడు ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి యువగళం పాదయాత్రది ప్రధాన పాత్ర అని మంత్రులు అన్నారు. ఎన్నో నిర్బంధాలు, ఆటంకాలను తట్టుకుంటూ, ప్రభుత్వ అవమానాలను భరిస్తూ.. ప్రజల కోసంనాడు లోకేశ్ పాదయాత్ర కొనసాగించారని తెలిపారు. నేడు తమకు పదవులు వచ్చాయంటే అందుకు కారణం కూడా యువగళం పాదయాత్రే అని మంత్రులు వెల్లడించారు.



## అనంతలో నేడు గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటన

**అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో:** మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈనెల 28వ తేదీన బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని దత్త మందిరంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించనున్నారని అనంతపురం దత్త మందిరం ట్రస్ట్ సభ్యులు నారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30, 31 వ తారీకులలో బొమ్మపర్తి జయలక్ష్మీపురంలో దత్త క్రియా యోగా తరగతులను శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహిస్తారు. జిల్లాలోని దత్త భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అనంతపురం దత్త మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ మెంబర్ నారాయణ శర్మ కోరారు.

## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు

**విజయవాడ,జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మాజీమంత్రి పేర్ని నానిపై కేసు నమోదైంది.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నానిపై 196(1), 353(2), 351(2), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టారు. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా చాట్రాయిలో జరిగిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని రెచ్చిపోయి మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై మండిపడిన టీడీపీ శ్రేణులు.. మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పీఎస్‌లో నానిపై ఫిర్యాదు చేయగా నానిపై కేసు నమోదు చేశారు.

### టిడిపి పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతులు

# సామాన్య కార్యకర్తలా సీఎం చంద్రబాబు



మంగళవారం టీడీపీ పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతుల్లో కార్యకర్తల మధ్య సీఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** పదవి కన్నా పార్టీయే ముఖ్యమని తరచు సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యాస్తుంటారు.పార్టీ కార్యక్రమాల్లో అందరు సమానమని ఆయన పలు పర్యాయాలు స్పష్టీకరిం చారు. 4వ సారి ముఖ్యమంత్రి అయినా సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొని తన మాటలను కార్యచరణలో చూపారు.ఈ ఘటన సంచలనానికి,ఆదర్శనీయ విధానానికి దారి తీసింది. టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్ లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత చివరి సీట్లో కూర్చుని శిక్షణ తరగతులను అనుసరించారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ తరగతికి చంద్రబాబు హాజరయ్యారు. నాయకులు చెప్పేది శ్రద్దగా విని వర్క్‌షాప్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేశ్ ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వర్క్ షాప్ లో సీఎంతో పాటు నారా లోకేశ్ పాల్గొన్నారు. నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రయాణం, పార్టీ ఐడియాలజీ, క్యాడర్ మేనేజ్‌మెంట్, కార్యకర్తలకు ప్రాధాన్యం వంటి అంశాలపై వర్క్ షాప్ జరిగింది. కూటమి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్రణాళికలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన వర్క్ షాప్ లో సీఎం పాల్గొన్నారు.ఒక్కో పార్లమెంట్ కమిటీలో 42 మంది సభ్యులు చొప్పున మొత్తం 25 పార్లమెంట్లకు కలిపి 1050 మంది వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. అయితే ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న సీఎం పార్టీ విధానాలు, ఆలోచనలు, సిద్ధాంతాలపై నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ఆలోచనలు వివరించారు. కార్యకర్తే అధినేత అనే పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి అంతా పని చేయాలని నాయకులకు సూచించారు. సామాన్య కార్యకర్తగా చంద్రబాబు ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని కార్యకర్తలు, నాయకులు అభిప్రాయపడ్డారు. ఇంకా ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు.

### మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి

# కూరలో విషం కలిపి ప్రాణాలు పోగొట్టుకున్నాడు

## అదే కూర తిని మృత్యువుతో పోరాడుతున్న ఐదుగురు చిన్నారులు

### చింతూరు మన్యంలో హృదయవిదారక ఘటన



పోసయ్య ఇల్లు, భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు.

**చింతూరు , జనవరి 27 ప్రభాతవార్త :**చింతూరు మన్యంలో జరిగిన ఒక హృదయ విదారక ఘటన చూపరులను సైతం కన్నీళ్ళు పెట్టించేలా ఉంది. చింతూరు మండలం ఇర్కంపేట(వలస ఆదివాసి గ్రామం) గ్రామానికి చెందిన మడకం పోసయ్య(45) అనే గిరిజనుడు మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయి ఇంట్లో భార్య వండిన ఆనపకాయ కూరలో పిట్టల మందు కలిపి తాను తిని అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మతి స్థిమితం లేని వ్యక్తి మద్యం మత్తులో చేసిన పోరపాటుతో ఆ కుటుంబం మొత్తం ఆసుపత్రిపాలు అయ్యింది. మడకం పోసయ్య చింతూరు మండలం ఇర్కంపేట గ్రామములో నివసిస్తున్నాడు. అతనికి ఆరుగురు సంతానం. అందులో ఐదుగురు ఆడపిల్లలే. సోమవారం ఉదయం పోసయ్య భార్య హాడమమ్మ, పెద్ద కూతురు లక్ష్మి కూలీ పనులకు వెళ్తూ ఇంటి వద్ద ఆనపకాయ కూర, అన్నం వండి ఇంట్లో ఉంచి వెళ్లారు. మధ్యాహ్నం మద్యం మత్తులో కూరలో పిట్టల మందు కలిపి తిన్న సోమయ్య ఇంట్లో ఓ మూలన పడుకున్నాడు. సాయంత్రం కూలీ పనుల నుంచి వచ్చిన భార్య, కూతురు పోసయ్య పరిస్థితి గమనించి ఏడుగు రాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోసయ్య మృతిచెందాడు. పోసయ్యకు ఏమైందో తెలియని ఆ కుటుంబంలోని ఐదుగురు చిన్నారులను ఇంటి వద్ద ఒంటరిగా వదలేక, పోసయ్యకు అక్క అయిన ముచ్చిక ఐతమ్మ, ఆమె కూతురు లక్ష్మిని ఇంటి వద్ద వదిలేసి వెళ్ళారు. రాత్రి కావటంతో పిల్లలు ఆకలి అనటంతో ఐతమ్మ అన్నం వండి ఇంట్లో ఉన్న కూరను పిల్లలకు పెట్టింది. తాను కూడా తిన్నది. కాని కూరలో విషం కలిపినట్టు ఆమె గుర్తించలేదు. అయితే పోసయ్య కుమారుడు వయస్సు రెండుసంవత్సరాలు అన్నం తినటానికి నిరాకరించాడు. దాంతో ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అయితే రాత్రి కావటంతో ఎక్కడి వాళ్ళు అక్కడ పడుకున్నారు. పిల్లలు, ఐతమ్మ అందరికి వాంతులు, విరేచనాలు కావటంతో ఏదో జరిగింది అని ఊహించిన ఐతమ్మ చింతపండు రసం తీసి అందరికి తాగించింది. రాత్రి 10గం॥ ప్రాంతంలో మృతదేహంతో ఇంటికి చేరిన హాడమమ్మ, ఆమె కూతురు, బంధువులు ఇంట్లో ఉన్న అందరు చిన్నారులు, ఐతమ్మ పరిస్థితి చూసి తల్లడిల్లి పోయారు. ఒక వైపు శవం, మరో వైపు ఆరుగురి పరిస్థితి విషమం. కారుచీకటి, కమ్యూనికేషన్ లేని గ్రామం .అలాగే తెల్లవారే వరకు గడిపి మంగళవారం ఉదయం ఏడుగు రాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐదుగురు చిన్నారులు, మృతుడి అక్క పరిస్థితి నిలకడగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకొని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్ద మృతుడి భార్య, కుమార్తెతో పాటు బంధువులు, గ్రామస్తులు ఆసుపత్రి ముందు కూర్చోని అమాయకంగా చూస్తున్న దృశ్యం చూరులను సైతం కంట తడిపెట్టించేలా ఉంది.

# ఏడుకొండలస్వామిని చూడాలంటే ఎన్ని క్యూలైన్లో!

### ఆలయంలోనికి సులభ క్యూలైన్లు ఏవీ?




శిలాతోరణం ప్రాంతంలో వెలుపల క్యూలైన్లు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం యాజమాన్యం సామాన్యభక్తులకు ఏడుకొండల వెంకన్న దర్శనం, వసతి సదుపాయాలకు సాంకేతిక పరంగా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నా ఆ దేవుని దగ్గరకు చేరుకునేందుకు క్యూలైన్లు మాత్రం ఎంతెంతదూరం అనేది భక్తులు అంచనావేయలేక పోతున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులు వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండితే భక్తులకు సర్వదర్శన కష్టాలు తప్పవు. ఒక్కో కంపార్టుమెంట్‌లో 350నుండి 400మంది వరకు భక్తులు నిరీక్షిస్తారు. ఇలా 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. ఇక 60వేలమంది భక్తులు దాటితే వెలుపల శిలాతోరణం వరకు, ఆక్టోపస్ భవనం, గోగర్భమ్‌డ్యామ్ వరకు కూడా కిలోమీటర్లు దూరం క్యూలైన్లు వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతంరోజుల్లో ఏకంగా 24 గంటలు సమయం నిరీక్షించాల్సి వస్తోంది.

**క్యూలైన్లు కుదింపుపై అధ్యయనం అవసరం:** తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్ లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు ,సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్యభక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌ను అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శన టిక్కెట్లు భక్తులను ఎస్ఎంసి వద్ద క్యూలైన్లనుండి ఆలయానికి దగ్గర దారిని అమలుచేశారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలుకాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారుల వ్యవహారం తయారైంది. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్‌లేని భక్తులను రద్దీని బట్టి లేపాక్షి కూడలి నుండి గానీ, పాత అన్నదానం కాంప్లెక్స్‌క్యూలైన్ల నుండి భక్తులను అనుమతించే వారు. తిరుమలకు వచ్చిన టిటిడి ఇఒలు, జెఇఒలు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారు. సహనాన్ని పరీక్షిస్తూ ఏకంగా 24 గంటలుపైగానే దర్శనం సమయం నిరీక్షణ తప్పడంలేదు.

# ఆర్టీసీలో 3,673 డ్రైవర్లు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి ప్రతిపాదన

### ప్రభుత్వాన్ని కోరిన ఆర్టీసీ బోర్డుసమావేశం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరత సహా బస్సుల కొరత సమస్యలను అధిగమించేందుకు ఆర్టీసి బోర్డు సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఛైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ మీడియాకు అందించిన సమాచారం మేరకు సంస్థలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఖాళీగా ఉన్నటువంటి 7,673 రెగ్యులర్ పోస్టుల నియామకానికి అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్టీసీ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఇందులో 3,673 డ్రైవర్ల పోస్టులు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి అనుమతించాలని ప్రభుత్వాన్ని బోర్డు కోరింది. ఆన్ కాల్ డ్రైవర్ల రోజువారీ వేతనాన్ని రూ. 800 నుంచి రూ.1000 వరకు పెంచాలని నిర్ణయించారు. డబుల్ డ్యూటీ చేసే కండక్టర్లకు ఇచ్చే మొత్తాన్ని రూ. 900కి పెంచింది. పనిష్మెంట్ కేసులతో సంబంధం లేకున్నా ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. కొనకళ్ళ వివరించిన మేరకు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పుడు రూపొందుతున్నాయి. వాటి నిర్మాణాలన్నీ పూర్తయిన తర్వాత వీలయినంత త్వరగా ఇక్కడకు వస్తాయి. త్వరలోనే ఏపీకి 1,050 బస్సులు అందుబాటులోకి వచ్చి సేవలందిస్తాయి. ప్రస్తుతానికి ఆర్టీసీ సిబ్బందికి ఎటువంటి కొరత లేదు. అయితే ఆన్ కాల్ డ్రైవర్లను నియమించుకుని వారికి తగిన తర్ఫీదును అందించి డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని సాధించిన తర్వాతే వారిని పూర్తి స్థాయి డ్రైవర్ ఉద్యోగులుగా నియమించుకుంటాం. అయితే ఈ రోజున తాత్కాలిక సిబ్బంది కావాలనే ఆలోచన సైతం ఉంది.

**జరుగుతోన్న సంప్రదింపులు:** అందుకు అనుగుణంగానే దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సబ్సిడీని ఇస్తుంది. ఇంతకు ముందుగానే 1,050 బస్సులను ఆర్డర్ ఇవ్వడం జరి గింది. అవి ఇప్పుడు వచ్చినట్లయితే ప్రస్తుతం ఉన్న ఇబ్బంది నుంచి తాత్కాలికంగా బయటపడతాం. ప్రస్తుతం ఆ బస్సుల కోసమే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఢిల్లీ వెళ్లి వచ్చారు. ప్రస్తుతానికి కొత్త బస్సుల కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇవన్నీ సకాలంలో పూర్తయితే బస్సులు కొరతనేది తీరిపోతుంది.

# బాలికపట్ల అసభ్యప్రవర్తన: ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష

### 10,000 జరిమానా విధించిన న్యాయస్థానం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నంలోని పాత రామన్నపేటకు చెందిన బాలిక ను 2017 వ సంవత్సరంలో ప్రైవేటు స్కూలు స్కూల్ నందు 10 తరగతి చదువుతుండగా అదే స్కూల్ నందు ఫిజిక్స్ మాస్టర్‌గా పనిచేయుచున్న వీరంకి నాగరాజు అను అతను ఎక్కువ మార్కులు తెప్పిస్తానని ప్రైవేటు క్లాసులు చెప్తానని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా ఆమె ఇచ్చిన రిపోర్టుపై అప్పటి SI, K.V.S.R.K. కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరము ముద్దాయిని అరెస్టు చేసి తదనంతరం ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. స్పెషల్ పీపీ మాదివాడ నరసింహారావు సాక్షులను విచారించిన పిదప పోక్సో కోర్టు జడ్జి అయినా బి వెంకటేశ్వర్లు ముద్దాయిపై నేరం రుజువైనందున ముద్దాయికి నిర్దేశిత చట్ట ప్రకారం రూ..10,000 జరిమానా, పెనాల్టీ కట్టని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష, పోక్స్‌యాక్ట్ ప్రకారము ఆరు నెలలు జైలు శిక్ష మరియు వెయ్యి రూపాయలు జరిమానా, జరిమాన కట్టని ఎడల నెల రోజులు సాధారణ జైలు శిక్ష, U/s.506 IPC ప్రకారము 5000 రూపాయలు జరిమానా జరిమాన కట్టని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్లుగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు సహకరించిన పిఎపిఎకి, సిబ్బందికి జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ అభినందనలు తెలియజేశారు.

# తిరుమల సమాచారం



## తెప్పపై పార్థసారథిస్వామి కటాక్షం

**తిరుపతి,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీ సత్యభామసమేత పార్థసారథిస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకున్న అనంతరం ఉత్సవమూర్తులు పార్థసారథిస్వామి, అమ్మవార్లను పుష్కరిణిలోని తెప్పపైకి వేంచేపు చేయించారు. అక్కడ దేవేరులతో కలసి స్వామి సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఐదుచుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. భక్తులు గోవిందనామస్మరణలతో పులకించారు. అనంతరం ఉత్సవమూర్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భజనల, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, అర్చకులు పాల్గొన్నారు.



## శ్రీమధ్వ విజయం పారాయణం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** మధ్యనవమిని పురస్కరించుకుని టిటిడిదాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం తిరుమల ఆస్థానమండపంలో 140మంది పండితులు శ్రీమధ్వవిజయం పారాయణం చేశారు. భువనగిరి శ్రీరాఘవేంద్రస్వామి మఠం మఠాధిపతి సువిద్యేంద్రతీర్థ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. శ్రీమద్వాచార్యులు బోధించిన ద్వైత సిద్ధాంతం ద్వారా భక్తేమోక్షానికి మార్గమని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, పండితులు పాల్గొన్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉం డాలని స్వామివారిని వేడుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. మం గళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సినీసంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సినీ నటుడు రాజీవ్‌కనకాల కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరు కు న్నారు. ఉదయం విఐపిబ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు దర్శనంచేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# సమష్టిగా రథోత్సవం విజయవంతం

## 3.45 లక్షల మంది భక్తులు వాహనసేవల వీక్షణం

## 9.42 మందికి అన్నప్రసాదం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా ఏడుకొండల వేంకటేశ్వం స్వామికి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల సందర్భం కంటే, ఒకరోజు బ్రహ్మోత్సవం(రథసప్తమి,జనవరి 25) రోజు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలు, టిటిడి పాలకమండలి సహకారం...వెరసి అనుభవజ్ఞులైన టిటిడి ,జిల్లాఉన్నతాధికారుల నిర్విరామ కృషి, సమన్వయం విజయవంతమైందని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్ధబ్రహ్మోత్సవాన ఏడువాహనసేవలవీక్షణకు 3.45లక్షలమంది భక్తులు మాఢవీధుల్లో విచ్చేశారన్నారు. ఒక్కరోజే 9.42లక్షలమంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం జరిగిందన్నారు. 6.30క్షలమందికి పానీయాలు, 2.90లక్షలమందికి పాలు, 2.15లక్షలమందికి తాగునీటి సీసాలు అందించగలిగామన్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవి, పిఆర్ఒ నీలిమతో కలసి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఐక్యంగా మీడియాప్రతినిధులతో సమావేశమయ్యారు. టిటిడి సదుపాయాలపై భక్తుల నుండి విశేషస్థాయిలో ప్రశంసలు రావడం ప్రత్యేకత. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ,భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలు ,సలహాలు సూచనలతో మరింత మెరుగైన సేవలందించగలిగామని ఇఒ తెలిపారు. మాఢవీధుల్లో 220మంది శ్రీవారిసేవకులను వినియోగించామన్నారు. 1,800మంది పోలీసులు, 1200మంది విజిలెన్స్‌సిబ్బంది, 150మంది ట్రాఫిక్ పోలీసులు మెరుగైన సేవలందించారన్నారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో కూడా లేని విధంగా లగేజీకేంద్రంలో 3.65లక్షల గ్యాడ్జెట్లు, బ్యాగులు డిపాజిట్ చేశారన్నారు. తిరుపతి నుండి తిరుమలకు 1,932ట్రిప్పులు ఆర్టీసిబస్సులు నడిపి 60,425మంది భక్తులను తరలించగా, తిరుమల నుండి తిరుపతికి 1,942ట్రిప్పుల ద్వారా 82,241మంది భక్తులను చేరవేశారన్నారు. రథసప్తమిరోజు 23వేలమంది భక్తులకు వైద్యసేవలందించారని, 94మందిని అంబులెన్స్‌లద్వారా తిరుపతిలోని ఆస్పత్రులకు తరలించామన్నారు. రథసప్తమి వేడుకలను విజయవంతం చేయడంలో మీడియాసిబ్బంది పాత్ర అమూల్యమన్నారు. ఉదయం ఐదుగంటల నుండి రాత్రి 9గంటలవరకు తాను(టిటిడి ఇఒ), టిటిడి అదనపు ఇఒ,తిరుపతి జిల్లా ఎస్పీ ,సివిఎస్ఒ అధికారులు కలసి గ్యాలరీలను పరిశీలించడం, గ్యాలరీల్లో భక్తులతో మాట్లాడటం జరిగిందన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలు,ఏర్పాట్లపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బ్రహ్మోత్సవాల కంటే రథసప్తమిన భక్తులకు కల్పించిన సౌకర్యాలతో ,3.45లక్షలమంది భక్తులకు సకలం సంతోషంగా చేయించడం పట్ల సిఎం చంద్రబాబునాయుడు అభినందనలు తెలియజేయడం తమకు మరింత బాధ్యతను గుర్తుచేసిందని అధికారులు ముక్తకంఠంతో తెలిపారు.

వార్త

నిన్ను నువ్వు ప్రేమించుకోవడం నేర్చుకుంటే ఇతరుల్ని ద్వేషించడం మానివేస్తావు.

-రోజర్

# ఉపేక్షిస్తే ఉపద్రవమే!

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారి తీస్తుందని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచ వ్యాప్తంగా దేశాధినేతలు పదేపదే చెప్తూనే ఉన్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదియేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం పదిహేను, పదహారేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని, నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. తాజాగా మొన్న నిజామాబాద్ జిల్లాలో ఒక కారులో గంజాయి తరలిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యపై కిరాతకులు కారుతోనే దాడికి ప్రయత్నించారు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కిడ్నీలు దెబ్బతినడంతో ఒక కిడ్నీని పూర్తిగాతొలగించారు. మరొక కిడ్నీకి డయాలసిస్ చేస్తున్నారు. ఆమె ప్రాణాలు కాపాడేందుకు వైద్యబృందం శతవిధాలా ప్రయత్నం చేస్తున్నది. ఎక్సైజ్, ఆరోగ్యశాఖ మంత్రులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకునే క్రమంలోనే సౌమ్యపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇదే కాదు ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఎందరో అధికారులపై దాడులు జరుగుతున్నాయి. మొన్న ఆ మధ్య నెల్లూరు జిల్లాలో మత్తు మందుల వ్యాపారమే కాక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేయడమేకాక అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే నెపంతో సామాజిక కార్యకర్తను హత్య చేయించినట్లు ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రధానంగా గంజాయితోపాటు మత్తుమందులు పట్టుబడుతూనే ఉన్నాయి. గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిందని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ, విశాఖ ఏజెన్సీలోనూ ఇటు తెలంగాణ, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఇటీవల కాలంలో బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో ఆంధ్ర, ఒడిశా, సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఆవిషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమ వ్యాపారులను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఇదేకాదు విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవైఒక్కవేల కోట్లరూపాయల విలువైన మూడు వేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింక్‌లు వెలుగులోకి వచ్చాయి. మత్తుమందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదులకే చేరుతున్నదని దర్యాప్తుసంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కశ్మీర్ ఉగ్రవాదులకు, పంజాబ్‌లోని మత్తుమందు సరఫరాదారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. మత్తుముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకున్నాయి. మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తు మందులు నలుమూలాల విస్తరించడంతోపాటు రసాయనికాలు తయారు చేసే యాంఫిటామైన్ ట్రైప్స్టిమ్‌లెన్స్ ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈ తరహా మత్తుమందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయి. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఈమత్తుమందువ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీచేయించే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం పెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండాపోతున్నది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందులు తీసుకొని డబ్బులుచేతిలో పెట్టేవారు. ఆవ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పించి అప్పగించేవాడు. ఇది అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్ను వేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వొచ్చు. రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ మహమ్మారి ప్రపంచమంతా విస్తరించిపోయింది. మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకూడదు. అటుకేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించి అమలు చేయగలిగితే కొంతవరకైనా నియంత్రించవచ్చు.

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

తోటివారికి మీ వల్ల హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవడమే సరైన ప్రవర్తన.



హెచ్.లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



## ప్రతిభకు తూకం

రెండువేల ఇరవైఆరు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులను పలువురు ప్రముఖులకు ప్రదానం చేయబడింది. గతంలో సినీ ప్రపంచంలో అందనంత ఎత్తుకుఎదిగిన మహానటులైన ఎన్.టి.రామారావు, ఎస్.వి. రంగారావులకు కేవలం పద్మశ్రీ అవార్డులతో సరిపెట్టేసారు. మహానటి సావిత్రి, సినీ సీత అంజలీదేవిలను ఏప్రభుత్వ అవార్డులు వరించలేదు. కాని వారి నటనానైపుణ్యం తెలుగు సినీపరిశ్రమలో నిఘంటువులా నిలచిపోగలదనేది అక్షర సత్యం. ప్రతిభను ఏ కొలమానంతో తూకం వేస్తున్నారో అవార్డుల కమిటీ వారికే తెలియాలి..

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## గవర్నర్లు ఆలోచించాలి

మళ్ళీఒకసారి తమిళనాడుఉదంతంతో గవర్నర్‌ల పాత్రపై మరొకసారి గందరగోళం నెలకొంది. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం, రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఎటువంటి గందర గోళం లేదు. ఎప్పుడయితే ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయో అప్పటి నుండి ఈ గందరగోళం నెలకొంది. ఇకపోతే ఈదశాబ్దకాలంలో కేరళలో, ఢిల్లీలో, తమిళనాడు, పశ్చిమబెంగాల్, రాష్ట్రాలలో నెలకొన్న పరిస్థితులు ఏమి రుజువుచేస్తున్నాయి. ప్రతిపక్షం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలక పక్షం తమ అభిష్టాలు నెరవేర్చే సాధనంగా గవర్నర్‌ల పాత్ర ఉండడం విచారం. అలాఅని అందరూ అలా ప్రవర్తించడంలేదు. కేరళలాంటి రాష్ట్రాలు గవర్నర్‌గురించి సుప్రీంకోర్టుకువెళ్లడంకూడా చూస్తున్నాం. బీజేపీలాంటి పార్టీలు మార్గదర్శక మండలిపేరుతో సలహా సంఘాన్ని ఫామ్ చేసి అందులోని వాళ్లకు గవర్నర్‌గిరి ఇస్తున్నారు. ఇది సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధం.

- భారత అవినాష్, జనగామ

## ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో భూముల విలువ ధరలు పెరగడంతో ఎస్సీ,ఎస్టీల ఇండ్ల స్థలాలు అగ్రవర్ణాలు ఆక్రమించుకోవడం అక్రమ నిర్మాణాలు చేయడం జరిగింది. ఇట్టి విషయమై భూమిని కోల్పోయిన వారు భూ కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి 3 సంవత్సరాలు దాటుతున్నా కూడా న్యాయం జరగడం లేదు. అక్రమ నిర్మాణాలు తొలగించడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

## ఫీజులను పెంచడం సమర్ధనీయంకాదు

దేశంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లల ట్యూషన్‌ఫీజులు, ఇతరఖర్చులు నిరంతరం పెరుగుతుండటం మధ్యతరగతి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరమైనప్పటికీ, తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఈ కష్టాలను భరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల ట్యూషన్ ఫీజులపెంపుపై రెండేళ్లకుఒకసారి గరిష్టంగా ఎనిమిది శాతం పరిమితిని విధించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తుంది. అయితే ప్రభుత్వపాఠశాలల మాదిరిగా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏటా ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఉండవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రైతులకు పరిహారం చెల్లించాలి

రాయలసీమ పెన్నా ఎత్తిపోతల పథకం పనులకు దశాబ్దాల నుండి కృష్ణ జలాలు అందే సమయం ఇప్పుడువచ్చింది. నీటి నిల్వల సామర్థ్యం లేక ఆగిపోయింది. అప్పటి మంత్రి వర్ధంతి రోజున ఇప్పుడు ప్రారంభమై పేదల ఆకలి తీర్చే అవకాశం యాధృచ్ఛికంగా జరిగింది. అదే మనిషికిప్రధానం. దాని ప్రాధాన్యత గుర్తించి కృషి చేయడం ప్రభుత్వ ఘనతే. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు హామీతో వారికి సమస్యలేదు. మనకు సుఖాలు, ఆనందం వచ్చే వాటి కన్నా ఇది ముందు అత్యవసరమని మనం కూడా తెలుసుకోవడం విజ్ఞత. వాటి కోసం ప్రభుత్వనేతల చొరవ, అధికారుల జాప్యంలేని పనితీరు ప్రజలు మరువలేరు. ఆ రీతిలోనే కుటుంబానికి కూడు పెట్టే అంశాలు ముందు ప్రాధాన్యత గొప్పవి కూడా.

- బొల్లోజు మేఘనాదం విశాఖపట్నం

## శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

భారత్ క్రికెట్‌జట్టు మ్యాచ్ గెలిచినా, పెళ్లివేడుకలు, ఇతర కార్యక్రమాలు ఏవైనా నిర్వహించినా ఆ హాపినెస్‌ని పరస్పరం అభినందనలు తెలుపుకోవటంతోను మిఠాయిలు పంచుకోవటంతోను ఆపేయాలి. లేదూ చిచ్చుబుడ్లు, చక్రాలు, కాకరపువ్వొత్తులు, మతాబులతోను సరిపెట్టుకోవాలి. అంతేకానివృద్ధులు, రోగులు, మహిళలు, పసిపిల్లలు నిద్రించే సమయంలో పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, సీమటపాకాయలు పేల్చటం సరికాదు. చాలా ఇప్పుడే అదే చేస్తూ ఇతరులను ఇబ్బందిపెడుతున్నారు.

-ఎమ్.శాస్త్రి, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రహదారి విధానంలో మార్పులవసరం

***రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల, దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడం వల్ల, పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లు గుంతలు పడడం, అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు. భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే.***

భైరబోయిన వెంకటేశ్వర్లు

దేశాల, రాష్ట్రాల అభివృద్ధి సూచికలు రహదారులు. రహదారులు ఎంత సౌకర్యవంతంగా ఉంటే అంత అభివృద్ధి చెందినట్లు లెక్క. జాతీయ స్థాయిలో రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారులు, రాష్ట్రస్థాయిలో జిల్లాలను అలాగే గ్రామస్థాయిలో పల్లెలను కలుపుతూ రహదారులు ఉంటాయి. వీటిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెరుగుతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారులు విస్తరించడం అవసరం. అలానే సుదూరాలను దగ్గర చేయడానికి కొత్త రహదారులను నిర్మించడం అనివార్యం. ఒక దేశ అభివృద్ధిలో పెట్టుబడుల పరంగా పరిశ్రమలు రావాలంటే ఆ పరిశ్రమలకు తగిన భూమి ప్రభుత్వం చూపించాల్సి ఉంటుంది. ఒక నిర్దిష్ట పరిధిలో నిర్మించే పరిశ్రమలకు ప్రభుత్వ భూములు ఉంటే వాటినే కేటాయిస్తారు. లేదంటే పరిహారం ఇచ్చి రైతుల వద్ద నుండి సేకరిస్తారు. కానీ కొత్త రహదారులు నిర్మించే విషయంలో మాత్రం రహదారులకు కావలసిన భూమి అంతా రైతుల నుండి సేకరించాల్సిందే. దేశంలో అభివృద్ధి పథంలో నడవడానికి రోజురోజుకు కొత్త రహదారులు నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నాయి ప్రభుత్వాలు. ఉన్న మార్గాన్ని విస్తరిస్తే బ్రౌన్ ఫీల్డ్ అని కొత్త మార్గాలను గ్రీన్ ఫీల్డ్ హైవేలని అంటారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అంతట సుమారు 600 కి.మి నిడివి గల గ్రీన్‌ఫీల్డ్ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. కానీ రహదారుల నిర్మాణంలో కనబడే అభివృద్ధి వెనక ఎంతో మంది రైతుల వ్యధలు ఉన్నాయన్నది నిజం. భారీ భూస్వామ్యవ్యవస్థలు లేని మన దేశంలో భూమి అంతా చిన్నచిన్న కమతలుగా రైతుల చేతుల్లో ఉంది. రహదారుల కింద కోల్పోతున్న భూములలో తాతలు, తండ్రుల నుండి వారసత్వంగా వస్తున్న భూములు కొన్ని అయితే తిని తినక రూపాయి రూపాయి పోగుచేసు కొని కొన్న భూములు కొందరివి. రహదారుల క్రింద తమ అస్తిత్వం బ్రతుకుతెరువు అన్ని కోల్పోయి నగరాలకు వలస వెళ్లేవారు కొందరైతే ఒకటి రెండు ఎకరాలు ఉన్న చిన్న రైతులు ఉన్నది కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. రహదారుల అమరికలో భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వాలు నష్టపరిహారాన్ని చెల్లిస్తాయి. కానీ ఈ చెల్లించే నష్టపరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదుఅన్నది నిజం. రైతులకు ప్రభుత్వాలు భూమి, ప్రభుత్వ విలువను బట్టి దానికి అధనంగా పరిహారం ఇస్తారు. కానీ వాస్తవానికి మార్కెట్లో అదిప్రభుత్వ విలువకన్నా చాలారెట్లు అధికంగా ఉంటుంది. సుమారు ఒక ఎకరం భూమి రోడ్డు పరిధిలో



వెళితే ఆ ఎకరానికి ఇచ్చిన నష్టపరిహారంతో ఆ ప్రాంతంలో కనీసం సగం భూమి కూడా రాని పరిస్థితి ఉంది. పల్లెల్లో బండ్ల బాట, తారు రోడ్ల ప్రక్కన ఉన్న భూముల విలువ లోపలి భూముల కన్నా ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రభుత్వ విలువ సమానంగా ఉన్నందున దీనికి లోపలి భూములకు ఒకే తరహా పరిహారం చెల్లించడంతో కొంత మంది రైతులకు నష్టం జరుగుతోంది. కొందరు రైతులు ప్రభుత్వంతో పోరాడలేక ఇచ్చే పరిహారానికి ఒప్పుకున్న మరికొందరు అధిక పరిహారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పరిహారం విషయం పక్కన పెడితే భూమిని నమ్ముకున్న రైతు తన వ్యవసాయ సాధన అనుకూలతను బట్టి తన భూమిని చతురస్రాకార, దీర్ఘచతురస్రాకార ఆకారాలలో చిన్న కమతలుగా నిర్మించి తమకనువుగా వ్యవసాయం చేసుకుంటారు. నూతన రహదారుల అమరికలో అప్పటివరకు ఏకరీతిగా ఉన్న భూమి ఆకారం లేకుండా అవుతుంది. అది కూడా వ్యవసాయం చేయడానికి అనువుగా ఉండడం లేదు. మరి గ్రీన్‌ఫీల్డ్ లాంటి వాహన నియంత్రణ రహదారి పొడుగునా ప్రహరీ గోడ నిర్మించే రహదారుల్లో ఈ ఆకారం లేని భూభాగం సగం రహదారులకు ఒకప్రక్కన ఉంటే మిగిలినది మరొక్క ప్రక్కన ఉంటుంది. ఇటు నుండి అటు దాటలేని రహదారుల ప్రక్కన రైతులకు వ్యవసాయం చేయడం దినదిన గండంగా మారనుంది. ఈ రహదారుల అమరికలో భూమితోపాటు జల వనరులు అయిన బావులు సైతం పూడ్చాల్సి వస్తుంది. ఒకవేళ రహదారుల అమరికలో విద్యుత్‌లో, హై టెన్షన్ లైన్లు, మిషన్ భగీరథ పైప్ లైన్లు, ఇరిగేషన్ కాలువలు లాంటివి నష్టపోతే మాత్రం వాటిని ఎంత ఖర్చైనా తిరిగి యధావిధిగా పునర్ నిర్మించే ప్రయత్నం చేస్తారు. కానీ రైతులను పునర్మించడం లేదన్నదినిజం. అలాగే ఈ రహదారుల నిర్మాణంలో నిర్మాణానికి కావలసిన కంకర కోసం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రకృతి సంపదగా వస్తున్న కొండలను పిండి చేసి రోడ్ల నిర్మాణంలో వాడుతున్నారు. ఈ రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడంవల్ల పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లుగుంతలు పడడం, అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు. భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే. ●

# ఆదివాసీల సొంతింటి కల నెరవేరేనా?

మల్లేశ్ పొంగి

దేశంలో అత్యంత వెనుకబడిన ఆదివాసీగిరిజన సమూహాలుగా గుర్తించబడిన పివిటిజి కమ్యూనిటీల జీవన పరిస్థితులు మెరుగుపడాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జంజాతి) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం 18 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఉన్న 75 పివిటిజి సమూహాలకు ఉద్దేశించబడింది. మూడు సంవత్సరాల కాలంలో పివిటిజి కుటుంబాలు, నివాస ప్రాంతాలకు సురక్షిత గృహాలు, శుభ్రమైన తాగునీరు, విద్య, ఆరోగ్యం, పోషణ సేవలకు చేరువ, రోడ్డు, టెలికాం కనెక్టివిటీ, విద్యుత్ సౌకర్యం లేనిగృహాలకు విద్యుదీకరణ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సదుపాయాలు అందేలా చేయడమే దీనిలో ప్రధాన ఉద్దేశం. ఈ లక్ష్యాలను వివిధ శాఖల సమన్వయంతో అనేక కార్యాచరణల ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష్యం గొప్పదే. కానీ ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన ఆదివాసి పివిటిజి నిరుపేద కుటుంబాలకు ఈ పథకం కింద గృహాలు వాస్తవంగా ఆశించినా దాని కంటే మేలు చేస్తాయా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు నిర్మిస్తున్న పిఎం జంజాతి గృహాలు కొన్నిచోట్ల సగటు నిరుపేద కుటుంబాలకు శాపంగా మారుతున్నాయి. ఇల్లు కట్టుకోవడం ప్రతి నిరుపేద కుటుంబం కల. మరీ ముఖ్యంగా వెనకబడిన పివిజిటి కుటుంబాలు పూరి గుడిసెల్లో జీవిస్తూ కొండలు అడవుల్లో జీవనం కొనసాగిస్తుంటారు. వీరు బయట ప్రపంచానికి దూరంగా ఎన్నో కట్టుబాట్లతో జీవనం సాగిస్తుంటారు. ఇప్పటి పరిస్థితుల్లో ఇల్లు కట్టాలంటే ఇంటి సామాగ్రి సిమెంట్, ఇనుము, ఇసుక వంటి వాటిని మైదాన ప్రాంతం నుంచి కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ఆ సామాగ్రి చేర్చడంలోనే అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు సిమెంట్, ఇనుము కొనుగోలు ఖర్చుకంటే వాటినిగ్రామాలకు చేర్చడానికి అయ్యే రవాణా ఖర్చే ఎక్కువ అవుతుందని చెప్పవచ్చు. అల్లూరి జిల్లాలో రోడ్డు లేని పివిజిటి గ్రామాలు చాలానే ఉన్నాయి. రహదారి మార్గాలు లేకపోవడం వల్ల కొంత దూరం వరకు వాహనాల్లో తరలించి అక్కడ దించుకుని ఆ తర్వాత మనుషులు ఎత్తుకొని తీసుకెళ్లే పరిస్థితులు



కూడా అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే (పిఎం జంజాతి) గృహాలు పివిజిటి నిరుపేద కుటుంబాలకు ఒక రకంగా అగ్ని పరీక్షగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి) గృహాల నిర్మాణానికి రెండు లక్షలముప్పై తొమ్మిదివేల రూపాయలు మంజూరు చేసింది. అయినప్పటికీ ఇల్లు కట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల అప్పు తీసుకునే పరిస్థితిగా మారుతోంది. మొత్తంగా ఒక ఇల్లు పూర్తి చేయడానికి ఎనిమిది నుంచిపది లక్షల వరకు ఖర్చయ్యే అంచనా ఉంది. ప్రభుత్వం ఇచ్చే 2,39,000 సహాయం ఉన్నా, మిగిలిన మొత్తం సగటు కుటుంబంపై భారీ ఆర్థిక భారం అవుతోంది. అంటే సుమారుగా ఏడులక్షల అరవై ఒక వేల రూపాయలు సగటు కుటుంబానికి భారం పడుతుందని చెప్పడానికి సందేహం లేదు. సగటు కుటుంబం ఇంత ధనాన్ని వెచ్చించగలదా అనే ప్రశ్న సహజంగా వస్తుంది. ఉదాహరణకు అల్లూరి జిల్లాలోని జిమాడుగుల మండలం గడుతూరు పంచాయతీ బొడ్డు మామిడి గ్రామం మండల కేంద్రం నుంచి సుమారుగా అరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి వెళ్లడానికి ఎటువంటి రోడ్డు సౌకర్యంలేదు. ఈ ఒక్క గ్రామంలో యాభై కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామంలో కొంతమందికి ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు, మరి కొంత మందికి ఆధార్ కార్డులు లేవు. మరికొన్ని కుటుంబాలకు (ఎన్ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు కూడా లేవు. అందులో ఈ కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి)పథకం ద్వారా కొంతమందికి మాత్రమే గృహాలు మంజూరు చేయటం జరిగింది. ఎందుకంటే జాబ్‌కార్డు ఈ పథక గృహాలకు ముఖ్యమైనదిగా అధికారులు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఇలాంటి గ్రామాలు ఇంకా మరెన్నో మనకు పాడేరు జిల్లాలో కనిపిస్తాయి. ఇంకా గతంలో అల్లూరిజిల్లాలో పెద్దసంఖ్యలో(ఎన్ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు తొలగింపుకు గురైన సందర్భాలున్నాయి. ఈ విషయమై గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో సమస్య అలాగే ఉంది. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అల్లూరి జిల్లాలోని గ్రామాలను అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సందర్శించి రోడ్లు, మంచినీరు, విద్యుత్, విద్య సదుపాయాలు కల్పించగలిగితేనే ఈపథకం నిజంగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా స్థానిక పాడేరు ఐటిడిఏ అధికారులు, జిల్లాకలెక్టర్ కార్యాలయం ఈవిషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇల్లుకంటే ముందు దారిరావాలి. అప్పుడే ఆదివాసీల సొంత ఇంటి కల నిజంగా నెరవేరుతుంది. ●

# వృద్ధతల్లిదండ్రుల 'భద్రత'కు చట్టాల ఆసరా!

పద్మ పుత్ర మల్లికార్జున

తెలంగాణ రాష్ట్రంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ప్రకటించడం సమాజంలో ఒక ముఖ్యమైన చర్చకు నాంది పలికింది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమేకాదు, మనసమాజం, కుటుంబ వ్యవస్థ, విలువలు ఎటు దారి తీస్తున్నాయనే ప్రశ్నను కూడా మన ముందుంచింది. తల్లిదండ్రులను చూసుకోవడం అనేది ఎప్పటి నుంచో మన సంస్కృతిలో సహజంగా వస్తున్న ధర్మం. కానీ నేటికాలంలో, ఆ ధర్మాన్ని గుర్తు చేయడానికి ప్రభుత్వం చట్టం చేయాల్సిన పరిస్థితి రావడం నిజంగా ఆలోచింపజేసే విషయం. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, తెలంగాణలో పనిచేస్తున్న ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే, అతని లేదా ఆమె జీతం నుండి 10నుండి 15శాతం వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇది మాటల హెచ్చరిక కాదు, దీనిని చట్టబద్ధంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయబోతోంది. అంటే ఈ విషయం మీద ప్రభుత్వం ఎంత శ్రద్ధగా ఆలోచిస్తుందో దీని ద్వారా స్పష్టమవుతుంది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం ఒక వ్యక్తిగత సమస్యగా కాకుండా, ఒక సామాజిక సమస్యగా ప్రభుత్వం గుర్తిస్తోంది. మన దేశంలో ఇప్పటికే వృద్ధతల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్రప్రభుత్వం 2007లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ అదర్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్' అనే చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం, తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అంతేకాకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలు చూసుకుంటారనే నమ్మకంతో ఆస్తులను బదలాయించి, తర్వాత వారు నిర్లక్ష్యం చేస్తే, ఆ ఆస్తులను తిరిగి తమ పేరుపైకి తీసుకునే హక్కు కూడా ఈ చట్టం ఇస్తుంది. అయితే ఈ చట్టం అమలు కోసం వృద్ధులు కోర్టులు, ట్రిబ్యునల్స్ చుట్టూ తిరగాల్సివస్తోంది. ఇది చాలా మందికి మానసికంగా, శారీరకంగా కష్టమైన ప్రక్రియ. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం ఈ సమస్యకు ఒక భిన్నమైన పరిష్కారాన్ని చూపుతోంది. కోర్టులు, కేసులు, అలస్యం లేకుండా, నేరుగా ఉద్యోగి జీతం నుంచే డబ్బును తల్లిదండ్రులకు అందించడం ద్వారా వృద్ధులకు తక్షణ భద్రత కల్పించాలన్నది దీని లక్ష్యం. ఇది తల్లిదండ్రుల హక్కులను మరింత బలంగా పరిరక్షించే చర్యగా చూడవచ్చు. కానీ అదే సమయంలో, ఇది వ్యక్తిగత జీవితాల్లో ప్రభుత్వ జోక్యాన్ని ఎంతవరకు అనుమతించాలి అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతుంది. ఒక కుటుంబంలో జరిగే వివాదాలను, సంబంధాలను నేరుగా ప్రభుత్వం నియంత్రించడం సరైందా అనే చర్చ తప్పనిసరిగా జరుగుతుంది. భారతదేశంలో వృద్ధుల సంక్షేమం విషయంలో కేరళరాష్ట్రం ఒకఅడుగు ముందుకు వేసింది. 'స్టేట్ ఎల్డరీ కమిషన్ యాక్ట్ 2025' ద్వారా కేరళలో ఒక ప్రత్యేకమైన చట్టబద్ధమైన కమిషన్ను



ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ వృద్ధుల హక్కులు, సంక్షేమం, సమస్యలపై ప్రత్యేకంగా పనిచేస్తుంది. భారతదేశంలో వృద్ధుల కోసం ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఇది వృద్ధుల సమస్యలను ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతతో చూస్తుందో చెప్పే ఉదాహరణ. అంతర్జాతీయంగా కూడా అనేక దేశాలు తల్లిదండ్రుల సంరక్షణపై చట్టాలు తీసుకొచ్చాయి. సింగపూర్లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్' ఉంది. ఈ చట్టం ప్రకారం, 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉంటే, వారి పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిందే. అదే విధంగా చైనాలో 'ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ అండ్ ఇంట్రెస్ట్ ఆఫ్ ఎల్డర్ పీపుల్' అనే చట్టం ఉంది. దీనిలో తల్లిదండ్రులకు ఆహారం, నివాసం, వైద్యం వంటి అవసరాలను పిల్లలు అందించాల్సిన బాధ్యతను స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ఈ సమస్య భారతదేశానికే పరిమితం కాదు, ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల నిర్లక్ష్యం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. మన భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావిస్తాం. 'మాతృ దేవోభవ, పితృ దేవో భవ' అన్న మాటలు మన చిన్నప్పటి నుంచే మన చెవుల్లో నినదిస్తాయి. శ్రవణ కుమారుడి కథ మనకు తల్లిదండ్రుల పట్ల చూపాల్సిన భక్తి, సేవ ఎంత గొప్పదో గుర్తు చేస్తుంది. తన అంధులైన తల్లిదండ్రులను కావడిలో పెట్టుకుని తీర్థయాత్రకు తీసుకెళ్లిన శ్రవణ కుమారుడు, తన ప్రాణాలు పోయే క్షణంలో కూడా తల్లిదండ్రుల దాహం గురించి మాత్రమే ఆలోచించాడు. అలాంటి కథలు మన సంస్కృతిలో తల్లిదండ్రుల సేవ ఎంతపవిత్రమోచెబుతాయి. కానీ నేటి సమాజంలో పరిస్థితి చాలా మారిపోయింది. పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, ఆర్థిక ఒత్తిళ్లు ఇవన్నీ కలిసి కుటుంబసంబంధాలను బలహీనపరుస్తున్నాయి. చాలా మంది యువత తమ సొంత పిల్లల భవిష్యత్తు గురించి ఎంతగా ఆలోచిస్తారో, తమ తల్లిదండ్రుల వృద్ధాప్యంగురించి అంతగా అలోచించడం లేదు. కొందరు పిల్లలు తల్లిదండ్రులను తమ జీవితంలో ఒక భారంగా చూడడం బాధాకరం. ఆహారం, మందులు, వైద్యసేవలు వంటి కనీస అవసరాలు కూడా ఇవ్వడానికి ఇష్టపడని సందర్భాలు మన చుట్టూ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే చట్టం ఒక హెచ్చరికలా కూడా పనిచేయవచ్చు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, కేవలం నైతికంగా తప్పు చేయడమే కాకుండా, ఆర్థికంగా కూడా దాని ఫలితాలుఉంటాయని ఇది చెప్పుతుంది. ఇది కొంతమందిలో అయినామార్పు తీసుకువచ్చే అవకాశం ఉంది. కనీసం తల్లిదండ్రులకు ఒక స్థిరమైన ఆదాయ మార్గంఏర్పడుతుంది. వారు తమ పిల్లల దయాదాక్షిణ్యాల మీద పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే ఈచట్టాన్ని అమలు చేసే సమయంలో చాలా జాగ్రత్త అవసరం. ప్రతి కుటుంబ సమస్య ఒకేలా ఉండదు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులే పిల్లలను వేధించే పరిస్థితులు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పిల్లలు నిజంగా ఆర్థికంగా ఇబ్బందుల్లోఉండవచ్చు. కాబట్టి ఈ చట్టం గుడ్డిగా అమలవ్వకుండా, ప్రతి కేసును సున్నితంగా పరిశీలించే వ్యవస్థ అవసరం. అందుకే కమిటీ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమైన విషయం. సరైన మార్గదర్శకాలు, రక్షణలు లేకపోతే, ఈ చట్టం కొత్త అన్యాయాలకు కూడా దారి తీసే ప్రమాదంఉంది. తల్లిదండ్రులను చూసుకోవడం చట్టం వల్ల కాదు, మన మనసువల్ల జరగాలి. కానీ మన మనసు మారకపోతే, సమాజాన్ని కాపాడటానికి చట్టాలు రావాలి. ఒక మొక్కమనకు నీడను, పండ్లను ఇస్తుంది. కానీ ఆమొక్క వేర్లుఎండిపోతే, చెట్టుమొత్తం కూలిపోతుంది. అలాగే మనల్ని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులు మన జీవితానికి వేర్లులాంటి వారు. వారి ని నిర్లక్ష్యంచేస్తే, మన జీవితానికి కూడా పునాది ఉండదు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే ఈ చట్టం మనందరికీ ఒక సం దేశంఇస్తోంది. తల్లిదండ్రులను చూసు కోవడం మనపై ఎవరో మోపిన బాధ్యతకాదు, అది మనఅస్తిత్వానికి మూలం. ఇప్పటికైనా మనం మన విలువలను గుర్తుచేసుకొని, తల్లిదండ్రు లను గౌరవించి, వారికి అవసరమైన భద్రతను అందించాలి. ●

# యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు జప్తు



### మరింత కఠిన చర్యలు తీసుకోవాలి
### సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
### రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశం
### విచారణ నాలుగు వారాలకు వాయిదా

**న్యూఢిల్లీ, జనవరి 27:** దేశవ్యాప్తంగా యాసిడ్ దాడి కేసులు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీం కోర్టు మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధితులకు పరిహారం అందించడానికి దోషుల ఆస్తులను అటాచ్ చేయడంతో సహా మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, సుప్రీం కోర్టు గతంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారిస్తూ, 15 హైకోర్టులు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలను అందించాయని పేర్కొన్న విషయాన్ని గమనించింది. సుప్రీం కోర్టు ముందు ఉంచిన స్థితి నివేదిక ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లో మాత్రమే 198 పెండింగ్ కేసులు, గుజరాత్‌లో 114, పశ్చిమబెంగాల్‌లో 60, బీహార్‌లో 68, మహారాష్ట్రలో 58 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వులో, మిగిలిన హైకోర్టుల నుండి నివేదికలు ఇంకా ఎదురుచూస్తున్నాయని పేర్కొంది. 'యాసిడ్ దాడులకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి నిర్ణయం తీసుకోవాలని తాము హైకోర్టులను అభ్యర్థిస్తున్నాము' అని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా, సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం యాసిడ్ దాడుల నిరోధించడానికి కఠినమైన శిక్షా చర్యల ఆవశ్యకతపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిందితుల ఆస్తులను ఎందుకు అటాచ్ చేయకూడదు? ఒక వ్యక్తి యాసిడ్ దాడిలో దోషిగా తేలితే, అతని అన్ని స్థిరాస్తులను ఎందుకు సంపాదించి బాధితుడికి పరిహారం చెల్లించకూడదు? మీరు కొన్ని అసాధారణమైన శిక్షా చర్యలు తీసుకోవాలి. చర్య అంత బాధాకరమైనది కాకపోతే, ఇక్కడ నిరోధక సిద్ధాంతాన్ని అనుసరించాలి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. యాసిడ్ దాడుల సంవత్సరాల వారీగా జరిగిన సంఘటనలు, ఛార్జిషీట్ల దాఖలు, నిర్ణయించిన కేసుల సంఖ్య, విచారణ దశలో పెండింగ్, ముగిసిన విచారణల నుండి ఉత్పన్నమయ్యే అప్పీళ్లతో సహా నాలుగు వారాల్లోపు సమగ్ర డేటాను తన ముందు ఉంచాలని కూడా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితుడి విద్యా అర్హతలు, ప్రస్తుత ఉద్యోగ స్థితి, వైవాహిక స్థితి, వైద్య చికిత్స వివరాలు, చికిత్స, పునరావాసం కోసం ప్రభుత్వం చేసిన లేదా ప్రతిపాదించిన ఖర్చులతో సహా ప్రతి యాసిడ్ దాడి బాధితుడి సంక్షిప్త వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా అందించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. యాసిడ్ దాడి బాధితులకు పునరావాసం, పరిహారం, వైద్య సహాయం కోసం అమలు చేయబడిన పథకాల వివరాలను సమర్పించాలని అన్ని రాష్ట్ర న్యాయ సేవల అధికారులను ఆదేశించింది. యాసిడ్ దాడి కేసులను పరిష్కరించే చట్టపరమైన చట్రాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం శాసన జోక్యాన్ని పరిగణించాలని సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా సూచించింది.



## పాక్ నుంచి భారత్‌లోకి భారీగా నకిలీ కరెన్సీ
### ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై డీ కంపెనీ నజర్

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్‌లో ఈ ఏడాది వరుసగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ ఇబ్రహీం సిండికేట్ భారీ కుట్రలు ప్రారంభించింది. కోట్లాదిరూపాయల విలువైన నకిలీ కరెన్సీని దేశంలోకి చొప్పించేందుకు సిద్ధమవుతోందని భారత నిఘా వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌లో భారీ ఎత్తున నకిలీ భారత కరెన్సీ నోట్లను ముద్రించి, వాటిని బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భారత్‌లోకి అక్రమంగా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా ప్రాంతం నకిలీ నోట్ల రవాణాకు ప్రధాన కేంద్రంగా మారినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు గుర్తించారు. బంగ్లాదేశ్ నుంచి పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ మాల్దాకు చేరనుందని, అందుకు స్థానిక నెట్‌వర్క్ సన్నాహాలు చేసుకుంటోందని సమాచారం అందింది. ఈ నకిలీ నోట్లను అత్యంత నాణ్యతతో, అత్యాధునిక యంత్రాలపై ముద్రిస్తున్నారని ఫోరెన్సిక్ నిపుణులు చెబుతున్నారు. అసలు నోట్లలో ఉండే వాటర్‌మార్క్‌ను సైతం పక్కాగా రూపొందిస్తుండటంతో, వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే కరెన్సీ ప్రింటింగ్ యంత్రాల ద్వారానే వీటిని ముద్రిస్తున్నట్లు ఏజెన్సీలు బలంగా అనుమానిస్తున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్లామాబాద్ పట్ల ఇటీవల అనుసరిస్తున్న మెతక వైఖరితో, పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు సముద్ర మార్గం ద్వారా నకిలీ నోట్ల రవాణా సులువుగా మారింది. ఇదే మార్గంలో ఆయుధాలు కూడా చేరుతున్నాయని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మార్చి నుంచి మే మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో భద్రతా సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. ఇదే అదనుగా భావించి, నకిలీ నోట్లను సులభంగా చెలామణి చేయాలని డీ కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో, ముఖ్యంగా మాల్దా పరిసరాల్లో నిఘాను తీవ్రతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కరెన్సీ ఒక్కసారి దేశంలోకి ప్రవేశిస్తే అడ్డుకోవడం కష్టమని, అందుకే సరిహద్దుల్లోనే దీన్ని నిరోధించడం కీలకమని వారు పేర్కొన్నారు.

## రైలు జాప్యానికి విద్యార్థినికి రూ.9 లక్షల పరిహారం
### కోర్టు ఖర్చులుగా రూ.12 వేలు చెల్లించాలని ఆదేశం




**బస్తీ(యుపి),జనవరి 27:** రైలు ఆలస్యంతో ఓ విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిన కేసులో న్యాయస్థానం తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆవిద్యార్థినికి రైల్వే శాఖ నుంచి రూ.9లక్షల పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరమ్ భారతీయ రైల్వేను ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి అనే విద్యార్థిని 2018లో బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంది. పరీక్షకు లక్నోలోని జై నారాయణ్ పీజీ కళాశాల సెంటర్ పడింది. దీంతో పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఆమె ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. కానీ, ఆ రైలు నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా చేరుకుంది. దీంతో సమృద్ధి టైమ్‌కి పరీక్షా కేంద్రానికి చేరుకోలేకపోయింది. ఫలితంగా ఆమె ఓ అకాడమిక్ ఇయర్‌ను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థిని రైల్వే శాఖపై న్యాయపోరాటానికి దిగింది. జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. దాదాపు ఏడు సంవత్సరాలు జరిగిన న్యాయ పోరాటం తర్వాత కమిషన్ ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ లోపాలకు రైల్వే శాఖే బాధ్యత వహించాలని తీర్పు చెప్పింది. విద్యార్థిని కోల్పోయిన విద్యా సంవత్సరానికి గానూ పరిహారంగా రూ.9లక్షలు, కేసు ఖర్చుల నిమిత్తం రూ.12వేలు చెల్లించాలని రైల్వే శాఖను వినియోగదారుల కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించాలని స్పష్టం చేసింది.



### సిగరెట్ లైటర్ కోసం ఘర్షణ
## ఒకరు మృతి

**కోలార్, జనవరి 27:** సిగరెట్ లైటర్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. మరొకరి నాలుక తెగి, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా కమ్మసంద్రలో ఈ దారుణ ఘటన జరిగింది. కర్ణాటకలోని కమ్మసంద్రలో క్రికెట్ పోటీలకు ఇద్దరు స్నేహితులు ప్రశాంత్ (35), రోషన్ హెగ్డే వెళ్లారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇద్దరు మద్యం సేవించారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య సిగరెట్ లైటర్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ ముదరడంతో బీర్ బాటిళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రోషన్ హెగ్డే నాలుకకు తీవ్రగాయమైంది. తీవ్ర గాయాలు కావడంతో భయపడిపోయిన రోషన్ తన కారులో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కానీ ప్రశాంత్ అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కారు డోర్ పట్టుకుని అడ్డగించేందుకు చూశాడు. దీంతో ప్రశాంత్‌ను అలాగే కారుతో ఈడ్చుకెళ్లి వేగంగా చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రశాంత్ మృతికి కారణమైన రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోషన్ నాలుక తెగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌బోర్డు కెమెరాలో రికార్డయ్యాయి.

## కేంద్ర ప్రభుత్వరంగ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.20 లక్షల పరిమితి




**న్యూఢిల్లీ, జనవరి 27:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, ఏకరూప మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రాట్యుటీ అర్హత, చెల్లింపు కాలపరిమితులు, రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి ఎప్పటి నుంచి వర్తిస్తుందన్న గందరగోళంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డిపిఇ) ఒక ఆఫీస్ మెమోరాండం విడుదల చేసింది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972కు చేసిన సవరణల నేపథ్యంలో 2017, 2018లో జారీ చేసిన పలు సూచనలను, వివరణలను క్రోడీకరించి ఈ తాజా మార్గదర్శకాలను రూపొందించినట్లు డీపీఈ తెలిపింది. సీపీఎస్ఈలలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌ఎగ్జిక్యూటివ్‌లు సహా అందరు ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం1972కు 2018లో సవరణలు చేసి, గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతూ కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2018 మార్చి 29 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం 2018 మార్చి 29 లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన లేదా గ్రాట్యుటీకి అర్హులైన సీపీఎస్ఈ ఉద్యోగులందరికీ రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇది చట్టబద్ధమైన నిబంధన కాబట్టి, సంస్థల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఈ మొత్తాన్ని తప్పనిసరిగా చెల్లించాలని డీపీఈ తన మెమో రాండంలో స్పష్టం చేసింది. 2017 జనవరి 1 నుంచి 2018 మార్చి 28 మధ్య కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ చెల్లింపులు ఆయా సంస్థల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కాలంలో ఐడీఏ పే స్కేల్‌లో వేతన సవరణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌యూనియనైజ్డ్ సూపర్‌వైజర్లకు వారి సంస్థ ఆర్థిక భారాన్ని మోయగలదా అనే అంశాన్ని బట్టి గ్రాట్యుటీ చెల్లింపులు జరపడానికి అనుమతించారు. సీపీఎస్ఈ ఉద్యోగులలో తరచూ తలెత్తే ఒక ముఖ్యమైన అనుమానాన్ని కూడా డీపీఈ నివృత్తి చేసింది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని 2016 జనవరి 1 నుంచి రూ. 10 లక్షలనుంచి రూ.20లక్షలకు పెంచారు. అయితే, ఈ పెంపు సీపీఎస్ఈ ఉద్యోగులకు వర్తించదని కేంద్రం తేల్చిచెప్పింది. సీపీఎస్ఈ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని 2016జనవరి 1నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది. ఈ ఏకీకృత మార్గదర్శకాలను అన్ని సీపీఎస్ఈలు కచ్చితంగా పాటించేలా చూడాలని, వాటి పరిధిలోని సంస్థలకు ఈ సమాచారాన్ని చేరవేయాలని అన్ని పరిపాలనా మంత్రిత్వ శాఖలను, విభాగాలను డీపీఈ ఆదేశించింది.

### ఫుట్‌బాల్ మైదానంలో మాఫియా కాల్పులు..
## 11 మంది మృతి , 20 మందికిపైగా గాయాలు



**మెక్సికోసిటీ, జనవరి 27:** మెక్సికోలోని ఫుట్‌బాల్ మైదానంలో దుండగులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మెక్సికోలోని గ్వానాహువాటో రాష్ట్రం సలమంకా నగరంలో ముందురోజు రాత్రి ఈ ఘటన జరిగింది. సాకర్ మ్యాచ్ పూర్తయిన తర్వాత పలువురు అభిమానులు మైదానంలోనే ఉన్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పలువురు దుండగులు కాల్పులకు దిగారు. దాదాపు 100 రౌండ్ల కాల్పులు జరిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన వెనుక గల కారణాలు మాత్రం తెలియరాలేదు. అయితే ఈ ఘటన వెనునక ఆర్గనైజ్‌డ్ క్రైమ్ గ్యాంగ్ ఉందని సలమంకా మేయర్ సీజర్ ప్రిటో తెలిపారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు మెక్సికో ప్రభుత్వం సహకరించాలని కోరారు. అధికారులను లొంగదీసుకునేందుకు క్రైమ్ గ్యాంగ్‌లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్వానహువాటోలో చమురు దోపిడీ, డ్రగ్స్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన గ్యాంగ్‌ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్, శాంటారోసా డి లామా కార్టెల్ గ్యాంగ్‌ల మధ్య గొడవలు నడుస్తున్నాయి. తాజాగా సాకర్ గ్రౌండ్‌లో జరిగిన కాల్పులు కూడా ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య వార్‌గానే అనుమానిస్తున్నారు.



## ఇరాన్‌పై దాడికి అమెరికా యుద్ధనౌక సిద్ధం

**వాషింగ్టన్, జనవరి 27:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ తాజాగా పశ్చిమాసియాకు చేరుకుంది. దీంతో ఇరాన్‌పై యుఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అబ్రహం లింకన్‌తోపాటు యుఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యుఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యుఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇక్కడికి చేరుకున్నాయి. అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వం కోసం దీన్ని మోహరించినట్లు పేర్కొంది. ఈ బృందం ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో కాకుండా హిందూ మహాసముద్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ పరిణామాలతో ఈ ప్రాంతంలో అమెరికా సైనిక సిబ్బంది సంఖ్య మరింత పెరిగింది. ఇదిలా ఉండగా పెంటగాన్ పలు ఫైటర్ జెట్‌లు, మిలిటరీ కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తరలించనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో భారీగా తమ సైన్యాన్ని ఇరాన్ దిశగా పంపినట్లు ప్రకటించారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

**చర్చలకు అమెరికా సిద్ధం:** ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ చర్చించాలనుకుంటే అమెరికా అందుకు సిద్ధంగా ఉందన అగ్రరాజ్యానికి చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. చర్చలు ముందుకు సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో టెహ్రాన్‌కు ఇప్పటికే తెలుసని అన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందుమైనార్టీ హంతకుల రక్షణకోసం ప్రత్యేక ఆర్డినెన్స్



**ఢాకా, జనవరి 27:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనా రిటీలపై దాడులు పెరిగిపోతుంటే వాటిని అడ్డుకోవాల్సిన యూనస్ సర్కారు ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తోంది. హంతకులు, ఆందోళనకారులకు రక్షణ కల్పించే చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా తర్వాత ముహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అక్కడ ఆందోళనలు ఎక్కువయ్యాయి. పోలీసులు, భద్రతా బలగాలతోపాటు హిందువులపై, రాజకీయ ప్రత్యర్థులపై ఆందోళనకారులు దాడులు, హత్యలు చేశారు. గత ఏడాది జులై ఆగస్టు సమయంలో ఈ దాడులు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో పోలీసులతోపాటు హిందువులు, ఇతర పౌరులు మరణించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన యూనస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి అండగా నిలిచింది. వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రొటెక్షన్ అండ్ లయబిలిటీ డిటర్మినేషన్ ఆర్డినెన్స్ 2026ను ఆదివారం అర్ధరాత్రి జారీ చేసింది. ఈ ఘటనల్లో నిందితులకు రక్షణ లభిస్తుంది, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన సివిల్, క్రిమినల్ కేసుల్ని రద్దు చేస్తారు. కొత్త కేసులు నమోదు చేయడానికి వీల్లేదు. జూలై, ఆగస్టులో పోలీసులు, హిందువులు, మైనారిటీలు, అవామీ లీగ్ సభ్యుల్ని చంపిన వారిపై చర్యలుండవు. ఇస్లామిస్టులు, అతివాదులు అయిన హంతకులు ఇకపై స్వేచ్ఛగా తిరుగుతారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా అప్పట్లో ఆందోళనకారులు తీవ్ర హింసకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్లు కూడా తగలబెట్టేశారు. కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలు చేశారు. అక్కడ ఏడాదిన్నర కాలంగా హసీనా పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ ఘటనల్లో గత అక్టోబర్ వరకు 44 మంది పోలీసులు మరణించినట్లు అక్కడి నివేదికలు తెలిపాయి. ఆగష్టు 5, 2024న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయింది. తనకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా ఇండియాకు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

## సంక్షిప్తంగా..

### ఫ్రాన్స్‌లో 15 యేళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



**ప్యారిస్, జనవరి 27:** పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 యేళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురానుంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ప్రకటించారు. 15యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా మాధ్యమా లను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లుకు ఫ్రాన్స్ దిగువ సభలోని శాసనసభ్యులు మద్దతిచ్చారన్నారు. సెనెట్‌లో దీనిపై చర్చలు జరిపి, బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు గంటలకొద్దీ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడం వల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మేక్రాన్ వెల్లడించారు. ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఉందని ఫ్రాన్స్ అధికారులు పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

### ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికాలో అసంతృప్తి




**వాషింగ్టన్, జనవరి 27:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్‌లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది.

### ప్రపంచ ఇంధన మార్కెట్లలో టాప్ భారత్: కెనడా మంత్రి



**న్యూఢిల్లీ,జనవరి 27:** ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభి వృద్ధి చెందుతోందని కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్ వ్యాఖ్యానించారు. ఇంధన రంగంలో కెనడా సూపర్‌పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ ట్రేడ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడం కోసం ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గ్‌సన్ తెలి పారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హార్దీప్‌సింగ్ పురి మీడియాతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు.


## భద్రతామండలిలో మరోసారి బయటపడిన పాక్ వక్రబుద్ధి

### తిప్పికొట్టిన భారత్ శాశ్వతప్రతినిధి




**న్యూయార్కు,జనవరి 27:** ఐక్యరాజ్యసమితి లో పాకిస్థాన్ వైఖరిని భారత్ మరోసారి ఎండగట్టింది. ఆపరేషన్ సిందూర్ పై ఆ దేశ రాయబారి చేసిన తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని చట్టబద్ధం చేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో పాక్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్, జమ్ముకశ్మీర్, సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని శిక్షిస్తూ సరికొత్త సాధారణ స్థితి నెలకొల్పినట్లు భారత్ చెబుతున్న పరిస్థితి ఏమీ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తమ ప్రతిస్పందనతోనే తేలిపోయిందని వ్యాఖ్యానించారు. దీనిపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ ప్రతిసారీ భారత్‌కు, దేశ ప్రజలకు హాని కలిగించడమే అజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని హరీశ్ పునరుద్ఘాటించారు. భారత అంతర్గత అంశాలపై వ్యాఖ్యానించే హక్కు పాకిస్థాన్‌కు లేదన్నారు. 65 ఏళ్ల క్రితం విశ్వాసం, స్నేహం స్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. అందుకే భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిందని తెలిపారు.

## అమెరికా మద్దతులేకుండా ఐరోపా స్వీయరక్షణ అసాధ్యం: మార్క్ రుట్టే



**బ్రస్సెల్స్,జనవరి 27:** అమెరికా సైనిక మద్దతు లేకుండా యూరప్ తనను తాను రక్షించుకోగలదని భావిస్తే, అది పగటి కలలు కనడమేనని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్ భద్రత విషయంలో వాస్తవికంగా ఉండాలని, అమెరికాపై ఆధారపడటం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో భద్రత, విదేశీ వ్యవహారాల కమిటీల సభ్యులను ఉద్దేశించి మార్క్ రూటె ప్రసంగించారు. అమెరికా లేకుండా యూరప్ తనను తాను కాపాడుకోగలదని ఇక్కడ ఎవరైనా అనుకుంటే, వారు ఆ కలలు కంటూనే ఉండవచ్చు. కానీ అది సాధ్యం కాదని ఆయన తేల్చి చెప్పారు. ఇటీవలి కాలంలో గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా విధానం, కూటమి సభ్య దేశాల సహకారంపై నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రూటె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూరప్ భద్రత విషయంలో నాటో, యూరోపియన్ యూనియన్ (ఈయూ) పరస్పరం పోటీ పడకూడదని, ఒకరికొకరు సహకారంతో పనిచేయాలని ఆయన సూచించారు. యూరప్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా కీలకమని అయితే అది నాటో ప్రయత్నాలకు ప్రత్యామ్నాయం కాకూడదని అన్నారు. యూరప్, కెనడా దేశాలు తమ భద్రతపై మరింత బాధ్యత తీసుకుంటున్నాయని, ఇది శుభపరిణామమని అన్నారు. ఉక్రెయిన్‌కు అందిస్తున్న సైనిక, మానవతా సహాయాన్ని ప్రస్తావిస్తూ, రష్యాదాడుల వల్ల ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రస్తుతం యూరప్ తన రక్షణ పరిశ్రమను నిర్మిస్తున్నప్పటికీ, ఉక్రెయిన్‌కు తక్షణ అవసరాలను తీర్చే స్థాయిలో అది లేదని అభిప్రాయపడ్డారు.

### ఎక్కడినుంచైనా..ఎప్పుడైనా ఆధార్ మొబైల్ అప్‌డేట్




**న్యూఢిల్లీ,జనవరి 27:** ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్‌కు సంబంధించి కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) కీలక ప్రకటన చేసింది. ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అప్డేట్ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసింది. దీని ద్వారా ఇప్పుడు మొబైల్ నంబర్‌ను ఇప్పుడు ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా అప్డేట్ చేసుకునే వీలు కల్పించనుంది. ఈ మేరకు ఆధార్ తన ట్విట్టర్‌లో దీని గురించి పోస్ట్ చేసింది. ఇక్కడ జనవరి 28 నుంచి ఈ సదుపాయం ఆధార్ కొత్త యాప్‌లో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఇకపై ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్ కోసం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉం డదు. దీంతో ప్రజలపై భారం తగ్గుతుందని భావిస్తోంది.

# అటవీ శాఖలో ఇంటి దొంగలపై ఉక్కు పాదం

**పీలేరు రేంజ్‌లో ఇద్దరు అధికారుల తొలగింపు**


పీలేరు, జనవరి 27 ప్రభాతవార్త: అటవీ శాఖలో ఇంటి దొంగల పని పట్టింది కూటం ప్రభుత్వం. శాఖలో ఉంటూ సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపి ఎర్రచందనం అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఇద్దరు అధికారులను ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించింది. ఈ సంఘటనకు వివరాలు... పీలేరులో ఇంటి దొంగల పైన కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. ఇద్దరు ఫారెస్ట్ అధికారులను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఫారెస్ట్ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీలేరు అటవీ శాఖలో పనిచేసే నలుగురు అటవీశాఖ అధికారులు తలుపుల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఉస్తికాయల పెంట సెక్షన్ బీట్ అధికారి టి.రెడ్డప్ప, అసిస్టెంట్ బీట్ అధికారి ఎం.విజయ భాస్కర్, నూతన కాల్వ చెక్ పోస్ట్ అధికారి సిఎం జయప్ప 2021లో ఈ ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తూ విలువైన అక్రమంగా ఎర్రచందనం సంపదను కొల్లగొడుతున్న స్మగ్లర్లకు సహకరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో స్మగ్లర్ల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటూ వారికి రాచబాట పరిచారు. ఈ తరహాలోనే తరలిస్తున్న స్మగ్లర్లకు సహకరించిన కేసులో అరెస్టు చేసి రిమాండుకు తరలించగా వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనంతరం వీరు 2022లో తిరిగి విధుల్లోకి చేరారు. ఈ కేసుపై ప్రత్యేక అధికారి ద్వారా ఇన్వెస్టిగేషన్ చేసి రిపోర్ట్‌ను అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఇదిలావుండగా ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన తరువాత అటవీ శాఖలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అటవీ శాఖలో పనిచేసే ఇంటి దొంగల పైన ఉక్కుపాదం మోపారు. పీలేరు అటవీశాఖలో అక్రమ ఎర్రచందనం రవాణాలో పట్టుబడి అరెస్ట్ అయిన ఫారెస్ట్ బీట్ అధికారులలో జయప్ప మృతి చెందగా, ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఏబిఒ ఎం. విజయ భాస్కర్‌లను సర్వీసు నుంచి తొలగిస్తూ జనవరి 3వ తారీఖున జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా రెడ్డప్ప అనే అధికారిపై చర్యలు చేపట్టారు. అయితే దీనిని స్థానిక అధికారులు మీడియాకు తెలియజేయక పోవడం గమనార్హం. ఏది ఏమైనా ఇంటి దొంగల పైన అటవీ శాఖలో కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపడంపై పీలేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కార్యాలయం ముందు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రైతులు

## ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతుల ఆందోళన

రాయదుర్గం జనవరి 27 ప్రభాతవార్త: రాయదుర్గం పట్టణంలో ఎపి ట్రాన్స్‌కో ఆఫీస్ దగ్గర మంగళవారం రాయదుర్గం మండలం బొమ్మకపల్లి మెచ్చిరి గ్రామాలకు చెందిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆందోళనకు దిగారు. డిడిలు కడ్డీ రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదంటూ రైతులు సురేషు ఎల్లప్ప బొమ్మేషు ఆవేదన వ్యక్తం చేశారు మా కన్నా వెనక డిడిలు కట్టిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చారని వారు ఆరోపించారు రాయదుర్గం రూరల్ ప్రాంతంలో రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ కోసం దాదాపు 70 వేల రూపాయలు దాకా వసూలు చేస్తున్నట్లు, అనంతరం మెటీరియల్ అంటూ మరో 50 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మల్లాపురం గ్రామంలో ఈ మధ్యనే ఇద్దరు రైతులతో రూ.70 వేలు కట్టించుకొని అదనంగా మరో రూ.50 వేలు కట్టించుకొని 1.20 లక్షలకు ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు మెటీరియల్ కలెక్షన్ ఇచ్చినట్లు రైతుల ఆరోపిస్తున్నారు. ఏదేమైనా రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ కోసం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతుల ఆరోపిస్తున్నారు.



యాదవ మహాసభ అధ్యక్షుడు చింకా నారాయణ యాదవ్‌తో కార్యవర్గ సభ్యులు

## యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తా

**యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ యాదవ్**

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: సంఘటితంగా ఉద్యమిస్తేనే సమస్యలను పరిష్కరించుకోగలమని భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణరావు యాదవ్ ఉద్ఘాటించారు. యాదవ్‌లంతా ఐక్యంగా ఒకే వేదికపైకి రావాలన్నారు. యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానని చింకా నారాయణరావు యాదవ్ అన్నారు. స్థానిక విజయవాడలో నారాయణ రావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు యాదవ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన యాదవ సంఘ నిర్మాణం చేపట్టి యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పడతానని అన్నారు. పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని అన్నారు. యాదవులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘ పరంగా కార్యవర్గం అండగా ఉంటుందని అన్నారు. యాదవ జాతికి అవసరమైన యాదవ భవన్ నిర్మాణం, యాదవ హాస్టల్ కొరకు ప్రభుత్వంలోని యాదవ పెద్దల ద్వారా ప్రయత్నిస్తామని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాలలో పర్యటించి అఖిల భారత యాదవ మహాసభను బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర యాదవ మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు వెంకటసత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు. యాదవ మహాసభ సమావేశంలో అంతర్భాగంగా యూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ యూత్ అధ్యక్షుడుగా ఆలా అనంతరామయ్య యాదవ్, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా కొలుసు మోహన్ యాదవ్, జనరల్ సెక్రటరీలుగా పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, యర్రాకుల శ్రీనివాస్ యాదవ్, బొడ్డు పైడిరాజు యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌లుగా జె.వి. కృష్ణయ్య యాదవ్, అల్లు వెంకట రమణారావు యాదవ్, తోకల రామక్రిష్ణ యాదవ్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకన్నారు.

## గవర్నరు ప్రసంగం తప్పుల తడక

**- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఏపీ గవర్నరు ప్రసంగం అంతా తప్పుల తడకగా ఉందని, ఆయనతో కూటమి ప్రభుత్వం పచ్చి అబద్ధాలు మాట్లాడించిందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో భారీ హామీలు గుప్పించారని, ప్రతియేటా జనవరి ఒకటిన జాబ్ కేలెండర్ అంటూ ప్రకటనలు ఇచ్చారని, రెండేళ్లు గడుస్తున్నా జాబ్ కేలెండర్ లేదని పేర్కొన్నారు. ఒక్క నిరుద్యోగికీ మూడువేల భృతి అందడం లేదని, యువతను దారుణంగా మోసగించారని అన్నారు. అమరావతి రైతులకు మొండిచేయి చూపించారన్నారు. తల్లికి వందనం పథకంలోనూ కోతలు విధించారని తెలిపారు. 30 లక్షల మంది విద్యార్థుల తల్లులకు మొండిచేయి చూపించారని, అన్నదాత సుఖీభవ, ఉచిత సిలిండర్ పథకాలు అరకొరగా అమలు చేశారని పేర్కొన్నారు. డైవర్షన్ కోసమే పి4 పేరుతో కొత్త డ్రామా లేవనెత్తారని, ఏ ఒక్క వర్గానికీ మేలు చేయని చంద్రబాబు సర్కారు, ప్రత్యేక విమానాల్లో తిరగడం తప్ప సాధించిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, మహిళలకు రక్షణ కరువైందని అన్నారు.

# పట్టణాల అభివృద్ధి ఫోకస్

**● రూ.52 వేల కోట్లతో ప్రణాళికలు ● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కార్యాచరణ**



విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: నగర,పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకు అనుగుణంగా మొత్తం రూ. 52 వేల కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తుంది. పట్టణ,పురపాలకాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం అందించిన సమాచారాన్ని అనుసరించి మంచినీరు, రోడ్లు, మురుగు కాల్వలు, ప్రజారోగ్యం, వీధిదీపాలు, ఇలా వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కేంద్ర కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఏపీ ప్రభుత్వం ఉమ్మడి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో కొత్తగా 23వేల 611 కిలోమీటర్ల మేర వరద నీటి కాలువలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ. 4 వేల 849 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇక ప్రతిరోజూ 302.01 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేలా ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం రోజూ వస్తున్న 1,957 మిలియన్ లీటర్ల మురుగు నీటిలో 533.65 మిలియన్ లీటర్లను శుద్ధి చేస్తున్నారు. మరో 711.76 మిలియన్ లీటర్లు శుద్ధి చేసేందుకు చేపట్టిన ఎస్‌టీపీలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. కొత్తగా 289 మిలియన్ లీటర్ల మంచినీటి సరఫరాకు కొత్త ప్రాజెక్టులు ప్రతిపాదించారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్రం నుంచి ఏటా రూ. 10 వేల కోట్ల చొప్పున పదేళ్లలో లక్ష కోట్లు సాధించి వాటితో నగరాలు, పట్టణాల రూపురేఖలు మార్చాలని ప్రణాళిక వేశారు. తొలిదశలో రూ. 30 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. సాస్కీ పథకంలో కేంద్రం నుంచి రూ. 2 వేల కోట్లు రాబట్టాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణాలతోపాటు అమృత్ పథకంలో రూ. 15 వేల 500 కోట్లతో వివిధ దశల్లోని అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నగర,పట్టణ వాతావరణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రహదారులు, వరద నీటి కాలువలు, తాగునీరు, వీధి దీపాలు, ప్రజారోగ్యం అంశాల్లో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పట్టణవాసులకు ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో లోటు భర్తీ చేయడంతోపాటు వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కార్యచరణ రూపొందిస్తోంది.

కేంద్ర పథకాల సమర్థ వినియోగంతోపాటు పుర, నగరపాలక సంస్థల నిధులతో పట్టణాల్లో మెరుగైన సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 2028 నాటికి రూ. 52 వేల కోట్లతో ప్రతిపాదిత పనులు పూర్తి చేయాలని యోచిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో పట్టణ జనాభా 29.47 శాతం నుంచి 37 శాతానికి పెరిగిందని అంచనా. విశాఖ, విజయవాడ నగరాలు విస్తరించగా గుంటూరు జనాభా పది లక్షలకు చేరువలో ఉంది. నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, కర్నూలు, అనంతపురం, కడప నగరాలూ ఏటేటా విస్తరిస్తున్నాయి.

రాష్ట్రంలోని 123 పుర, నగర పాలికలు, నగర పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 20 వేల 513 కిలోమీటర్ల మేర రహదారులుండగా కొత్తగా 1450 కిలోమీటర్ల మేర సిమెంట్, తారు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. కొత్తగా వెలుస్తున్న చాలా కాలనీల్లో పుర, నగరపాలక సంస్థల సాధారణ నిధులతో అక్కడ రోడ్లు వేయనున్నారు.

# శివరాత్రి తిరునాళ్ళకు శ్రీకాళహస్తి ముస్తాబు

**- ఫిబ్రవరి 10 నుంచి ఉత్సవాలు**

శ్రీకాళహస్తి, జనవరి 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మహాశివరాత్రి తిరునాళ్ళకు ముస్తాబౌతుంది. ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల పనులు యుద్ధ ప్రాతిపదికపై సాగుతున్నాయి. ఇప్పటికే దేవస్థానం అధికారులు పనుల నిర్వహణలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే పనుల నిర్వహణ, ఇప్పటి వరకు జరిగిన పనులు చేపట్టాల్సిన పనులకు సంబంధించి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలితో కలసి సమావేశం నిర్వహించి సూచించారు. కాగా జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు మరోసారి సమీక్షించారు. పలు సూచనలు చేసారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి గత ఏడాది చేసిన పనుల అనుభవం ఉండటంతో ఇంజనీ రింగ్ అధికారులను పరుగులు తీయిస్తున్నారు. భక్తుల బస సదుపాయాలకు, సాంస్కృతిక వేదిక రూపకల్పనతో పాటు పార్కింగ్, సిసి కెమెరాల ఏర్పాటు, స్వర్ణముఖి నదిలో భక్తులకు స్నానాలు, గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. ఇక ఇంజనీరింగ్ విభాగం పనుల్ని ఇఇ శ్రీనివాసులురెడ్డి సారథ్యంలో రథాలు, నారదపుష్కరిణిలో తెప్పలకు సంబంధించి పరిశీలన జరుపుతున్నారు. బందోబస్తుకు సంబంధించి వచ్చే సుమారు 1000 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

### భోళాశంకరుని సన్నిధిలో రంగవల్లులు

దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆలయంలో అడుగుపెట్టిన వెంటనే సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు రూపుదిద్దుతున్నారు. ఆలయం అంతా రంగుల ముగ్గుల మయం చేస్తున్నారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది.



ఇక బిక్షాల గాలిగోపురానికి అమర్చిన 'ఓం నమ:శివాయ' అనే నాయాన్ లైటింగ్ ఇటు తేరువీధి, అటు బజారువీధులను పాల వెలుగుల్లా మార్చేసింది. ఊరంతా పండగ అన్నట్లు మారింది. ఈ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఇఓ బాపిరెడ్డి సూచనల మేరకు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించుకుంటూ శివరాత్రిని బ్రహ్మాండంగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నారు.



## ఎసిబి వలలో సబ్‌ట్రెజరీ అధికారి

శ్రీకాకుళం, జనవరి 27 ప్రభాతవార్త: ఎసిబి వలలో శ్రీకాకుళం సబ్ ట్రెజరీ అధికారి ఎన్.రవిప్రసాద్, సీనియర్ అకౌంటెంట్ ఎ.శ్రీనివాసులు చిక్కారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఒక విశ్రాంత ఉద్యోగి నుంచి శాలరీ ఎరియర్స్ కోసం రూ.15వేలు నగదు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు శాలరీ ఏరియర్ బిల్లు రూ.4,34,697 కోసం రూ.20వేలు డిమాండ్ చేశారని, చివరికి రూ.15వేలు ఇవ్వడానికి అంగీకరించినట్టు తెలిపారు. 17 రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డిమాండ్ చేసిన మొత్తం ఇవ్వకుండా బిల్లు పెట్టడానికి నిరాకరించడంతో ఎసిబిని ఆశ్రయించాడు. సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు ద్వారా రూ.15వేలు నగదును సబ్‌ట్రెజరీ అధికారి ఎన్.రవిప్రసాద్ తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఇద్దరినీ విచారించి విశాఖకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎసిబి డిఎస్పీ రమణ, సిఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.




## తిరుపతిలో సూపర్‌మార్కెట్‌లో చోరీ

తిరుపతి, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో ఏకంగా దొంగలు సూపర్‌మార్కెట్‌లో చోరీ చేశారు. నగరంలో చిన్నపాటి శివార్లలో ఉన్న ఐఎస్ మహల్ సమీపంలోని ప్రాంతంలో ఉన్న ఎస్‌మార్ట్ సూపర్ మార్కెట్ యాజమాన్యం సోమవారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగిసిన తరువాత షట్టర్‌వేసి తాళాలు బిగించారు. మంగళవారం ఉదయం మార్ట్ తెరిచేందుకు రావడంతో షట్టర్ తాళాలు పగలగొట్టి చోరీచేసినట్లు కనుగొన్నారు. రాత్రి షట్టర్‌తెరిచి కొద్దిగా పైకిలేపి ముగ్గురు ముసుగులు ధరించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు సిసికెమెరాల్లో రికార్డయింది. అయితే వారు ఎవరు, ఎలా ఈ చోరీకి పాల్పడ్డారనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. మార్ట్ నిర్వాహకుడు కేరళకు చెందిన జబీర్ దొంగతనంపై తిరుపతి పశ్చిమ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు జాగిలాలు, క్లూస్‌టీమ్ షట్టర్‌ను, లోపల ఉన్న వేలి ముద్రలను సేకరించారు. తిరుపతి వెస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిసికెమెరా పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు.

## నేడే మహాత్మాగాంధీ సందేశ యాత్ర

మడకశిర టౌన్, జనవరి 27 ప్రభాతవార్త: మడకశిర మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు మహాత్మా గాంధీ సందేహ యాత్రను ప్రారంభిస్తారు. నీలకంఠాపురం గ్రామం నుంచి గ్రామాల మీదగా పాదయాత్రగా మధ్యాహ్నం మడకశిర పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. అనంతరం సిద్ధార్థ పాఠశాలలో సభ నిర్వహిస్తారు. భోజనం అనంతరం పట్టణం మీదగా వజ్రవాళ్యం, చీపులేటి, అయ్యవారిపల్లి గ్రామాల మీదగా పాదయాత్ర సాయంత్రానికి బుళ్ల సముద్రం గ్రామానికి చేరుకుంటారు. అక్కడే రాత్రి బస చేస్తారు. గురువారం బుల్లసముద్రంలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమై పరిగి మండలం ధనాపురం క్రాస్ మీదగా సేవా మందిరం చేరుకుంటుంది. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సేవ మందిరం నుంచి హిందూపురం పట్టణానికి చేరుకొని 78వ మహాత్మా గాంధీ వర్ధతి సందర్భంగా విగ్రహం వద్ద నివాళి అర్పించి అక్కడే సభ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన శాంతి, సత్యం అనే సోదరభావాన్ని చాటిచెప్పడానికి, దేశ సమగ్రత కోసం నేటి కాలంలో గాంధీజీ మార్గం ఎంతో అవసరమని నమ్ముతూ మహాత్మా గాంధీ సందేశ యాత్ర పేరుతో పాదయాత్రను చేపడుతున్నారు. రాజకీయాలకు అతీతంగా కేవలం గాంధీజీ సిద్ధాంతాల వ్యాప్తి కోసం సామాజిక హితం కోసం చేస్తున్న ఈ పాదయాత్రలో మీరందరూ పాల్గొని. దీనిని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు.

## కాణిపాకంలో యువగళం మొక్కులు తీర్చుకున్న శాప్ చైర్మన్

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు నేటికి మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయంలో తన అనుచరులతో కలసి మొక్కులు తీర్చుకున్నారు. ఈమేరకు ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ఆలయ అఖిలాండం వద్ద 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ళ క్రితం రాష్ట్రంలో వున్న విపత్కర పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలనే సంకల్పంతో టిడిపి జాతీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చారిత్రక యువగళం పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈపాదయాత్రకు అప్పటి ప్రభుత్వం ఎన్నో అవాంతరాలు సృష్టించిందని తెలిపారు. ఆ క్లిష్ట సమయంలో కాణిపాకం స్వామివారిని ప్రార్థించి పాదయాత్ర విజయవంతంగా పూర్తై ప్రభుత్వ ఏర్పడిన అనంతరం మొక్కులు చెల్లించుకుంటామని మనస్ఫూర్తిగా సంకల్పించినట్లు రవినాయుడు తెలిపారు. ఈమేరకు స్వామివారి ఆశీస్సులతో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తికావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో స్వామివారికి కాణిపాకం ఆలయంలో 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు స్వామివారి ఆశీస్సులుండాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా వుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఈయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల మండల టిడిపి అధ్యక్షుడు హరిబాబునాయుడు, నాయకులు మధుసూదన్ రావు, తిరుపతి గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరక్టర్ తోట వాసుదేవ్, తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.




## మండపం విషయంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయండి

**ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయండి**

**మాజీ మంత్రి రోజా వినతి**




నేషనల్ హైవే పిడికి వినతిపత్రం ఇస్తున్న రోజా

పుత్తూరు (నగరి), జనవరి 27 ప్రభాతవార్త: నగరి మునిసిపాలిటీ పరిధిలో కొండచుట్టు మండపాన్ని తొలగించవద్దని హైకోర్టు ఈనెల 20వ తేదీన ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ప్రాజెక్ట్ అమలు విభాగం చెన్నై ప్రాజెక్ట్ డైరక్టర్ ఎం.రవీంద్రరావును కోరారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నగరి మునిసిపాలిటీ పరిధిలోని కొండచుట్టు మండపాన్ని తొలగించవద్దని మాజీ మంత్రి చొరవతో చెంగమనాయనం ట్రస్ట్ ద్వారా హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులను పొందిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మంగళవారం చెన్నైలోని పిడిని కలిసి ఆమె ఒక వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కొండచుట్టు మండపం తొలగించకుండా వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. వందల ఏళ్ల వారసత్వ సంపదగా నిలిచిన కొండచుట్టు మండపాన్ని పరిరక్షిస్తూ దానికి ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారి మార్గాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు. 600 ఏళ్ల క్రితం సాళువ రాజుల పాలనతో నిర్మితమైన ఈ మండపంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజల నిత్య పూజలతో పాటు, ప్రతి ఏటా జనవరి నెలలో వచ్చే ముక్కనుమ రోజున కొండచుట్టు ఉత్సవం నిర్వహిస్తారని ఆ సందర్భంగా 21 దేవతా మూర్తులను మండపంలో కొలువు చేస్తారని పిడికి వివరించారు. తర్వాత కార్వేటినగరం సంస్థానం, నగరి పాలెగాళ్లు ఈ సంస్కృతిని కొనసాగించారన్నారు. హిందూ సంస్కృతితో పాటు స్థానికుల మనోభావాలతో ముడిపడి వున్న కొండచుట్టు మండపాన్ని పరిరక్షించే దిశగా హైకోర్టు కూడా ఉత్తర్వులు ఇచ్చినందున మండపాన్ని కూల్చకుండా జాతీయ రహదారి మార్గాన్ని మార్చాలని కోరారు. అలాగే పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డివైడరు వల్ల కె.ఎం.అగ్రహారం, మహాలక్ష్మిపురం, తిమ్మాపురం వెళ్లేందుకు దగ్గరగా వున్న మార్గం దూరమైందని తెలిపారు. డివైడరు అడ్డంగా వుండడం వల్ల ప్రజలు తమ గ్రామాలకు వెళ్లేందుకు ఒక కిలోమీటరు దూరం ప్రయాణించి యుటర్న్ తీసుకుని రావాల్సి వస్తోందన్నారు. అందువల్ల ఈ మూడు గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ గ్రామాల వద్ద వున్న డివైడర్ తొలగించి మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నగరి మునిసిపల్ ఛైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్ ఎంపిపి కన్నియప్ప, మండప నిర్వాహకులు మణిగండన్, మాజీ ఎజిపి బి.రవీంద్ర, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెట్ట ప్రాంత అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు కృషి

**నెల్లూరు కలెక్టర్ హిమాన్స్ శుక్ల**



వింజమూరు (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: ఉదయగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఒక ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తుందని వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో నిరుద్యోగతను తగ్గించి ఆర్థిక పరిపుష్టిని సాధించడమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని దుత్తలూరులో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ముగించుకుని వింజమూరుకు వస్తూ మార్గమధ్యలో నందిగుంట గ్రామంలో గోకుల షెడ్లను పరిశీలించారు. తరువాత వింజమూరులోని చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర నిర్వహణ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంపద కేంద్రంలో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ఎరువును ఇతర ప్రాంతాలకు కూడా పంపడం పట్ల కార్యదర్శి రామారావును, ఎంపీడీవో కే.శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. అనంతరం బొమ్మరాజు చెరువు ప్రాంతంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతు సాగు చేస్తున్న నిమ్మ తోటను పరిశీలించారు. రైతును పలు విషయాలను అడిగి ప్రభుత్వ పథకాలను గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో వనరుల ఉత్పాదకశక్తి ఎక్కువగా ఉందని, సద్వినియోగపరుచుకునే విధంగా రైతులకు బిందు సేద్యం పరికరాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీని వలన ఉద్యాన పంటల సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే విధంగా కృషి చేస్తామన్నారు. అంతే కాకుండా గొర్రెలు, మేకలు యూనిట్లను అందజేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ప్రోత్సాహానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నిస్తామన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు స్థానికులకు అధికంగా లభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్.సుజనా రాయుడు, మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, సొసైటీ డైరక్టర్ కోడూరు నాగిరెడ్డి, పాములపాటి మాల్యాద్రి, దుద్దిగుంట శ్రీనివాసులు రెడ్డిలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీపీఓ వసుమతి, సీఈఓ శ్రీధర్‌రెడ్డి, ఏపీడీ మృదుల, ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, నాయకులు కాటం రమణారెడ్డి, ఎనపల్లి పెంచలరావు, పల్లా మధు, ఎన్.రాయుడు తదితరులు ఉన్నారు.

# బిసిల రక్షణ చట్టం అమలుతోనే బిసిలకు భద్రత, న్యాయం



- ఆదరణ-3 పథకాన్ని సమర్థవంతంగా అమలు
- రాష్ట్రవ్యాప్తంగా బిసి భవనాల నిర్మాణం చేస్తాం
- డిఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా కోచింగ్ సెంటర్లు
- రాష్ట్ర బిసి సంక్షేమం శాఖ మంత్రి ఎస్.సవిత

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: బిసిల రక్షణ చట్టంతోనే బిసిలకు భద్రత, ఆత్మరక్షణ సాధ్యమని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖ ల మంత్రి ఎస్.సవిత అన్నారు. స్థానిక గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్‌లో బిసి కార్పొరేషన్ ఛైర్మన్లతో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ బిసిల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బిసి కార్పొరేషన్ ఛైర్మన్లతో భేటీలో మంత్రి స్పష్టం చేశారు. బిసిల రక్షణ చట్టం అమలుపై చర్చించడంతోపాటు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బిసిలకు అండగా నిలవడం, గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఆదరణ 1, 2 పథకాల తరహాలోనే, ఇప్పుడు ఆదరణ3ను ఏ విధంగా సమర్థవంతంగా అమలు చేయాలనే అంశంపై 39 మంది కార్పొరేషన్ ఛైర్మన్లతో చర్చించామన్నారు. బిసిలకు 34శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ల కల్పనపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా బిసి భవన్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం కింద బిసిలకు 20,000 రూపాయల అదనపు సబ్సిడీ అందించడ జరుగుతుందన్నారు. ప్రతి బిసి బిడ్డను ఎంట్రప్రెన్యూర్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డిఎస్సీ అభ్యర్థుల కోసం ప్రతి జిల్లాలో కోచింగ్ సెంటర్ల ఏర్పాటు, ఇప్పటికే 300 మంది విద్యార్థులు దీని ద్వారా ఎంపిక కావడం విశేషమన్నారు. లా ఎక్సలెన్స్ ఐఎఎస్ అకాడమీ ద్వారా బిసి విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో అత్యుత్తమ శిక్షణ సివిల్స్‌లో అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే బిసిల ప్రభుత్వం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో బిసిల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి సవిత పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లిఖార్జున్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అనంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

**ఐదేళ్ల అసమర్థ పాలనలో చేసిన తప్పులే... నేటి కేసులు**

మంత్రి సవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించాలని పనిచేయడం కక్ష సాధింపా..? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం కేసులో ఇరుక్కుపోయిన వైసిపి నాయకుడు జోగి రమేశ్.. బిసి కార్డు ఉపయోగించడం చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. కులం పేరుతో చేసిన తప్పుల నుంచి తప్పించుకోవడం కుదరదన్నారు. మాస్క్ అడిగిన పాపానికి దళిత సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ను మానసికంగా వేధించి ప్రాణం కోల్పోయేలా చేశారన్నారు. ఎందరో ఎస్సీలను, ఎస్టీలను, బిసిలను అక్రమంగా వేధించి, జైల్లో పెట్టారన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో తప్పుల మీద తప్పులు చేశారన్నారు. తప్పిద్దాలను సరిదిద్దుకోవాలని జగన్ ను ఆనాటి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా హెచ్చరించామన్నారు. ఆ తప్పులు ఫలితమే నేటి కేసులని, ఇందులో కూటమి ప్రభుత్వ ప్రమేయమేమీ లేదని స్పష్టంచేశారు. జగన్ హయాంలో జరిగిన తప్పిదాలపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరికొందరు గజదొంగల వివరాలు బయటకు రానున్నాయని వెల్లడించారు. తప్పులు చేయకుంటే జగన్‌కు, ఆయన బ్యాచ్‌కు భయమెందుకని మంత్రి సవిత ప్రశ్నించారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే



- నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేస్తాం
- చార్జీలు మరింత తగ్గించడానికి యత్నిస్తున్నాం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

బుచ్చి (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జిలు పెంచితే, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జిలు తగ్గించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు లో 3.37 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు కోవూరు నియోజకవర్గంలో మరో సబ్‌స్టేషన్ మూడు కోట్ల రూపాయలపై చిలుకు వ్యయంతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.4 కోట్ల వ్యవయంతో డిఇ కార్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆర్‌డిఎస్‌ఎస్ ద్వారా అనేక పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం నిర్వాహం వల్ల విద్యుత్ శాఖలో రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లిందని దానిని దశల వారీగా రూపు మాపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజులలో 1.19 పైసలు యూనిట్ కాస్టును తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో మూడు డిస్కంలు పనిచేస్తున్నాయని ఒకటి తిరుపతి, రెండువది విజయవాడ, మూడవది విశాఖపట్టణంలో అయితే విశాఖలో డిస్కమ్ మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అదివాస్తవ విరుద్ధమని ఖండించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుండి 5 వందల నుండి 6 వందల కోట్ల రూపాయాల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయని అన్నారు. త్వరలో విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత తీరుస్తామని తెలిపారు. ఏఇల కొరత చాలా ఉందని అన్నారు. రానున్న రోజులలో నెల్లూరు జిల్లాలో మరో 10 నుండి 12 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందచేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు కోవూరు నియోజకవర్గంలో 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మంత్రి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం శుభపరిణామమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతు పది కోట్ల రూపాయాల వ్యయంతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రారంబోత్స వాలు, డిఇ కార్యాలయానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్వా రైతుల సమస్యలను గుర్తించి విద్యుత్ చార్జిలను ఒకటిన్నర రూపాయి తగ్గించడం ఆనందంగా ఉందని అన్నారు. కిసాన్ సెజ్ వద్ద 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆమె విద్యుత్ శాఖ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలను గజమాలలతో క్రేన్‌తో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ రాఘవేంద్రరావు, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఎపి ట్రాన్స్‌కో డిఇ రమేష్ చౌదరి, బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ అశోక్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

# మత్తు వదలండి



ర్యాలీని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

- డ్రగ్స్ తీసుకోవద్దు... సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పండి
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం: మంత్రులు అనిత, సత్యకుమార్
- సైకిల్ ర్యాలీ ప్రారంభం... హాజరైన డిజిపి, ఈగల్ ఐజి, కలెక్టర్

విజయవాడ కార్పొరేషన్, జనవరి 12 ప్రభాతవార్త: డ్రగ్స్ సేవించకుండా ఉండటమే కాదు.. మన చుట్టు పక్కల సమాచారం తెలిసినా పోలీసులకు అందించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు యంత్రాంగం అధ్వర్యంలో డ్రగ్స్‌పై దండయాత్ర అనే నినాదంతో సైకిల్ ర్యాలీని సిపి రాజశేఖరబాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశాల అధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 35 రోజుల పాటు డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందుగు వేస్తూ డ్రగ్స్‌పై దండయాత్ర అనే నినాదంతో 510 కిలోమీటర్ల సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి సైకిల్ యాత్రను రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్యకుమార్ యాదవ్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేటి కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ అంతా సిపి రాజశేఖర్‌బాబేనన్నారు. ఎంతో మంది డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ డ్రగ్స్ వల్ల ఎంతమంది తల్లిదండ్రుల ఆవేదన, ఆక్రందనలు, ఆడబిడ్డల మానప్రాణాలు కాపాడటానికి ఈ మహిళా పోలీసులు ముందుకు వచ్చారని, సెలబ్రిటీ అనే పదానికి కొత్త అర్థం తెచ్చిన ఈ ఐదుగురు మహిళా పోలీసులకు తాను శాల్యూట్ చేస్తున్నానన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై దండయాత్ర.. ఒక మంచి కార్యక్రమమన్నారు. అన్యాయం, అరాచకం, నియంతృత్వం సమాజానికి ఎంత నష్టం చేస్తాయో, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు కూడా అంతే నష్టాన్ని చేస్తాయన్నారు. నేడు డ్రగ్స్ అనేవి ప్రపంచానికే మహమ్మారిగా మారాయని, నేడు డ్రగ్స్‌పై దండయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. మహిళా పోలీసులు నేడు 510 కిలోమీటర్ల యాత్ర ద్వారా ప్రజల్లో మార్పు తెస్తున్నారన్నారు.

ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహిళా పోలీసులు ఈ చైతన్య కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించడం విశేషం. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి, రవాణాను నియంత్రించండి అని తెలిపారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలుగా మారి నేడు చాలా మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నామన్నారు. సిఎం చంద్రబాబు, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా నేతృత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమాజంలో మార్పు తెచ్చే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రజల్లో మార్పు తెచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే డ్రగ్స్ రవాణా చేసేవారిని ఎన్‌డిపిఎస్ కింద అనేక మందిని జైలుకు పంపిచామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రవాణాను నిర్మూలించేలా ప్రజలు సహకారం అందించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి సమాజం కోసం పోలీసులు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు.

ఈగల్ డిజి ఆకె రవికృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ సేవించకుండా చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం అన్నారు. మత్తు పదార్థాల వల్ల అనేక మంది జీవితాలు నాశనం అయ్యాయని, వారు ఆ మత్తులో ఏం చేస్తారో, ఎలా వ్యవహరిస్తారో కూడా తెలియని పరిస్థితి భారతదేశానికి డ్రగ్స్ పంపించి దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి విషయాలు చాలా మందికి తెలియక డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్నారన్నారు. దేశానికి, దేహానికి హాని కల్గించే ఈ డ్రగ్స్‌ను అందరూ కలిసికట్టుగా తరిమికొట్టాలన్నారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని ముఖ్యంగా యువత కోసమే ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇతర రాష్ట్రాల నుండి కూడ గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారని, వంద శాతం రవాణాను నిరోధించేలా పోలీసులు యజ్ఞంలా పని చేస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో ఎంఎల్‌ఏ గద్దె రామ్మోహన్, డాక్టర్ జి.సమరం, డిసిపిలు కృష్ణకాంత్ పటేల్, షిరీన్ బేగం, కెజివి సరిత, బి.లక్ష్మీనారాయణ, ఎబిటిఎల్ ఉదయరాణి, ఎస్‌విడి ప్రసాద్, ఎడిసిపిలు, ఎసిపిలు, సిఐలు, సిబ్బంది, సుమారు 10వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# నెల్లూరులో యువగళం జన ప్రభంజనం

## విఆర్‌సి నుండి గాంధీ బొమ్మ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు, జనవరి 27 ప్రభాతవార్త -వైద్యం: రాజకీయాల్లో వ్యూహకర్తగా, అభివృద్ధిలో అపర భగీరథుడిగా పేరుగాంచిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సత్తా ఏంటో నెల్లూరు నగరం మరోసారి కళ్లారా చూసింది. యువనేత నారా లోకేష్ చారిత్రాత్మక యువగళం పాదయాత్ర నేటికి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు సిటీలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ ఒక మహా ప్రవాహంలా సాగింది. నెల్లూరు వీధులన్నీ పసుపుమయమయ్యాయి. విఆర్‌సి సెంటర్ నుండి గాంధీ బొమ్మ వరకు బారులు తీరారు. ఈ ర్యాలీలో కార్యకర్తలు "సింహపురి సింహం నారాయణ" అంటూ నినదిస్తూ, ఆయన వెంటే తామంతా ఉంటామని ఎలుగెత్తి చాటిచెప్పారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఇంచార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, 2023 జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకువచ్చిందని, 426 రోజుల పాటు 97 నియోజకవర్గాల్లో లోకేష్ సాగించిన ప్రయాణం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచిందని కొనియాడారు. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా రూ.200 కోట్లతో మున్సిపల్ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడం, మైనారిటీ విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మాణం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. లోకేష్ బాబు స్ఫూర్తితో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, రాబోయే రోజుల్లో నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని రూప్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గ్రావెల్ తరలింపు

- అడ్డుకున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు
- మూడు టిప్పర్లు సీజ్



దగదర్తి (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: గతంలో పలుమార్లు అక్రమ గ్రావెల్ తరలింపుపై మైనింగ్, రెవెన్యూ అధికారులు హెచ్చరించి కేసులు నమోదు చేసిన గ్రావెల్ దోపిడి ఆగడం లేదు. దగదర్తి మండలంలోని తిరువీధిపాడు గ్రామ రెవెన్యూలో మోపూరు భక్తవత్సలరెడ్డి కి సర్వే నెంబరు 118లో సుమారు 105 ఎకరాల పట్టా భూమి ఉంది. గత రెండు రోజులుగా తన సొంత భూమిలో కొందరు వ్యక్తులు రాత్రులు, పగలు బరితెగించి అక్రమంగా వాహనాలతో గ్రావెల్ తరలిస్తున్నారని రైతు భక్తవత్సలరెడ్డి మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ ఏడీ వాణిశ్రీ, మండల ఆర్ఐ ప్రియాంక, వీఆర్వో నరేష్‌లతో కలిసి మైనింగ్ ప్రదేశానికి వెళ్లి గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకున్నారు. సంఘటన స్థలంలో ఉన్న మూడు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగిస్తున్నట్లు మైనింగ్ ఏడీ తెలిపారు. అధికార పార్టీ నాయకుల అండతోనే తమ భూమిలో గ్రావెల్ అక్రమంగా తరలిస్తు న్నారని రైతు భక్తవత్సల రెడ్డి చెబుతున్నారు. అధికారులు తగిన విచారణ జరిపి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

# అత్యవసర సమయాల్లో ఎంత చురుగ్గా స్పందిస్తే అంతగా ప్రయోజనం

**ఎపిఎస్‌డిఎంఎ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్**

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: అత్యవరసర సమయాల్లో ఎంత చురుగ్గా స్పందిస్తే అంతగా ప్రయోజనం ఉంటుందని ఏపిఎస్డీఎంఎ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని మంగళగిరి ఎయిమ్స్ నర్సింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డిజాస్టర్ మేనేజ్మెంట్ సెల్ దేశవ్యాప్తంగా "ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సంసిద్ధత"పై సామర్థ్య శిక్షణ పెంపుదల్లో భాగంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపిఎస్డీఎంఎ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ పరిస్దితుల్లో హాస్పిటల్స్, డాక్టర్లు, నర్సులు విపత్తుల ప్రమాద తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి నర్సింగ్ విద్యార్థి విపత్తు స్వచ్ఛంద సేవకులుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా భారీ ప్రమాదాలు, విపత్తులు, కోవిడ్19 వంటి ఇతర మాస్ క్యాజువాలిటీ సంభవించినపుడు వెంటనే స్పందించి ప్రాణ నష్టాన్ని వీలైనంత తగ్గించగలమన్నారు. ఇందులో విపత్తు నిర్వహణకు సంబంధించి హాస్పిటల్ ప్రణాళిక, హాస్పిటల్స్ ముందస్తు సంరక్షణ చర్యలు, అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సంసిద్ధత, ప్రతిస్పందన, ముందస్తు పరికరాల అవసరాలను వివరించారు. అత్యవసర సమయాల్లో అనుసరించాలని విధానాలపై నిరంతరం అధ్యయనం, అవగాహన అవసరమన్నారు. ఆయా ఘటనల అనంతర పరిస్దితులను పరిశీలించడం వలను మరింత సృజనాత్మకంశాలు స్ఫూరిస్తాయన్నారు. స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్లో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అమలు చేసే ప్రణాళికలు, ఎమర్జన్సీ రెస్పాన్స్ గురించి ప్రాజెక్టు మేనేజర్లు బస్వంత్, సతీష్ తెలిపారు. జిఐఎస్‌లో హాస్పిటల్స్ మ్యాపింగ్, అందుబాటులో ఉన్న అంబులెన్స్ వివరాలు, డెసిషన్ రెస్పాన్స్ వంటి ఇతర సమాచారాన్ని జిఐఎస్ ఎక్స్పర్ట్ హరీష్ వారికి తెలియజేశారు.

# దుర్గమ్మవారి సేవలో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే



ఇంద్రకీలాద్రి, జనవరి 27 ప్రభాతవార్త: దుర్గమ్మవారిని మంగళవారం కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ఏపి, తెలంగాణ ఇన్‌కంటాక్స్ ఛీఫ్ కమీషనర్ ఎం.అనిల్ కుమార్ దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దాతలకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష విరాళాన్ని మంగళగిరి కృష్ణాయపాలెంకు చెందిన ఎన్ రమేష్ చౌదరి, పుష్పకుమారి దంపతులు మంగళ వారం అందించారు. సంగారెడ్డికి చెందిన సంపంగి మాధురి, కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దాతలకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# జగజ్జనని ఆశీస్సులు రాష్ట్రాభివృద్ధిపై వుండాలి: ఎంపీ కేశినేని



విజయవాడ, జనవరి 27, ప్రభాతవార్త: కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి రానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రానికి మేలు జరగాలని, నిధుల కేటాయింపు ఎక్కువగా జరగాలని, రాష్ట్రాభివృద్ధిపై ఆ జగజ్జనని అనుగ్రహం, ఆశీస్సులు వుండాలని ప్రార్థించినట్లు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ తన తల్లి ప్రసునాంబ, భార్య జానకి లక్ష్మీతో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఆలయమర్యాదలతో వేద పండితులు, ఆలయ అధికారులు, ఆలయ బోర్డ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఎంపి కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులను వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆ క్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు సమకూరతాయన్నారు. ఇంద్రకీలాద్రి ఆలయం మరింతగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశం సుభిక్షంగా వుండటంతో పాటు అభివృద్ధి చెందాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం బోర్డు మెంబర్స్ బడేటి ధర్మారావు, సుఖాసి సరిత, మన్నె కళావతి, ఠాగూర్ పద్మావతి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్ బాబు, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుఖాసి కిరణ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.వి వెంకట రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు (చందు) తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల్లో ఐదు రోజుల పని దినం

## - అనంత వీధుల్లో బ్యాంకు ఉద్యోగుల ర్యాలీ



అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో: బ్యాంకుల్లో పని ఒత్తిడి వల్ల తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామని, గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు తమకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యుఎఫ్‌బియు పిలుపుమేరకు అనంతపురంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది అనంతపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిబియు పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల మంది బాయంక్ ఉద్యోగస్తులు సమ్మెలో పాల్గొన్నారు. అనంతపురం జిల్లా యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బాయంక్ మైన్‌బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఇండియన్ బ్యాంక్ నుంచి క్లాక్ టవర్ వరకు 500 మంది బ్యాంక్ ఉద్యోగస్తులు ర్యాలీగా వెళ్లి క్లర్క్ వద్ద మానవ హారాన్ని ఏర్పాటు చేసి 25 నిమిషాల పాటు తిరిగి 5 రోజుల పనిదినాల కొరకు నినాదాలు చేశారు. తిరిగి ఇండియన్ బ్యాంక్ వద్దకు చేరుకోవడం జరిగింది. ఇండియన్ బ్యాంక్ వద్ద సభను ఉద్దేశించి బ్యాంకు ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ ప్రెసిడెంట్ కె.శంకర్ మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలు క్రిందట బ్యాంకు యూనియన్లకు ఐబిఎ మధ్య చర్చలలో 5-డే బ్యాంకింగ్ పట్ల ఒప్పందం కుదిరింది. క్లియరెన్స్ కొరకు కేంద్ర ప్రభుత్వానికి, ఆర్‌బిఐకు నివేదించడం జరిగింది. కాని 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ ఉద్యోగస్తుల పట్ల వ్యతిరేక దృక్పథంతో నడుస్తోంది అని, తమ వాదనను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని తెలియజేశారు. ఎస్‌బిఐ ఎన్‌సిబిఇ లీడర్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో 5 డే బ్యాంకింగ్ అనివార్యం అని, ఇతర ఫైనాన్షియల్ సెక్టార్ అయిన ఆర్‌బిఐ, ఎస్‌ఈడిఐ, ఐఆర్‌డిఎ, ఎల్‌ఐసి, జిఐసి, ఎన్‌పిఎస్ ఆర్థిక సంస్థలన్ని 5 రోజులు పని దినాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐబిఓసి, ఎజిఎస్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. బ్యాంకులు రైతులకు సాధారణ ప్రజానికానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని, కాని బ్యాంకు ఉద్యోగస్తులనువారి బాధలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ సెక్రెటరీ సంజయ్‌రామ్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో గత పది సంవత్సరాలుగా టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందని, బ్యాంకుల 5 డేస్ వర్కింగ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదని, ముఖ్యంగా బ్యాంకుల్లో నగదుకు సంబంధించి ఎటిఎం, డిపోసిట్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని మొబైల్ ద్వారా, పేటిఎం, ఫోన్‌పే, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మొదలగు సేవలు ద్వారా ప్రజలకు ప్రయోజనాలు కలిగి ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నుంచి దాదాపు500 మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యంగా అధిక ఒత్తిడి కలిగిన స్కేల్-4, స్కేల్-3 ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా వివిధ బ్యాంకు సంఘాల నాయకులు సునిత, రవితేజ, చంద్రశేఖర్, రేణుక, లోహిత్, నాగేంద్ర, సిఐటియు అరవింద్, చంద్రమౌళి, నవీన్, మురళీ, వహీద్, హనుమేష్, సతీష్, మల్లికార్జున, రమణరాజు, శివారెడ్డి, ఖైమన్ని బేగం, ఖైరునా, మధుబాబు, రవీంద్రనాయక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు అల్కరాజ్


**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026లో డి మినార్‌ను ఓడించి కార్లోస్ అల్కరాజ్ తొలిసారిగా విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు రాడ్ లావర్ అరీనాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో స్పానిష్ ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు, తన హోమ్ హోప్ అలెక్స్ డి మినార్‌ను 7-5, 6-2, 6-1 తేడాతో ఓడించాడు. 22 ఏళ్ల టాప్ సీడ్ అల్కరాజ్ ఆస్ట్రేలియన్ ఆరో సీడ్ తో పోటీలో దూసుకుపోయాడు. అతను అన్ని గ్రాండ్ స్లామ్ లలో చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నాడు. తొలి సెట్‌లో ఆరుసార్లు మేజర్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ డి మినౌర్ వరుసగా మూడు ఆటలను 3-3తో ముగించాడు. అయితే వ్యూహాత్మకంగా ఆడిన అల్కరాజ్ 5-3 ఆధిక్యాన్ని సాధించినా, ఆ తర్వాత సెట్‌ను ముగించే అవకాశాన్ని వృధా చేసుకుని విఫలమయ్యాడు. తరువాతి రెండు గేమ్‌లను గెలిచి సెట్‌ను కైవసం చేసుకోవడానికి అల్కరాజ్ తీవ్రతను పెంచినప్పుడు 5-5తో సమంగా ఉన్నారు. డి మినౌర్ తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడంతో అల్కరాజ్ 44 నిమిషాల్లో రెండవ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అదే ఊపుతో మూడో సెట్‌లో అతను 20 నిమిషాల కంటే తక్కువ సమయంలోనే 3-0 ఆధిక్యాన్ని సాధించి, తన ఐదవ ఏస్‌తో ఆధిక్యాన్ని సాధించాడు. అంతకుముందు జర్మన్ మూడో సీడ్ జ్వెరెవ్ అమెరికాకు చెందిన లెర్నర్ టియెన్‌పై 6-3, 6-7 (5/7), 6-1, 7-6 (7/3) తేడాతో 24 ఏస్‌లు సంధించి తన చివరి నాలుగు స్థానాన్ని బుక్ చేసుకున్నాడు.

ఆట



# వరల్డ్ టెన్నిస్ జూ. సింగిల్స్‌లో సృష్టికి టైటిల్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్స్ టోర్నమెంట్‌లో కమాండింగ్, అద్భుతమైన ప్రదర్శనతో భారత్ టెన్నిస్ స్టార్ సృష్టి కిరణ్ వరుసగా నాలుగో ఐటిఎఫ్ జూనియర్ సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. మెక్సికోలో జరిగిన ఈ ఫైనల్స్‌లో సృష్టి కెనడాకు చెందిన నటాలీ సత్సలాష్విలిపై 6-4, 6-1 తేడాతో వరుస సెట్లలో గెలిచింది. అంతకు ముందు సెమీఫైనల్లో 21 సింగిల్స్ మ్యాచ్‌ల విజయాలు సాధించిన యుఎస్‌ఎకు చెందిన నటాలియా ఎలెనా మార్టినెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో సృష్టి రెండవ సెట్‌ను కోల్పోయిన తర్వాత పుంజుకుని 7-5, 1-6, 7-5 తేడాతో విజయం సాధించింది. అలాగే డబుల్స్‌లో సృష్టి మెక్సికోకు చెందిన తమరా హెర్మన్‌తో కలిసి టాప్ సీడ్ జోడీగా నిలిచి రన్నరప్‌గా నిలిచింది. ఈ జంట అమెరికా జంట క్రిస్టినా లి-నటాలియా ఎలెనా మార్టినెజ్ చేతిలో 2-6, 6-4, 6-10 తేడాతో మ్యాచ్ టైబ్రేక్‌లో ఓడిపోయి ఆల్ రౌండ్ వారాన్ని ముగించింది.



# రంజీ ట్రోఫీ: ఛాంపియన్‌గా బీహార్

### 568 భారీ రన్స్ తేడాతో మణిపూర్

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ 2025-26 ఫైనల్లో బీహార్ జట్టు మణిపూర్‌ను 568 పరుగుల భారీ తేడాతో ఓడించి, టైటిల్‌ను గెలుచుకుని ఛాంపియన్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 522 పరుగుల భారీ స్కోరు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ బిపిన్ సౌరభ్ 143 పరుగులు సాధించగా, కెప్టెన్ సకిబుల్ గని 108 పరుగులు చేశాడు. సూరజ్ కశ్యప్ కూడా 83 పరుగులు చేసి బీహార్ భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాడు. మణిపూర్ బౌలర్లలో రెక్స్ రాజ్ కుమార్ 4 వికెట్లతో రాణించగా, ఫిరోయిజామ్ జోతిన్, బిశ్వోర్జిత్ కొంథౌజామ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తదుపరి 523 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మణిపూర్ తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులకు ఆలౌట్ అయింది. రోనాల్డ్ లాంగ్‌జామ్ 79 పరుగులతో అత్యధిక స్కోరు సాధించాడు. కానీ మిగిలిన బ్యాటింగ్ లైనప్ నుండి అతనికి మద్దతు లభించలేదు. సూరజ్ కశ్యప్ 3/34తో ముగించగా, ప్రశాంత్ సింగ్ మరియు హిమాన్షు సింగ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగుల ఆధిక్యంతో, బీహార్ రెండో ఇన్నింగ్స్‌లో పోటీపై పట్టు బిగించింది. ఓపెనర్ పియూష్ సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు, 322 బంతుల్లో 216 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు, ఇన్నింగ్స్‌ను ఆకట్టుకున్నాడు. రఘువేంద్ర ప్రతాప్ సింగ్ 90 పరుగులు చేయగా, ఖలీద్ ఆలం 81 పరుగులు జోడించి అతనికి మంచి మద్దతు ఇచ్చాడు. బీహార్ తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరు వికెట్లకు 505 పరుగుల వద్ద డిక్లేర్ చేయడంతో మణిపూర్‌కు 764 పరుగుల కష్టతరమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ స్కోరును ఛేదించే క్రమంలో మణిపూర్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌట్ అయింది. ఫిరోయిజామ్ జోతిన్ 74 పరుగులతో పోరాట పటిమను ప్రదర్శించగా, ఎల్. కిషన్ సింఘా 30 పరుగులు చేశాడు. అయితే, సూరజ్ కశ్యప్ 32 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టడంతో బీహార్ బౌలర్లు మరోసారి మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించారు. హిమాన్షు సింగ్ కూడా మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు, మణిపూర్ 57 ఓవర్లలోనే కుప్పకూలింది. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ మంచి ప్రదర్శన చేసింది, ప్లేట్ గ్రూప్ ఫైనల్‌లో మణిపూర్‌ను ఓడించి ఎలైట్ గ్రూప్‌కి పదోన్నతి పొందింది.




# పంజాబ్ విజయం

### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో 5-4 తేడాతో మహారాష్ట్ర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026లో మహారాష్ట్ర కేసరిపై పంజాబ్ రాయల్స్ కీలక విజయాన్ని నమోదు చేసింది. ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 మ్యాచ్ 12లో పంజాబ్ రాయల్స్‌పై 4-5 తేడాతో మహారాష్ట్ర గెలుపొందింది. పంజాబ్ తొలి అర్ధభాగంలో ఆధిపత్యం చెలాయించడంతో 4-1 ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత మహారాష్ట్ర 6, 7 బౌట్స్‌లో బలమైన పోరాట పటిమను ప్రదర్శించి పోటీని సజీవంగా ఉంచింది. ఈ ఫలితంతో మహారాష్ట్ర 4 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో, ఆరు పాయింట్లు, 23 బౌట్‌లతో ప్రచారాన్ని ముగించింది. పంజాబ్ 4 మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు, 18 బౌట్‌ల విజయాలతో మూడవ స్థానానికి చేరుకుంది. పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత గుజ్మాన్ లోపెజ్ యుస్నీలిస్‌పై మీనాక్షి ద్వారా పంజాబ్ ప్రారంభ 53 కిలోల మహిళల పోటీలో 6-0 తేడాతో క్లీన్ విజయాన్ని అందించింది. 74 కిలోల పురుషుల పోటీలో ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్ చంద్రమోహన్ నిరంతర దాడులతో యష్‌ను ఓడించాడు. మొదటి, రెండు పీరియడ్‌లలో చంద్రమోహన్ పదే పదే టేక్‌డౌన్‌లు, టర్న్‌లతో విజృంభించి 18-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేశాడు. 76 కిలోల మహిళల టైలో పంజాబ్‌కు చెందిన ప్రియా ప్రారంభంలోనే గోల్ చేసి పంజాబ్‌ను 3-1తో ఆధిక్యంలోకి నెట్టింది. 86 కిలోల పురుషుల బౌట్‌లో అమిత్, సందీప్ మాన్ ఉత్కంఠభరితమైన పోరాటం జరిగింది. సందీప్ టేక్‌డౌన్, పుష్‌అవుట్‌తో 8-7 తేడాతో స్వల్ప విజయాన్ని సాధించి పంజాబ్ ఆధిక్యాన్ని సంపాదించింది.

# నేడే నాలుగో టి20

### పరువు కోసం న్యూజిలాండ్ పట్టు.. ఇప్పటికే టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను మరో 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకున్న టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. మ్యాచ్ గెలిచి ఓటమితో పోయిన పరువును నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ఈ నెల 28, బుధవారం విశాఖపట్నం వేదికగా జరగనున్న నాలుగో టీ20లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటికే సిరీస్ దక్కించుకోవడంతో ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో బెంచ్ ఆటగాళ్లను పరీక్షించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తుది జట్టులో ఎవరిపై వేటు పడుతుంది, ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో 3 వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన జస్‌ప్రీత్ బుమ్రాకు విశాఖ మ్యాచ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. మెగా టోర్నీకి ముందు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాను ఈ మ్యాచ్ నుంచి పక్కనపెట్టనున్నారు. అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగనున్నాడు. బుమ్రాను కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణాపై వేటు పడుతుంది. మూడో టీ20కి దూరంగా ఉంచిన వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగితే రవి బిష్ణోయ్ ఉద్వాసనకు గురవుతాడు. అయితే మూడో టీ20లో బిష్ణోయ్ 2 వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్ గాయపడిన నేపథ్యంలో బిష్ణోయ్‌ను అతనికి బ్యాకప్‌గా సిద్ధం చేయాలనుకుంటుంది. ఈ క్రమంలోనే నాలుగో టీ20లోనూ అతన్ని కొనసాగించే అవకాశం ఉంది. అవసరమైతే వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లో ఒకరికి విశ్రాంతి ఇచ్చి మరీ బిష్ణోయ్‌ను బరిలోకి దించవచ్చు. ఇక వరుసగా మూడు టీ20ల్లో విఫలమైన సంజూ శాంసన్‌ను ఆఖరి అవకాశంగా నాలుగో టీ20లో ఆడించవచ్చు. అదే జరిగితే శ్రేయస్ అయ్యర్‌కు మరోసారి నిరాశే ఎదురు కానుంది. చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు తిలక్ వర్మ దూరమవ్వడంతో అయ్యర్‌ను జట్టులో కొనసాగించారు. తిలక్ వర్మకు బ్యాకప్‌గా అయ్యర్‌ను రెడీ చేయాలనుకుంటే నాలుగో టీ20లో అతను ఆడవచ్చు. అప్పుడు సంజూ శాంసన్ లేదా ఇషాన్ కిషన్‌లో ఒకర్ని తప్పించవచ్చు. అవసరమైతే అభిషేక్ శర్మకు రెస్ట్ ఇవ్వవచ్చు. సిరీస్ గెలిచిన నేపథ్యంలో చివరి రెండు మ్యాచ్‌లను పూర్తిగా ప్రయోగాలకు వాడుకునే ఛాన్స్ ఉంది. ఓపెనర్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. రింకూ సింగ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యాకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం ఆర్డర్‌లో మార్పులు చేయవచ్చు.






# రికవరీ అవుతున్న భారత్ రూపాయి



వాణిజ్యం

**ముంబయి,జనవరి 27:** ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడుతుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌ఐఐ) పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది.

అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడిదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.



# ఉద్యోగాల్లో భారీ కోతపెడుతున్న అమెజాన్

**వాషింగ్టన్,జనవరి 27:** అమెజాన్ మరోసారి ఉద్యోగాల్లో భారీ కోత పెడుతోంది. 30 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించే ప్లాన్‌లో భాగంగా, ఇప్పటికే మొదటి విడతలో సగం మందిని విధుల నుంచి తొలగించింది. మిగతా వారిని కూడా తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఇది అమెజాన్ చరిత్రలోనే అతిపెద్ద ఉద్యోగ తగ్గింపు ప్రక్రియ. 2025 అక్టోబర్‌లో మొదటి దశలో సుమారు 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా, రెండో దశలో కూడా అదే స్థాయిలో కోతలు ఉండే అవకాశం ఉంది.

ఈ కోతలు ప్రధానంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్), రిటైల్ విభాగం, ప్రైమ్ వీడియో, పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ (హెచ్‌ఆర్) విభాగాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. అమెజాన్ మొత్తం 15 లక్షల మంది ఉద్యోగుల్లో ఇది కేవలం 2 శాతం మాత్రమే అయినప్పటికీ, కార్పొరేట్ స్థాయిలో దాదాపు 10 శాతం ఉద్యోగాలు తగ్గుతాయి. గతంలో ఉద్యోగ కోతలకు లాభాలు తగ్గడం, ఖర్చులు పెరగడం, ఎఐవల్ల ఆటోమేషన్ వచ్చినట్లు కంపెనీలు చెప్పేవి. కానీ అమెజాన్ సిఇఒ ఆండీ జాస్సీ ఈసారి కొత్త కారణం చెప్పారు. కల్చర్ అంటే సంస్థలో ఏర్పడిన బ్యూరోక్రసీ, లేయర్లు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరగడం. ఉద్యోగులు పెరిగేకొద్దీ టీమ్‌లు పెరిగాయి, మేనేజర్లు మరో మేనేజర్లను నియమించుకున్నారు. ఒక్క నిర్ణయానికి అనేక అనుమతులు, సమీక్షలు, చర్చలు అవసరమవుతున్నాయి. బాధ్యత ఎవరిది అనేది స్పష్టంగా లేకుండా పోయింది. దీంతో కంపెనీ నెమ్మదిగా ముందుకు సాగుతోందని జాస్సీ భావిస్తున్నారు. అందుకే ఈ తొలగింపులను ఆర్థిక సమస్యగా కాకుండా సంస్థ నిర్మాణాన్ని సరిచేసే చర్యగా చూపిస్తున్నారు. ఎఐ పాత్ర లేదని పూర్తిగా చెప్పలేం.

గతంలోనే జాస్సీ ఎఐ వల్ల భవిష్యత్తులో కార్పొరేట్ ఉద్యోగాలు తగ్గుతాయని చెప్పారు. ఈసారి ప్రత్యక్ష కారణం ఎఐ కాకపోయినా, అది అమెజాన్ సామర్థ్య వ్యూహంలో భాగమే అని నిపుణులు అంటున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ కోతలు గోదాములు, డెలివరీ సిబ్బందిపై పడలేదు. కీలక సిబ్బంది, కార్పొరేట్ ఉద్యోగులపైనే పడుతోంది. అక్టోబర్‌లో తొలగించిన ఉద్యోగులకు 90 రోజుల జీతం సెవరెన్స్ ప్యాకేజీ ఇచ్చారు. ఆ సమయంలో కంపెనీలోనే మరో ఉద్యోగం చూసుకోవచ్చు లేదా బయట అవకాశాలు వెతుక్కోవచ్చని చెప్పారు.

# వాట్సాప్ ప్రైవసీపై అమెరికా కోర్టులో దావా



**శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 27:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సాప్ ప్రైవసీపై ఫిర్యాదులు పెరిగిపోయాయి. తమ సంభాషణలు ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో అత్యంత సురక్షితమని భావిస్తున్న యూజర్లను కలవరపరిచేలా, వారి ప్రైవేట్ మెసేజ్‌లను మాతృ సంస్థ మెటా చదవగలదని ఆరోపిస్తూ అమెరికాలో ఒక దావా దాఖలైంది. ఈ పరిణామంతో ప్రముఖ మెసేజింగ్ యాప్‌ల భద్రతపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో కోర్టులో ఈ నెల 23న ఈ దావా దాఖలైంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, మెక్సికో దేశాలకు చెందిన కొందరు యూజర్లు ఈ పిటిషన్ వేశారు. వారి ఆరోపణల ప్రకారం వాట్సాప్ ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానం బూటకమని, మెటా ఉద్యోగులు అంతర్గత టూల్స్ ఉపయోగించి యూజర్ల చాట్స్‌ను యాక్సెస్ చేయగలరని వారు ఆరోపించారు. యూజర్ ఐడీ ఆధారంగా ఇంజినీర్ల అనుమతితో మెసేజ్‌లను దాదాపు రియల్ టైంలో చూడొచ్చని, చివరకు డిలీట్ చేసిన కంటెంట్‌ను కూడా వీక్షించగలరని ఆరోపణల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు మద్దతుగా పిటిషనర్లు ఎలాంటి సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించలేదు. ఈ దావాను మెటా సంస్థ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా తప్పుడు, అసంబద్ధమైన ఆరోపణలని కొట్టిపారేసింది. వాట్సాప్ ఎండ్‌టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ పకడ్బందీగా పనిచేస్తుందని, ఎన్‌క్రిప్షన్ కీలు కేవలం యూజర్ల డివైజ్‌లలోనే ఉంటాయని స్పష్టం చేసింది. అందువల్ల తాము గానీ, తమ ఉద్యోగులు గానీ మెసేజ్‌లను డీక్రిప్ట్ చేయడం లేదా చదవడం సాంకేతికంగా అసాధ్యమని మెటా పునరుద్ఘాటించింది. ఈ వివాదంలోకి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ప్రవేశించారు. వాట్సాప్ సురక్షితం కాదు అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించిన ఆయన, ఇతర ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల విశ్వసనీయతను కూడా ప్రశ్నించారు. దీనికి బదులుగా తమ ఎక్స్ చాట్ ఫీచర్‌ను ప్రయత్నించాలని యూజర్లకు సూచించారు.

### సెన్సెక్స్, నిఫ్టీలకు ఇండో యూరప్

# ట్రేడ్ డీల్ సపోర్ట్

### లాభాల్లో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు

**ముంబయి, జనవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, భారత్‌యూరోపియన్ యూనియన్ కూటమి(ఈయూ) మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు సానుకూలంగా స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175.40 వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 319.78 పాయింట్లు పెరిగి 81,857.48 వద్ద ముగిసింది. భారత్, ఈయూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ డీల్ పరిధిలో 2032 నాటికి భారత్‌కు ఈయూ నుంచి వస్తువుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. భారత్‌కు వచ్చే దాదాపు 96.6 శాతం యూరోపియన్ వస్తువులపై సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అదే సమయంలో, భారత్ నుంచి దిగుమతి చేసుకునే 99.5 శాతం వస్తువులపై ఈయూ సుంకాలను తగ్గించనుంది. ఇది ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. మార్కెట్లలో ఇవాళ రోజంతా అస్థిరత కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటిసి, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లు 4 శాతం వరకు నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎన్టీపిసి, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎస్‌బీఐ వంటి షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి సూచీలకు మద్దతుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతం దూసుకెళ్లింది. అయితే, నిఫ్టీ మీడియా 1.4 శాతం, నిఫ్టీ ఆటో 0.9 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌క్యాప్; స్మాల్‌క్యాప్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి.

# క్షీణించిన ఏసియన్ పెయింట్స్ నికరలాభం



**ముంబయి, జనవరి 27:** ఏసియన్ పెయింట్స్ మంగళవారం 4.6శాతం నికరలాభాలు క్షీణించింది. గత ఏడాది 1110.5 కోట్లు లాభం ఆర్జిస్తే ఈసారి 1059.9 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ లేబర్‌కోడ్స్ అమలు ద్వారా ఒక్కసారిగా 63.74 కోట్లు అదనపు భారం భరించింది. కంపెనీ అనుకోకుండా వచ్చిన ఆకస్మిక ఖర్చులు 157.61 కోట్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ భారం కూడా 52.88 కోట్లుగా ఉంది. మరో 10.86 కోట్లు కూడా ఉద్యోగుల సంక్షేమంపైనే ఖర్చుచేసింది. వైట్‌టీక్ కొనుగోలుద్వారా మరో 93.87 కోట్లు అదనపు భారం వల్లనే నికరలాభాల్లో తగ్గినట్లు కంపెనీ చెపుతోంది. ముంబయి కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ రాబడుల ద్వారా రూ.8849.72 కోట్లు ఆర్జించింది. గత ఏడాదితోపోలిస్తే 3.85శాతంపెరిగింది. డెకొరేటివ్ వ్యాపారం 7.9శాతం వృద్ధి ఉన్నట్లు తెలిపింది. మొత్తంగా కోటింగ్ బిజినెస్ 4.4శాతంగా ఉంది. పన్నులు,వడ్డీ చెల్లింపులకు ముందు పిబిడిఐటి 8.8శాతం వృద్ధితో 1781 కోట్లు ఆర్జించినట్లు ప్రకటించింది. శ్రీలంక యుఎఇ, ఇథియోపియా బిజినెస్ 869.6 కోట్లుగా ఉంది. బాత్ ఫిట్టింగ్స్‌లో అమ్మకాలు 4.1శాతం క్షీణించింది. కిచెన్ వ్యాపారం 2.6శాతంగా ఉంది. వైట్‌టీక్ నికర అమ్మకాలు 12.4శాతం పెరిగి 29.2కోట్లు చేరింది. ఎపిపిజి నెట్ సేల్స్ 16.5శాతం పెరిగి రూ.334.7 కోట్లుగా ఉంది. పిపిజిఎపి నికర విక్రయాలు కూడా 16.9శాతం పెరిగి 713.3కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది. ఏసియన్‌పెయింట్స్ షేర్లు 2.6శాతం క్షీణించి 2630 చొప్పున బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.




# రూ.447 కోట్లు మారికో నికరలాభం!

**ముంబయి, జనవరి 27:** ఎఫ్‌ఎంసిజి మేజర్ కంపెనీ మారికో తన నికరలాభాల్లో 12.03 శాతం పెరిగినట్లు ప్రకటించింది. మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.447 కోట్లు ఆర్జించినట్లు మంగళవారం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.399 కోట్లు మాత్రమే సాధించిన లాభాలు ఈసారి పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 26.6శాతంపెరిగాయి. రూ.3537 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో 2794 కోట్లు మాత్రమే ఆర్జించింది. రాబడులు కూడా రూ.3458 కోట్లనుంచి 1.58శాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ప్రధాన కేటగిరీల్లో లాభదాయకత పెరిగింది. ఫుడ్ డిజిటల్‌ఫస్ట్ బిజినెస్ ధోరణుల్లో కొంతమేర మెరుగుపడ్డాయి.

అంతర్జాతీయ వాణిజ్యం కంపెనీకి గ్రోత్ ఇంజిన్‌గా మారినట్లు చెప్పింది మార్కెట్లలో ఈసారి మూడోత్రైమాసికంలో మంచి ఫలితాలు రాబట్టుకోగలిగామని ఎండి సిఇఒ సౌగత గుప్తా చెప్పారు. వార్షికవృద్ధి 11శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 16.7శాతంగా ఉంది. అయితేకంపెనీపై లేబర్‌కోడ్‌ల అమలు ద్వారా ఆరుకోట్లు అదనపు భారం పడిందని వివరించింది. భారత్‌లో కంపెనీ రాబడులు రూ.2681 కోట్లుగా ఉన్నాయి. మంగళవారం మార్కెట్లలో మారికో షేర్లు రూ.747.20గా కొనసాగాయి.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | బుధవారం 28 జనవరి 2026 | I








ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

గబ్బర్ సింగ్. వాడపల్లి దేవస్థానం చైర్మన్



# రూ.5 కోట్లతో శివాలయం.. మహా పునరుద్ధరణ!!

- ఫలించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి
- ప్రభుత్వం నుంచి సి జి ఎఫ్ నిధులు రూ.2కోట్ల మంజూరు...
- స్థానికులు విరాళాలు రూ.3కోట్లు



రూ 20 లక్షలు విరాళం ఇచ్చిన గోపి లీల కుటుంబ సభ్యులు



రూ ఐదు లక్షలు విరాళం ప్రకటించిన ఆనందరాజు



ముదునూరి రామకృష్ణంరాజు



చిలువూరి లక్ష్మీపతి రాజు

**ఆత్రేయపురం, జనవరి 27 ( ప్రభాత వార్త): పురాతన శివాలయం.. ఆ ఆలయం వలనే ఈ ప్రాంతానికి ఆ పేరు కూడా వచ్చింది. కాని నేడు దాదాపుగా శిథిలావస్థకు చేరింది. అయితే.. ఆ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు పాలకులు చేసిన కృషి ఫలించింది.**

ఆత్రేయపురం మండల కేంద్రంలో ఉన్న సుమారు నాలుగు దశాబ్దాల కాలం నాటి శ్రీ బాలా త్రిపుర సుందరి రాజరాజేశ్వరి, రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పూర్తిగా శిథిలస్థితికి చేరింది. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి ప్రభుత్వం నుంచి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మెన్ ముదునూరి వెంకట్రాజు (గబ్బర్ సింగ్) నిధులు మంజూరుకు తన వంతు కృషి చేశారు. దాని ఫలితమే నేడు ఆలయ పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇకపోతే స్థానికులు సైతం ఆలయ పునరుద్ధరణ పనుల కోసం భారీగా విరాళాలను అందించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపు మేరకు వాడపల్లి దేవస్థాన చైర్మెన్ ఆధ్వర్యంలో రూ. 3 కోట్ల మేర విరాళాలు సేకరించేందుకు శ్రీకరం చుట్టారు మొత్తం రూ. 5 కోట్ల నిధులు ఆలయం పునరుద్ధరణకు వెచ్చించి.. మరింత సుందరంగా ముస్తాబు చేయనున్నారు. ఈ ఆలయానికి ఒక చరిత్ర ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో అత్రి మహర్షి ఉండేవారు. ఆయన ప్రతి రోజు ఆత్రేయపురం చందన ఉన్న గౌతమి గోదావరిలో స్నానమాచరించి.. ఈ శివాలయంలో స్వామి వారికి భక్తితో పూజలు చేసేవారు. అత్రి మహర్షి ఇక్కడ వచ్చి శివాలయంలో పూజలు చేయడం వల్ల ఈ ప్రాంతానికి ఆత్రేయపురం అని పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతున్నారు. అంతటి చరిత్ర కలిగిన గ్రామం ఆత్రేయపురం. పురాతన దేవాలయాలకు ప్రసిద్ధి చెందిన గ్రామం. గ్రామంలో గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి, మల్లమ్మ, వల్లి దేవ సుబ్రహ్మణ్య స్వామి, రాధాకృష్ణ ఆలయం, పెద్ద, చిన్న రామాలయం శివాలయం పూర్వీకులు నిర్మించారు. అయితే ఇవి ఇటీవల కాలంలో శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు విరాళాలతో పలు దేవాలయాలను పునః నిర్మించారు. గ్రామానికి చెందిన పాతపాటి సోదరులు స్థానిక మహాత్మా గాంధీ కళాశాల సమీపంలో సొంత నిధులతో రూ 2 కోట్లతో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా నిర్మించారు. పలు దేవాలయాలతో ఆత్రేయపురం సర్వాంగ సుందరంగా, ఆధ్యాత్మికత కేంద్రంగా వుంది. శిధిలవస్థకి చేరుకున్న శివాలయం పునః నిర్మాణానికి సి జి ఎఫ్ నిధులతో పాటు గ్రామానికి చెందిన ప్రముఖులు వేగేశ్న వెంకట కృష్ణం రాజు గోపి లీల రూ 20 లక్షలు, పాతపాటి బ్రదర్స్ పాతపాటి నాగరాజు, రామాంజనేయులు రాజు, రమణ రాజు రూ 10 లక్షలు, మంతెన రుక్మని ఆనందరాజు రూ5 లక్షలు, చిలువూరిలక్ష్మీపతి రాజు రూ 5 లక్షలు, ముదునూరి సత్యనారాయణ రాజు అన్నారం రూ 2 లక్షలు, ముదునూరి రామకృష్ణంరాజు ముంబై రూ 5లక్షలు , ఇసుక పల్లి రామ సుబ్రమణ్యం రాజు రూ 2 లక్షలు ముదునూరి చంటి రాజు రూ 2 లక్షలు వేగేస్న నాగరాజు 2 లక్షలు, ముదునూరి సాయిరాజు రూ 2 లక్షలు, అల్లూరి వెంకటరాజు రూ రెండు లక్షలుతో పాటు మరికొంతమంది గ్రామస్తులు మూడు కోట్ల రూపాయలు విరాళాలు సమకూర్చి ఆలయ నిర్మాణానికి అడ్డంకులు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. శిధిలావస్థకు చేరిన శివాలయ ప్రాంగణం ఆక్రమణల బారిన పడటంతో వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు చొరవ తీసుకుని ఆక్రమణదారులతో చర్చించి ఆ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భారీ ఎత్తున ఆలయ నిర్మాణానికి ఆగమన శాస్త్రం ప్రకారం త్వరలో శివాలయం పుననిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి .కాగా ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దీనిపై దృష్టి సారించి, ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తుండటంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రూ 10 లక్షలు విరాళం ప్రకటించిన పాతపాటి సోదరులు



శిథిలావస్థలో శివాలయం

## శ్రీ విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం 30 లక్షలు



**అయినవిల్లి జనవరి 27 ప్రభాతవార్త** అయినవిల్లి ప్రఖ్యాత స్వయంభు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి హుండీ మంగళవారం లెక్కించారు. 49 రోజులకు హుండీ ఆదాయం 29, 24,697 అన్న ప్రసాద హుండీ 76,697 విదేశీ కరెన్సీ నోట్లు 14 మొత్తం కలిపి 30,01,285 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపు కార్యక్రమానికి గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, ప్రత్యేక అధికారి ఎన్ ప్రసాద్ రాజు, విఘ్నేశ్వర స్వామి ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు

## ఉపాధి కోసం కువైట్ వెళ్లి మృతి



**మామిడికుదురు.జనవరి 27(ప్రభాతవార్త)** ఉపాధికోసం కువైట్ వెళ్లి అనారోగ్యంతో అక్కడ మృతి చెందిన గోగన్నమఠం గ్రామం ముత్యాలపాలెం కు చెందిన బోసుపాముల మరియమ్మ(48)మృతదేహం మంగళవారం స్వగ్రామం చేరింది.నాలుగేళ్ల క్రితం కువైట్ వెళ్లిన మరియమ్మ ఆరు నెలల క్రితం స్వగ్రామం వచ్చి మళ్లీ కువైట్ వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు.అనారోగ్యంతో ఆమె పని చేస్తున్న నివాస గృహం గదిలో మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులు సెంటర్ ఆఫ్ మైగ్రేషన్ మరియు ఎపి ఎన్ఆర్టీ అధికారులను సంప్రదించారు.దీనిపై స్పందించిన అధికారులు కువైట్ ప్రతినిధులు చాట్ల శివ,బాషా అనే ప్రతినిధుల ద్వారా ఈ నెల 25వ.తేదీన కార్గో విమానంలో మృతదేహాన్ని పంపించగా ఆమె మృతదేహం సోమవారం హైదరాబాద్ చేరింది.అక్కడ నుంచి అంబులెన్సులో స్వగ్రామం పంపించారు.ముగ్గురు అమ్మాయిలతో జీవనం కష్టంగా ఉండడంతో ఆమె కుటుంబం కోసం కువైట్ వెళ్లి అక్కడ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## బాలుర గురుకులంలో ప్రవేశలకు దరఖాస్తులు

**అల్లవరం,జనవరి27(ప్రభాతవార్త),**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,అల్లవరం మండలం గోడి గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం బాలురు నందు 5,6,7,8,9,10వ తరగతి,ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్లైన్ చేసుకోవాలని జనవరి 20వ తేదీ నుండి ఫిబ్రవరి19వ తేదీ వరకు హెచ్ టీటీపీ.ఎపిజిపిసెట్.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్ నందు దరఖాస్తులు సమర్పించవలెనని గురుకులం బాలుర ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలుకు 8501004035, 83740266 39, 9346021798 నంబర్ల సంప్రదించాలన్నారు.

## ఎమ్మెల్సీ నాగబాబుతో గెడ్డం శివ రత్న గణపతి భేటీ...



**కడియం, జనవరి 27 ( ప్రభాతవార్త)** ఎచ్చెర్ల నియోజకవర్గంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును కడియం మండలం బుర్రిలంక చిరు సేవా సమితి అధ్యక్షులు మరియు జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గెడ్డం శివ రత్న గణపతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గెడ్డం శివ మాట్లాడుతూ చిరు సేవా సమితి 25 సంవత్సరాల సేవా ప్రస్థానంలో ఇటీవల ఘనంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల వివరాలను నాగబాబుకు తెలియజేశామన్నారు.. వేడుకల సందర్భంగా రూపొందించిన ఆల్బమ్?ను నాగబాబు ఆసక్తిగా తిలకించారని అయన తెలిపారు. చిరు సేవా సమితికి ఆతిథ్యం ఇచ్చిన నాగబాబు, 25 ఏళ్లుగా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాదిమందికి రక్తదానం చేస్తున్న శివ సేవలను ప్రశంసించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్?లో తప్పక ఒక సేవా కార్యక్రమానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. అలాగే, జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై శివతో చర్చించి పలు సూచనలు చేశారు. చిరు సేవా సమితి ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఎప్పుడైనా తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిరు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ



**రామచంద్రపురం,జనవరి 27,(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ సేవలను ప్రజలకు అందించే విధంగా వ్యవహరిస్తున్నారు.కానీ క్షేత్రస్థాయి అధికార సిబ్బంది పవన్ కళ్యాణ్ ఆదేశాలను గాలికి వదిలేసారా...? అనే ప్రశ్నకు సమాధానం అవుననే వినిపిస్తుంది.ఇక వివరాల్లోకి వెళితే రామచంద్రపురం రూరల్ ద్రాక్షారామం మేజర్ పంచాయతీ సిబ్బంది సమయానికి విధులకు హాజరు అవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వారికి నచ్చిన సమయంలో విధుల్లో హాజరవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.ప్రభుత్వ ఉద్యోగిల కాకుండా యజమానిగా సిబ్బంది వ్యవహరణ శైలి ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఎక్కడా లేని విధంగా స్థానిక ప్రజలు పంచాయతీ సిబ్బంది కొరకు పడిగాపులు పడడం విడ్డూరంగా ఉంది.సిబ్బంది సమయపాలన పై సంబంధింత పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేద్దామంటే ఆయన కూడా సమయపాలన లేకుండా విధులకు హాజరవుతున్నారని ఎంబిసి సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు,పువ్వుల నాగభూషణం,మేడిశెట్టి శ్రీనివాసులు వాపోతున్నారు.నైతిక ప్రమాణాలు,క్రమశిక్షణ మరియు చర్యలు తమ అధికారి అనుకరించే కింద స్థాయి సిబ్బందిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయని నాగేశ్వరరావు పేర్కొన్నారు.ప్రభుత్వ గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు10 గంటలకు వచ్చే విధంగా బయోమెట్రిక్ సిస్టం ఏర్పాటు చెయ్యాలని ఎంబిసి సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు...

## పని భారం తగ్గించండి.. వర్క్ టు రూల్' బాటలో వీఆర్వోలు



**అమలాపురం,జనవరి27,(ప్రభాతవార్త)** గ్రామ రెవెన్యూ అధికారుల పై మోపుతున్న విపరీతమైన పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ అమలాపురం మండలంలోని రూరల్, అర్బన్ వీఆర్వోలు మంగళవారం నిరసన గళం వినిపించారు. రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు మంగళవారం నుంచి 'వర్క్ టు రూల్' (నిబంధనల మేరకే పని) పాటిస్తున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ వి.ఎస్. దివాకర్?కు అందజేశారు. ?ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ తాము ఇప్పటికే రెవెన్యూ విధులు, రీ-సర్వే, పీజీఆర్ఎస్,సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, పోలీస్, కోర్టు సంబంధిత పనులతో పూర్తి ఒత్తిడిలో ఉన్నామని తెలిపారు. వీటికి తోడు ఇతర శాఖలకు సంబంధించిన పనులు, సర్వేలు అప్పగించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమను ఇతర శాఖల విధుల నుంచి మినహాయించి, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.?ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె. వెంకట గణేష్, అంకన రాజేష్, సత్యనారాయణ రాజు, మాచిరాజు వాసు, వినోద్, పల్లి రాంబాబు, రఘు, శివ, సత్యవతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## స్తంభించిన బ్యాంకింగ్ సేవలు.



**కాట్రేనికోన జనవరి 27(ప్రభాతవార్త)** వారానికి ఐదు రోజుల పని దినాల డిమాండ్లతో కాట్రేనికోన మండలంలో బ్యాంకులో మూతపడ్డాయి. యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు మంగళవారం సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. చర్చలు ఫలప్రదం కావడంతో అధికారులు నిరసన చేపట్టారు. వరస సెలవులు, సమ్మె వెరిసి బ్యాంకులకు తాళాలు పడడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

## నేడు ఆదిత్య యూనివర్సిటీ లో మెగా రక్తదాన శిబిరం



**గండేపల్లి జనవరి 27(ప్రభాతవార్త):** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో ఈ నెల 28 వతేదీ బుధవారం మెగా రక్తదాన శిభిరం నిర్వహించబడుతుందని ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం తన తల్లి ఆదిత్య వ్యవస్థాపక సభ్యులు ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి నల్లమిల్లి లక్ష్మీరాజ్యం జన్మదినం ఆదిత్య వ్యవస్థాపక దినోత్సవం-ఫౌండర్స్ డే సందర్భంగా ఆదిత్య సిబ్బంది విద్యార్థుల సౌజన్యంతో నిర్వహించబడే ఈ మెగా రక్త దాన శిభిరం ఉదయం ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం ప్రారంభిస్తారని తెలిపారు.గత 21 సంవత్సరాలుగా 2005సంవత్సరం నుండి ఆదిత్య సూరంపాలెం క్యాంపస్ నందు ప్రతీ సంవత్సరం జనవరి,ఆగష్టు నెలలలో ఈ మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి జిల్లాలో గల ప్రభుత్వ, ప్రముఖ స్వంచంద సంస్థలు బ్లడ్ బ్యాంక్ లు కాకినాడ, రాజమండ్రి,రంపచోడవరం నుండి వస్తారని, ప్రతీ సందర్భంలో ఒక్కొక్క పర్యాయం 1500 యూనిట్లకు తక్కువ కాకుండా ఇవ్వడం జరుగు తుందని, అత్యధిక యూనిట్ల రక్తదానం అందించిన సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డు సైతం ఆదిత్య కైవసం చేసుకున్నదని సతీష్ రెడ్డి తెలిపారు. ఈ మెగా రక్త దానశిబిరం లో 2000 యూనిట్లకు తక్కువ కాకుండా ఇవ్వాలని అందుకు విద్యార్థులు సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ డా.ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎలక్ట్రికల్ జేఈ మోహన్ రావు..



**అంబాజీపేట,జనవరి 27,(ప్రభాతవార్త):** విశాఖపట్నంలో 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపిఈపిడిసిఎల్సి ఎండి పృథ్వీతేజ నుండి ఉత్తమసేవా పురస్కారంను జేఈ కె.మోహన్ రావు అందుకున్నారు. ఈయన ప్రస్తుతం డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో ఎలక్ట్రికల్ జేఈ గా విధులు నిర్వహిస్తున్నారు. మోహన్ రావు గతంలో కాట్రేనికోన మండలంలో సబ్ ఇంజనీర్గా పని చేశారు. వృత్తి పట్ల అంకిత భావంతో పని చేసే మోహన్ రావు కు ఉత్తమ సేవా పురస్కారం రావడం పట్ల సహచర ఉద్యోగులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అమలాపురం కలెక్టరేట్లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో అంబాజీపేట విద్యుత్ శాఖ ఏఈ పి.కవిత, మొసలపల్లి, ముక్కామల లైన్మేన్లు చిక్కం మోహన్ మురళీకృష్ణ, ఐ.వి. సుబ్రహ్మణ్యం లు విద్యుత్ శాఖ అధికారుల నుండి ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

## శ్రీలక్ష్మి నరసింహుని కళ్యాణం చూద్దాం రారండి





**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి 27 (ప్రభాతవార్త)** : దక్షిణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ఎం.కె టి ఎన్వి ప్రసాద్ తెలిపారు. అలాగే 29న స్వామివారి రథోత్సవం కార్యక్రమం జరుగుతుందన్నారు. బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాలి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ,భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

**వైసిపి మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి.**



**కాకినాడ రూరల్ , జనవరి 27 (ప్రభాత వార్త):** జనవరి 28 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువై కీచక పర్వం కొనసాగుతుందని, ప్రజా సమస్యలు పరిష్కరించవలసిన ఎమ్మెల్యే మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చలనం లేకుండా ఉన్నారని వైసిపి మహిళా విభాగం కమిటీ ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రైల్వే కోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీచక పర్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తగ్గ నాయకులే ఆయన పార్టీలోనూ ఉన్నారని ఎద్దేవా చేసారు.చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రజాప్రతినిధులే కీచకులుగా మారితే సాధారణ మహిళలకు రక్షణ ఎక్కడుందని ఆవేదన వ్యక్తం చేసారు.. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధిత మహిళలపై ఏడాదిన్నరగా అత్యాచారం చేయడమే కాకుండా భర్త నుంచి విడాకులు తీసుకోవాలని బెదిరించడం అత్యంత దారుణమన్నారు.నిస్సిగ్గుగా ఉన్న వారిపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు.హోంశాఖ మంత్రి గా ఒకమహిళ ఉన్న రాష్ట్రంలో ఇలాంటి కీచకపర్వాలకు ప్రజాప్రతినిధులే పాల్పడటం సిగ్గు చేటని తక్షణమే హోం మంత్రి అనిత రాజీనామా చేయాలని జమ్ములమడక డిమాండ్ చేసారు.

## ఘనంగా మల్లాడి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు



**కాకినాడ రూరల్, జనవరి 27 (ప్రభాతవార్త):** మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని వివిధ సామాజిక వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, పలు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. మంగళవారం ట్రస్ట్ చైర్మన్ , కాకినాడ జనసేన పార్టీ నాయకులు మల్లాడి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. మల్లాడి రాజేంద్రప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని కాకినాడలోని ఆయన కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల మధ్య కేకు కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ వేడుకలకు జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన పార్టీ వీర మహిళలు భారీ సంఖ్యలో విచ్చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మల్లాడి రాజేంద్రప్రసాద్ తన ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేదలకు సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందివ్వడం గొప్పవిషయమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాజకీయాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజా సేవలో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

## వయసు 55.. పవర్ 105....

## పవర్ లిఫ్టింగ్ 'ఆది' బాబు



**అమలాపురం,జనవరి27,(ప్రభాతవార్త)** ?అమలాపురం కేంద్రంగా జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు అద్భుత ప్రదర్శన చేశారు. బెంచ్ ప్రెస్ విభాగంలో 105 కేజీల వెయిట్ లిఫ్ట్ చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ?ఈ సందర్భంగా అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదిబాబును ఘనంగా సన్మానించింది.2వ వార్డు అభివృద్ధిలోనూ,ప్రజా సేవలోనూ ముందుండే ఆదిబాబు,క్రీడల్లోనూ రాణించడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల వినాయక రావు, బోణం సత్తిబాబు,కంచిపల్లి అబ్బులు, మోకా వెంకట సుబ్బారావు, కొమ్మూరి వెంకటేశ్వర ప్రసాద్, దొమ్మేటి సాయిబాబు, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి,యర్రంశెట్టి నారాయణమూర్తి, కొప్పూరు వెంకటరెడ్డి,మేడిచర్ల త్రిమూర్తులు శెట్టి,అనిల్ కుమార్ జైన్, వలవలశివరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయానికి రూ.1,01,116 విరాళం



**మామిడికుదురు,జనవరి 27(ప్రభాతవార్త)** మామిడికుదురు మండలం లోని మగటపల్లి గ్రామంలో పునఃనిర్మించనున్న శ్రీ కోదండ రామాలయం నిర్మాణానికి గోగన్నమఠం గ్రామస్తులు సాగి పాండురంగ వెంకట సత్య సూర్య నరసింహ వర్మ(బాబు)వారి కుమారుడు రవివర్మ మంగళవారం రూ.1,01,116 ల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా భారీ విరాళం అందించిన దాతలను కమిటీ వారు అభినందించారు.

## నానో ఎరువుల వాడకం పై అవగాహన.



**కడియం ,జనవరి 27 (ప్రభాతవార్త)** ఆత్మ, ప్రకృతి వ్యవసాయం, జిల్లా వనరుల కేంద్రం వారిఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ద్వారా మండలం లోని మురమండ లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం స్థానిక రైతు వద్దికూటి దత్తుడు వ్యవసాయ క్షేత్రం లో రైతులకు నానో యూరియా, నానో డిఏపి వాడకం పైవివరించారు . అలాగే రసాయనక పురుగుమందులు వాడకుండా , కషాయాలు ద్రావణలు వాడి అధిక దిగుబడి పొందే మార్గాలను తెలియపర్చారు. నానో ఎరువుల పని తనం పెంచడానికి చేయెల్లం ద్రావణం ఎలా వాడాలి అనే విధానాన్ని డెమో ద్వారా తెలిపారు.అలాగే డ్రోన్ పిచికారి చేయించారు. ఈ కార్యక్రమం లో జిల్లాప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొడ్డా తాతారావు, డిఆర్సి ఏడిఏ జయారాజలక్ష్మి, రాజమహేంద్రవరం ఏడిఏ రమేష్, కడియం ఏఓ శ్రీనివాసరావు, ఆత్మ బీటీఎం రాజశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. కోనసీమ.. పుణ్యసీమ..

## ఏకాదశ రుద్రులను దర్శించుకున్న హరి వానంద స్వామి బృందం..



**అంబాజీపేట,జనవరి 27,(ప్రభాతవార్త):** కోనసీమ పుణ్యసీమని, కోనసీమలో ఏకాదశ రుద్రులు కొలువుతీరిన దేవాలయాలు ఉండటంతో పుణ్య భూమిగా విరాజిల్లు తోందంటూ ఋషికేశ్ కు చెందిన హరివానంద స్వామీజీ అన్నారు. ఉత్తరాది చెందిన స్వామీజీల బృందం ఏకాదశ రుద్రులను దర్శించు కునేందుకు మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా హరివానంద స్వామీజీ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ఎక్కువగా శివాలయాలు ఉన్నాయని వాటిలో ఏకాదశ రుద్రులు కొలువైవున్నారన్నారు. ఈ రుద్రులు ప్రతిపిటా సంక్రాంతి మరునాడు కనుమరోజున జగ్గన్నతోట ప్రభల తీర్థంలో ఒకేచోట ఆసీనులవడం ప్రపంచంలోనే ఎంతో అరుదైన విషయమన్నారు. అంతకుముందు ఏకాదశ రుద్రుల విశిష్టత,చరిత్ర, నిర్వహణ తదితర విషయాలను ఆలయాల అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏకాదశ రుద్రుల ఆలయాలను సందర్శించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముక్కామలలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శైవాగమ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన వేదవిద్యను ప్రశంసించారు.

## ఎమ్మెల్యే నెహ్రూను కలసిన మినీ గూడ్స్ వ్యాన్స్ అసోసియేషన్



**జగ్గంపేట జనవరి 27 (ప్రభాతవార్త)** జగ్గంపేట శివశక్తి మినీ వ్యాన్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు పీలా మహేష్, ఉపాధ్యక్షుడు మండపాక వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా మండపాక సత్యనారాయణ కమిటీ సభ్యులందరూ కలిసి జగ్గంపేట మండలం ఇర్రిపాక ఎమ్మెల్యే స్వగృహంలో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నూతన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పీల మహేష్ మాట్లాడుతూ జగ్గంపేటలో శివశక్తి మినీ వాన్స్ అసోసియేషన్ ఏర్పడి 30 సంవత్సరాలు అవుతుందని మాకు వ్యాన్లు నిలుపుదల చేసుకునేందుకు స్థలం లేదని ప్రభుత్వం ద్వారా స్థలం ఏర్పాటు చేసి అసోసియేషన్ భవనం కట్టుకునేందుకు సహకరించాలని ఎమ్మెల్యే నెహ్రూకువిన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివశక్తి మినీ వ్యాన్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు గంగాధర్ , దుర్గాప్రసాద్, రాంబాబు, రవి, రామకృష్ణ, ఆది, శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## తాటాకిళ్లు దగ్ధం.. నిరాశ్రయులైన వలస కూలీలు.



**కడియం ,జనవరి 27 (ప్రభాతవార్త)** వారంతా వలస కూలీలు, కడుపు నింపు కోవడానికి పొట్ట చేత పట్టుకుని వలస వచ్చారు. ప్రతి సంవత్సరం ఉపాధి కోసం వ్యవసాయ పనులకు వచ్చి , తిరిగి స్వగ్రామం వెళ్ళిపోతారు. రోజూలాగే అందరూ ఉదయం పనులకు వెళ్లి పోయారు. అనంతరం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదం లో సర్వం కాలి బూడిదయ్యాయి. వివరాల ప్రకారం కడియం మండలంలోని జేగురుపాడు నుండి మురమండ వెళ్ళు కాలువగట్టు రహదారి (జేగురుపాడు పంచాయతీ పరిధి) నందు ఒక రైతుకు సంబంధించిన మకాం లో గల తాటాకిళ్లు విద్యుత్ ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయ్యింది. దీనితో పది కుటుంబాలు కట్టు బట్టలతో మిగిలారు.రెండు మోటార్ సైకిళ్లు, సుమారు 5 లక్షలు రూపాయలు నగదు దగ్ధమైనట్లు వలస కూలీలైనా బాధితులు చెబుతున్నారు. అగ్ని ప్రమాద సమయంలో నివాసితులు అందరూ పొలం పనులను వెళ్లడంతో ఏవిధమైన ప్రాణ నష్టం జరగలేదు. అనపర్తి అగ్నిమాపక వాహనం, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వెను వెంటనే జేగురుపాడు ఎంపిటిసి నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, కూటమి నాయకులు మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు, బోనం నాగేశ్వరరావు బాధితులను పరామర్శించి 10 వేలు రూపాయలు నగదు సాయంగా అందజేసి, ధైర్యం చెప్పి, భరోసా కల్పించారు. స్థానిక తాసిల్దార్ సునీల్ కుమార్ మంగళవారం అగ్ని ప్రమాద బాధితులని పరామర్శించారు. అలాగే ప్రభుత్వం నుండి త్వరగా సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు మహర్షి విద్యానికేతన్ విద్యార్థులు.



**ఆత్రేయపురం,జనవరి, 27,(ప్రభాత వార్త)** జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్ లో 8, 9, తరగతులు చదువుతున్న విద్యార్థులు కొప్పు శెట్టి సృజన, మాగాపు వెంకట శ్రీనివాస్ కుమార్, లు ఎంపికయ్యారు. వీరు నవంబర్ నెలలో పశ్చిమగోదావరి జిల్లా శృంగ వృక్షంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొని విజయకేతన ఎగరవేశారు దీంతో వీరు మహారాష్ట్ర లోని నాందేడ్ లో ఈ నెల 28,31, తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మహర్ష పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నడింపల్లి వెంకట రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామం ఉపాధ్యాయులు విజయభాస్కర్, ఎం నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం వి ఎస్ ఆర్ కళాశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్..



**ఏలేశ్వరం, జనవరి 27,(ప్రభాతవార్త)** ఏలేశ్వరం విఎస్ఆర్ కళాశాలలో మంగళవారం నాడు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం లో కళాశాల విద్యార్థుల శిబిరంలో విఎస్ఆర్ డిగ్రీ కళాశాల లో పిఠాపురం రామచంద్రరావు గారు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ గోదావరి విభాగ్ కుటుంబ ప్రబోధన్ అధ్యక్షతన మరియు విఎస్ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సత్యనారాయణ గారు సారథ్యంలో మరియు ఉమ్మిడి వెంకట్రావు భారతీయ జనతా పార్టీ పూర్వ ఉపాధ్యక్షులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనియున్నారు . రామచంద్ర రావు గారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు శిబిరంలో పాల్గొని దేశ అన్యోన్యతకు కృషి చేయాలని ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడియున్నారు . అదేవిధంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో తన వంతు సహాయంగా ఈ యొక్క కళాశాలలో పాల్గొని కాకినాడ కైట్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల శిబిరంలో పాల్గొని దేశ అన్యోన్యతకు పాల్పడాలని ఈ సందర్భంగా విద్యార్థులను కోరడం జరిగినది . ఈ యొక్క కార్యక్రమంలో గొల్లపూడి గణేష్ గోరక్షణ విభాగ మరియు బోనుమంతి శ్రీనివాస్ మరియు మధ్య నాగ జగదీష్ జగ్గంపేట కానీ ఖండ సేవా ప్రబుక్, రామకుర్తి సూర్యనారాయణ గారు , దొంతంశెట్టి సుబ్రహ్మణ్యం, తదితరులు స్టూడెంట్స్ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని ఉన్నారు.

## వైస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**రాబోయే రోజుల్లో విజయం మనదే -మాజీ మంత్రి తోట నరసింహం**



**గండేపల్లి జనవరి 27 (ప్రభాతవార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తే రాబోయే రోజుల్లో విజయం మనదేనని మాజీ మంత్రి జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం అన్నారు.స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ రాష్ట్ర వైఎస్సార్ పార్టీ పిలుపుమేరకు గ్రామస్థాయి నుండి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయిలో మన ప్రభుత్వంలో చేసిన పనుల గురించి కూటమి ప్రభుత్వం అబద్ధాలతో చెబుతున్న మాటలకు ప్రతిఘటించాలన్నారు. గత ప్రభుత్వంలో నవరత్నాల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలతో పాటు నగదును నేరుగా మహిళల అకౌంట్లు వేయడం జరిగిందని తెలిపారు.2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో అబద్ధాలతో గెలిచి తిరిగి వైఎస్ఆర్ పార్టీపై బురద జల్లుతున్నారని దాన్ని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలన్నారు, ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ,జిల్లా వైఎస్ఆర్ పార్టీ ఉపాధ్యక్షులు రామకుర్తి మూర్తి, ఎంపీపీ చల్లగళ్ల దొరబాబు, జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షులు రావుల రాజు తాళ్లూరి మధుకుమార్, పరిమి వెంకటేశ్వరావు,కుంచే చినబాబు,

## ఉత్తమ పురస్కారం



**కె.గంగవరం, జనవరి 27, (ప్రభాతవార్త):** గంగవరం మండలంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్,పామర్రు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శివ కేశవ్,డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరావు, పాణింగపల్లి వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఇమాన్యుయల్ లను ఎస్సై జి సోమేంద్ర తో పాటు అధికారులు, ఉన్నత అధికారులు, రెవెన్యూ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు,సహచరులు, గ్రామ ప్రజలు నాయకులు అభినందించారు.

## కుండలేశ్వరం స్వామి వారికి కళ్యాణ మహోత్సవాలు



**కాట్రేనికోన జనవరి 27(ప్రభాతవార్త)** దక్షిణ కాశీగా పేరుపొందిన కుండలేశ్వరం గ్రామంలోని వేంచేసి యున్న శ్రీ పార్వతి కుండలేశ్వర స్వామి వారి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి వారు కళ్యాణ మహోత్సవములను ఈ నెల 28 వ తేదీ నుండి,వచ్చే నెల 2వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు,ఆరు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశామన్నారు,ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలన్నారు, ఈ సందర్భంగా ఆలయానికి పచ్చని తోరణాలతో విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అధర్వంలో తగిన ఏర్పాట్లు చేశారు.

## వాసవి క్లబ్ అధ్యక్షుడిగా సిద్దు ప్రమాణ స్వీకారం




**శంఖవరం, జనవరి 27, (ప్రభాతవార్త):** కత్తిపూడి వాసవి క్లబ్ అధ్యక్షుడిగా కొత్త సిద్దు ప్రమాణ స్వీకారం చేశారు మండలంలోని కత్తిపూడి లో ఆంధ్ర బ్యాంక్ ఎదురుగా మంగళవారం క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాలు మేరకు 2026 కత్తిపూడి వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సెక్రటరీగా ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా నాలం ఆండల్ డిస్టిక్ వి210ఎ గవర్నర్ కృష్ణమోహన్ జిల్లా క్యాబినెట్ టీం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .వాసవి క్లబ్ ప్రెసిడెంట్ గా కొత్త సిద్దు సెక్రటరీగా దంగేటి మురళి ట్రెజరర్ కట్ట బసవయ్య ప్రమాణ స్వీకారం చేశారు . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాసవి క్లబ్ సభ్యులు ఐక్యమత్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని వాసవి క్లబ్ కి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది, ఈ ప్రమాణస్వీకారం వాసవి క్లబ్ కత్తిపూడి బెండపూడి కలిపి చేయడం జరిగింది.

## గొల్లగూడెం బైపాస్ రోడ్డును కొనసాగించాలని వినతి



**అమలాపురం కలెక్టరేట్, జనవరి27,(ప్రభాతవార్త)** అమలాపురం మునిసిపల్టీ 13 వ వార్డులో ఉన్న గొల్లగూడెం బైపాస్ రోడ్డు ను అదే పేరుతో కొనసాగించాలంటూ స్థానికులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవిన్యూ అధికారి మాధవి ని కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గొల్లగూడెం బైపాస్ రోడ్డు గా అటు స్థానికంగాను,రెవిన్యూ రికార్డులలోనూ ప్రాచుర్యం ఉన్న ఈ రోడ్డు పేరును మార్చాలనే ఆలోచనను తాము పూర్తిగా వ్యతిరేకస్తున్నామని తెలిపారు. అందరికీ నానుడిగా ఉన్న ఈ రోడ్డు పేరును డాక్టర్ ఇబి శంకరం గొల్లగూడెం బైపాస్ రోడ్డు గా మార్చుటకు బుధవారం జరగబోవు కౌన్సిల్ సమావేశంలో కొంతమంది ప్రతిపాదన చేస్తున్నట్లు తమ దృష్టి కి రావడం జరిగిందన్నారు. దీనిని స్థానికులు అయిన మేము పూర్తిగా వ్యతిరేకస్తున్నామని, ఈ చర్యలను తక్షణం విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయం పై స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు,ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు, మునిసిపల్ చైర్ పర్సన్ రెడ్డి నాగేంద్ర మణి, కమిషనర్ నిర్మల్ కుమార్, కూటమి కౌన్సిలర్లు ఏడిద శ్రీను,ఆశెట్టి ఆదిబాబు, స్థానిక కౌన్సిలర్ సంసాని బుల్లి నాని లను కలసి వినతిపత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దండుమేను రూపేష్ కుమార్, చిట్టిమేను సత్తిబాబు, వేటూరి సూర్యనారాయణ, వేటూరి శంకరం, కోరశిఖ నాని,చిట్టిమేను గోవింద్, మందపాటి శ్రీనివాస్, మట్ట వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## ఏడువారాల వెంకన్న కు అష్టోత్తరపూజలు.. పాల్గొన్న భక్తులు.



**ఆత్రేయపురం,జనవరి, 27,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం. మంగళవారం ఏడువారాలు ఆచరించే భక్తులతో కిట కిటలాడింది. వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణతోఆలయ పరిసరాలు మార్మోగాయి. ఏడువారాలు పూర్తి అయిన భక్తులు అష్టోత్తరపూజలు, స్వామివారి నిత్య కళ్యాణం లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేసారు.

## యర్రపోతవరంలో పశువైద్య శిబిరం



**కె.గంగవరం, జనవరి 27, (ప్రభాతవార్త):** జనవరి 19 నుంచి 31 జరిగే ఉచిత పశు వైద్య శిబిరాల్లో భాగంగా ఏడి ఒ రామకృష్ణ తో కలిసి సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మండలంలోని యర్రపోతవరం గ్రామంలో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యాన్ని కాపాడితే రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారు ఆర్థికంగా బలపడతారని ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఎంతగానో తమ సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ పశు వైద్య శిబిరాల ద్వారా టీకాలు మందులు వైద్య పరీక్షలు అందించడం తోపాటు పోషకాహారం పై అవగాహన కార్యక్రమం కల్పించారు. అలాగే బాలాంత్రం, తాళ్లపోడు, యర్రపోతవరం గ్రామాల్లో రూ.76 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్లకు డి ఈ శ్రీనివాస్, ఏ ఈ యేసు రత్నం, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విశేష కృషి చేసి నిధులు తీసుకొస్తున్నారని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్,మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, సొసైటీ చైర్మన్ సాపిరెడ్డి దొరబాబు,సెక్రటరీ సూరిబాబు, సర్పంచ్ రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య బాబు, డీసీ సుబ్రమణ్యం ,ఆయా గ్రామాల సర్పంచులు, పశు వైద్య సిబ్బంది, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారి ప్రాణం తీసిన చైనా మాంజా దారం..



**అంబాజీపేట,జనవరి 27,(ప్రభాతవార్త):** పతంగుల దారం ప్రాణం తీసింది. ఉల్లాసంగా ఉత్సాహంగా ఉన్న కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది.సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్లో ఎగుర వేసే గాలిపటాలకు ఉపయోగించే చైనా మాంజా దారం ఒక చిన్నారి ప్రాణాలు తీసింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన పులిదిండి రామ్ సాగర్, పద్మావతి దంపతులు హైదరాబాద్ లో ఉంటూ సంక్రాంతికి కుటుంబ సభ్యులతో సొంతూరు అంబాజీపేటకు వచ్చి తిరిగి ఈ నెల 23న హైదరాబాద్ వెళ్ళారు.ఇంటిపనుల వస్తువుల కొనుగోలు నిమిత్తం తమ చిన్న కుమార్తె నిశ్వికాదిత్య (5) ను వెంటబెట్టుకొని వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో కూకట్ పల్లిలోని సుమిత్రానగర్ వద్దకు వచ్చే సరికి చిన్నారి మెడకు చైనా మాంజా దారం చుట్టుకోవడంతో బైక్ పై ముందు కూర్చున్న నిస్వీకాదిత్య గొంతు వద్ద తీవ్రగాయాలయ్యాయి. దాంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లినా చిన్నారి మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారన్నారు. కాగా రామ్ సాగర్ అంబాజీపేటకు చెందిన పులిదిండి స్వామి కుమార్డు కావటంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

## కల్తీ వంట నునే తయారీ స్థావరంపై పోలీసులు దాడులు..

**పంపిణీకి సిద్ధంగా ఉంచిన 15 లీటర్ల 56 డబ్బాలు సీజ్**

**క్రూడ్ ఆయిల్ 4 డబ్బాలు, తయారీకి వినియోగించే వంట సామాన్లు స్వాధీనం..**

**9 మందిపై కేసు నమోదు -- పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు**



**ప్రత్తిపాడు, జనవరి 27, (ప్రభాతవార్త)** ప్రతిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కల్తీ వంట నూనె తయారుచేస్తున్న ముఠాను ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.కేసు వివరాలు సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం తో కలిసి పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు ప్రత్తిపాడు సర్కిల్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం కు ధర్మవరం పరిసర ప్రాంతాల్లో కల్తీ వంట నూనె తయారు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ధర్మవరం జాతీయ రహదారికి దగ్గర్లో రేకుల షెడ్ లో పెద్ద ఎత్తున కల్తీ వంట నూనె తయారు చేస్తున్న ముఠాను తన సిబ్బందితో కలిసి ఎస్సై అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ దాడుల్లో క్రూడ్ ఆయిల్, జంతువుల కొవ్వును మరగబెట్టి తయారు చేసిన 15 లీటర్ల 56 నునే డబ్బాలు, 4 క్రూడ్ ఆయిల్ డబ్బాలు తోపాటు జంతువుల కొవ్వుతో ఉన్న సంచులు, నూనె తయారీకి వినియోగించే వంట సామానులను సీజ్ చేశారు.

**కల్తీ నూనె తయారీదారుల వివరాలు ఇలా..**

ధర్మవరం జాతీయ రహదారి కానుకుని ఉన్న కాకినాడకు చెందిన ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి రేకుల షెడ్ లో పిఠాపురం మండలం ఎఫ్ కె పాలెం గ్రామానికి చెందిన బండారు పణి ప్రసాద్ జంతువుల కొవ్వు, క్రూడ్ ఆయిల్ తో నకిలీ వంటనూనె తయారు చేస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ఆయిల్ తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసు విచారణలో పిఠాపురం,చెందుర్తి గ్రామాలకు చెందిన తన స్నేహితులు ఏడిద విజయ్ కుమార్, ఆరుగుల సురేష్ కుమార్ నుండి జంతువుల కొవ్వు, కాకినాడ లైట్ హౌస్ ప్రాంతానికి చెందిన చిట్టిబాబు నుండి క్రూడ్ ఆయిల్ తో నకిలీ వంట నూనెను గడిచిన ఏడాది నుండి పిఠాపురం మండలం ఎఫ్.కె పాలెంలో తయారు చేస్తున్నారని నూనె తయారు చేస్తూ దాన్ని ఇచ్ఛాపురంకు చెందిన శ్రీ వెంకటేశ్వరా ట్రేడర్స్ యజమాని సంతోషి శ్రీనివాస్ దాస్, రాజమండ్రి కి చెందిన ఎండి. ఇర్ఫాన్ తో వ్యాపార ఒప్పందం కుదుర్చుకుని కల్తీ నూనె ను సప్లై చేస్తూ,ఎఫ్ కె పాలెం లో పరిస్తితులు అనుకూలంగా లేకపోవడంతో తన వ్యాపారాన్ని ప్రత్తిపాడు మండలం ధర్మవరం లో కాకినాడ కు చెందిన ప్రతాప్ సింగ్ అనువానికి చెందిన రేకుల షెడ్డు అద్దెకు తీసుకొని గత 4 నెలలు నుండి తాటిపర్తి గ్రామానికి



చెందిన నామా నాగూరు, నామా నాని బాబు లకు ఎక్కువ కూలి డబ్బులు ఇస్తూ కల్తీ వంట నూనె తయారు చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. 9 మంది నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందని వారిలో ప్రథమ నిందితుడు బండారు పణి ప్రసాద్ ను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps